

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



ఆదివారం | 14-9-2025 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 150 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, భాద్రపదమాసం, బహుళపక్షం, తిథి: అష్టమి తె.3.06 తదుపరి నవమి, నక్షత్రం: రోహిణి ఉ.8.41 తదుపరి మృగశిర, వర్జ్యం: మ.2.00-3.32, దుర్ముహూర్తం: సా.4.37-5.26, అమృతఘడియలు: శేషం ఉ. 7.11, రా.11.09-12.40, రాహుకాలం: సా.4.30-6.00, సూర్యోదయం: 6.06, సూర్యాస్తమయం: 6.14 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

రాజ్యాంగమే రక్ష!



రాజ్యాంగం ఎంత గొప్పదైనా దాన్ని పరిరక్షించాల్సిన వ్యవస్థల అధిపతులు మంచివాళ్లు కాకపోతే పరిస్థితి ఏమిటి? శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్ పరిణామాల తర్వాత మన దేశంలో కూడా అలాంటి పరిస్థితులు తలెత్తే అవకాశం ఉందా? అన్న అనుమానం కొందరిలోనైనా ఏర్పడటం ఆందోళన కలిగిస్తోంది.

మన ప్రజాస్వామ్య వ్యవస్థ అనేక పరీక్షలకు నిలబడి పరిపక్వత చెందింది. ప్రజలు కూడా ఎప్పటికప్పుడు విజ్ఞత ప్రదర్శించి హద్దులు మీరిన పాలకులకు ఎన్నికల సందర్భంగా బ్యాలెట్ ద్వారా కర్రు కాల్చి వాత పెడుతున్నారు.

ఒక్కసారి అధికారంలోకి వస్తే ఐదేళ్లపాటు విర్రవీగుతూ అధికార దుర్వినియోగానికి, అవినీతికి పాల్పడవచ్చా? అలా చేయడం ప్రజల సహనాన్ని పరీక్షించడం కాదా?

బిల్లుల ఆమోదం విషయంలో గవర్నర్లు, రాష్ట్రపతికి గడువు లేకపోతే ఎలా? అని ప్రశ్నిస్తున్న న్యాయ వ్యవస్థను జగన్మోహన్ రెడ్డి వంటి వారి విషయంలో తీర్పు ఇవ్వడానికి గడువు లేకపోతే ఎలా? అని ప్రజలు ప్రశ్నించకుండా ఉంటారా?

మంత్రిగా, ఎంపీగా, ఎమ్మెల్యేగా పనిచేయడమే కాకుండా ఒక దివంగత ముఖ్యమంత్రికి సోదరుడు, మరో మాజీ సీఎంకు బాబాయి అయిన వివేకానంద రెడ్డి హత్య కేసుకే దిక్కూమొక్కూ లేకపోతే ప్రజలకు న్యాయ వ్యవస్థపైన, ప్రభుత్వాలపైన నమ్మకం ఎందుకుండాలి?

బాధితులకు న్యాయమూర్తులు సత్వర న్యాయం అందిస్తే మిగతా వ్యవస్థలు ఎన్ని వికారాలు పోయినా ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లదు.

కొత్త పలుకు -ఆర్కే విశ్లేషణ 4లో..

వేగం పెంచుదాం!

ఇప్పుడే కుదుటపడుతున్నాం

- టీమ్‌గా విప్లవాత్మక పాలన అందిద్దాం
- దీనికోసం 7 గ్రూపులు ఏర్పాటు
- సాగు, ఇతర మౌలిక రంగాలకు చోటు
- సంక్షేమాన్ని, విద్యను కలపొద్దు
- అన్ని స్థాయిల అధికారులకూ శిక్షణ
- సీఆర్డీయే భవనంలో హెచ్ఆర్‌డీ కేంద్రం
- 2029 నాటికి 29 లక్షల కోట్లకు జీఎస్డీపీ
- మంత్రులు, కార్యదర్శులు కలిసి పనిచేస్తే సత్ఫలితాలు: సీఎం చంద్రబాబు
- కలెక్టర్ల సదస్సుకు సన్నాహంగా వారితో భేటీ



ఎస్పీలతో సమావేశమైన సీఎం చంద్రబాబు. చిత్రంలో హోం మంత్రి అనిత, సీఎస్ విజయానంద్, డీజీపీ హరీశ్ గుప్తా

అమరావతి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ల విధ్వంసం నుంచి ఇప్పుడిప్పుడే కుదుటపడుతున్నామని, ఇక పాలనలో వేగం పెంచాలని మంత్రులు, కార్యదర్శులకు ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. సోమ, మంగళవారాల్లో నిర్వహించనున్న కలెక్టర్ల సదస్సుకు సన్నాహంగా సీఎం క్యాంపు కార్యాలయంలో శనివారం మంత్రులు, కార్యదర్శులతో

మిగతా 12వ పేజీలో...

రాజకీయ ముసుగులో నేరాలు చేస్తే

తొక్కిపడేయండి

- శాంతి భద్రతలపై రాజీ పడొద్దు
- సైకోలపై ఉక్కుపాదం మోపండి
- టెక్నాలజీతో నేరాలకు అడ్డుకట్ట
- ఎస్పీలతో భేటీలో సీఎం వెల్లడి

13

14 జిల్లాలకు కొత్త ఎస్పీలు

ఏడుగురు కొత్తవారికి చాన్స్

- కడప ఎస్పీగా నచికేత్ విశ్వనాథ్
- ఇంటెలిజెన్స్ నుంచి జిల్లా బాధ్యతలు 3
- తిరుపతి ఎస్పీ ప్రకాశం జిల్లాకు బదిలీ
- చివరిక్షణంలో ఆగిన విశాఖ సీపీ, ఐజీల బదిలీ

అప్రమత్తంగా ఉండండి

- కుల, మతాల మధ్య చిచ్చు పెడుతున్నారు
- సామాజిక మాధ్యమాల ముసుగులో చిచ్చు
- ఆవేశాలకు లోనై ఘర్షణకు తావీయొద్దు
- రెచ్చగొట్టేవారిపై ఫిర్యాదు చేయండి
- శ్రేణులకు డిప్యూటీ సీఎం పవన్ సూచన







ఆటో డ్రైవర్లకు 12

దసరా కానుక

- 15 వేలు చొప్పున సాయం
- 17 నుంచి దరఖాస్తుల స్వీకరణ
- 1న అర్హుల ఖాతాల్లో నగదు జమ
- ప్రభుత్వ ఉత్తర్వులు విడుదల



14

కొండలు, లోయల మధ్య..

విశ్వాసమనే వారధి వేయాలి

- భరతమాత కిరీటంలో మణిపూర్ ఒక రత్నం
- అక్కడ ఎలాంటి హింసకు తావుండొద్దు
- ఈశాన్య రాష్ట్రాల పర్యటనలో ప్రధాని మోదీ

పిడుగుపాటుకు ఐదుగురు మృతి

- వాగులో కొట్టుకుపోయిన ఇద్దరు మహిళలు 2
- కోస్తాలో వర్ష బీభత్సం
- పలు జిల్లాల్లో కుండపోత
- నేడూ భారీ వర్షాలు



10

ఆసియా కప్‌లో నేడు భారత్-పాక్ పోరు



రోడ్‌షోలో ప్రసంగిస్తున్న విజయ్, భారీగా తరలివచ్చిన జనసందోహం

ఆ పార్టీకి మళ్లీ ఓటెందుకేయాలి?

- హామీల అమలులో డీఎంకే విఫలం.. పాత పింఛన్ అంటూ మోసం: విజయ్
- తిరుచ్చిలో బస్సుయాత్ర ప్రారంభం.. తొలిసారిగా జనంలోకి రాక
- రోడ్‌షోకు రెండు లక్షల మంది జనం

చెన్నై, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): గత అసెంబ్లీ ఎన్నికల్లో 500లకు పైగా హామీలను గుప్పించి అధికారంలోకి వచ్చిన డీఎంకే.. వాటి అమలులో మాత్రం విఫలమైందని తమిళగ వెట్రి కళగం(టీవీకే) పార్టీ అధినేత, సినీ నటుడు విజయ్ విమర్శించారు. అలాంటి పార్టీకి మళ్లీ ఓటెందుకు వేయాలని ప్రశ్నించారు. పార్టీని ప్రారంభించిన రెండేళ్ల తరువాత తొలిసారిగా విజయ్ జనంలోకి వచ్చారు. 'రాక్‌ఫోర్ట్' సిటీగా పేరుగాంచిన తిరుచ్చి నగరంలో శనివారం ఆయన బస్సు యాత్రను ప్రారంభించారు. ఆయనకు పార్టీ శ్రేణులు అపూర్వ స్వాగతం పలికాయి. సుమారు రెండు లక్షలమందిదాకా ఈ రోడ్‌షోలో పాల్గొన్నారు. భారీగా తరలివచ్చిన అభిమానులు, వారి వాహనాలతో తిరుచ్చిలో ట్రాఫిక్ స్తంభించిపోయింది. కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి పి.చిదంబరం కూడా ట్రాఫిక్‌లో చిక్కుకోవడంతో పోలీసులు ఆయనకు ప్రత్యామ్నాయ మార్గాలు చూపాల్సి వచ్చింది. ప్రచారం వాహనంపై నిలిచి లక్షలాదిగా తరలివచ్చిన జనాన్ని ఉద్దేశించి విజయ్ ప్రసంగిస్తూ.. విద్యారుణాలను పూర్తిగా మాఫీ చేస్తామని, ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు 40 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని డీఎంకే ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. డీఎంకే ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందని, పాత పింఛన్ పద్ధతిని అమలు చేస్తామని ఉద్యోగులను మోసగించిందని మండిపడ్డారు. హామీలు అమలు చేయని డీఎంకేకు ఎలా ఓటేస్తారని ప్రశ్నించారు. కాగా, విజయ్ పర్యటనలో అనుభవలేమి కనిపించింది. మైకులు సరిగా పని చేయకపోవడం, విజయ్ ఏం మాట్లాడుతున్నారో అర్థం కాకపోవడంతో ఆయన అభిమానులు రభసకు దిగారు. తిరుచ్చి అనంతరం అరియలూరులోనూ విజయ్ పర్యటన కొనసాగింది. పలు నియోజకవర్గాల్లో విజయ్ పర్యటించనున్నారు. డిసెంబరు 20వ తేదీ వరకు ప్రతి శని, ఆదివారాల్లో ఈ పర్యటన కొనసాగనుంది.

మెడ్‌టెక్ జోన్‌లో 'వైజాగ్ హ్యాండ్'

- కృత్రిమ చేతుల తయారీ ప్రారంభం
- దివ్యాంగుల కోసం ఇతర పరికరాలు కూడా..

విశాఖపట్నం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలోని ఏపీ మెడ్‌టెక్ జోన్‌లో కొత్తగా దివ్యాంగులకు కృత్రిమ చేతుల తయారీ ప్రారంభించారు. ఈ చేతులను 'వైజాగ్ హ్యాండ్'గా వ్యవహరిస్తున్నారు. కాలు లేని దివ్యాంగులకు 'జైపూర్ ఫుట్' ఎలాగో చేతులు లేని వారికి 'వైజాగ్ హ్యాండ్' అలా పనిచేస్తుందని సీఈఓ జితేంద్రశర్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నంలో ఇటీవల జరిగిన ప్రమాదంలో ఓ మహిళ చేయిని కోల్పోగా ఆమెకు మయోఎలక్ట్రిక్ ప్రోస్థటిక్ హ్యాండ్ తయారుచేసి అమర్చామని, దాంతో ఆమె అన్ని పనులు చేసుకోగలుగుతున్నారని వివరించారు. దివ్యాంగులకు అవసరమైన కాళ్లు, చేతులతో పాటు సోలార్‌తో పనిచేసే వీల్ ఛైర్లను కూడా రూపొందిస్తున్నామని జితేంద్ర శర్మ వెల్లడించారు.



మయోఎలక్ట్రిక్ ప్రోస్థటిక్ హ్యాండ్

పిడుగుపాటుకు ఐదుగురు మృతి

- కొండవాగులో కొట్టుకుపోయిన ఇద్దరు మహిళలు
- కోస్తాలో వర్ష బీభత్సం.. పలు జిల్లాల్లో కుండపోత
- గుంటూరు, ఏలూరు నగరాల్లో రోడ్లపైనే ప్రవాహాలు
- సెల్లార్లు, లోతట్టు ప్రాంతాల్లోకి భారీగా వరద
- ఏజెన్సీలో పొంగి ప్రవహించిన కొండవాగులు
- గోదావరికి మళ్లీ పెరుగుతున్న వరద
- నేడూ కోస్తాలో భారీ వర్షాలు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)





ఏలూరులోని పవర్‌పేటలో నీట మునిగిన రోడ్డు, గుంటూరులో వర్షం నీటిలో ద్విచక్రవాహనదారుల అవస్థలు

అల్పపీడనం, ఉపరితల ఆవర్తనం, ద్రోణి ప్రభావంతో కురిసిన భారీ వర్షాలు కోస్తా ప్రాంతంలో బీభత్సం సృష్టించాయి. పలు జిల్లాల్లో కుండపోత వర్షాలు కురిశాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో శనివారం మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో వాన విరుచుకుపడింది. పలుచోట్ల పిడుగులు పడటంతో ఈ రెండు జిల్లాల్లో కలిపి ఐదుగురు మరణించారు. గుంటూరు జిల్లా పెదకాకాని మండలం నంబూరులో దాసరి సారమ్మ(39), దాసరి రాణి(41), పెద నందిపాడు మండలం అనపర్రులో దేవరపల్లి సామ్రాజ్యం(61), తన్నీరు నాగమ్మ(41), పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలం గుత్తికొండ గ్రామానికి చెందిన దానుపాటి వెంకటేశ్వర్లు(63) పిడుగుపాటుకు దుర్మరణం చెందారు. సుమారు రెండు గంటలకు పైగా కుండపోతగా కురిసిన వర్షంతో గుంటూరు నగరంలోని రోడ్లన్నీ ఏరులై ప్రవహించాయి. దీంతో ఎక్కడికక్కడ ట్రాఫిక్ స్తంభించిపోయింది. అపార్టుమెంట్లు, కమర్షియల్ కాంప్లెక్స్‌ల సెల్లార్లలోకి భారీగా నీరు చేరింది. సెల్లార్లు, రోడ్లపై పార్కింగ్ చేసిన వాహనాలు నీటిలో మునిగిపోవడంతో అవి మొరాయించాయి. లోతట్టు ప్రాంతాల్లోకి వరదనీరు చేరడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఏలూరు జిల్లాలో శుక్రవారం అర్ధరాత్రి నుంచి కుండపోతగా వర్షాలు కురవడంతో ఏజెన్సీ ప్రాంతాల్లో కొండవాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. ఏలూరు నగరంలో రహదారులపై ఉధృతంగా వర్షం నీరు ప్రవహించడంతో రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. తమ్మిలేరు, ఎర్రకాలువ, వేలేరుపాడులో పెద వాగుకు వరద పోటెత్తింది. నాగిరెడ్డిగూడెం తమ్మిలేరు ప్రాజెక్టు నుంచి 2 వేలు క్యూసెక్కులు, కొంగువారిగూడెం ఎర్రకాలువ ప్రాజెక్టు నుంచి 1550 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. ఇక ఆంధ్ర-తెలంగాణ సరిహద్దు ప్రాంతం చెన్నాపురం వద్ద కొండవాగులు దాటుతూ ఇద్దరు మహిళలు కొట్టుకుపోయారు. ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం పూచికపాడు గ్రామానికి చెందిన ఏడుగురు మహిళలు తెలంగాణ రాష్ట్రం అశ్వారావుపేట మండలం చెన్నాపురానికి చెందిన పామాయిల్ తోటలో శనివారం పనికి వెళ్లారు. వారంతా పని ముగించుకుని తిరిగి వచ్చే క్రమంలో చెన్నాపురం వద్ద కొండవాగు దాటుతూ పాలడుగుల చెన్నమ్మ(50), పచ్చిపాల వరలక్ష్మి(50) గల్లంతయ్యారు. రాత్రి వరకు ఆ ఇద్దరి ఆచూకీ తెలియలేదు. ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాల్ని సిద్ధం చేసినట్టు జీలుగుమిల్లి సీఐ వెంకటేశ్వరరావు చెప్పారు. జీలుగుమిల్లి మండలం రాచన్నగూడెం సమీపంలోని చిన్నవాగు ఉధృతంగా ప్రవహించడంతో సీఐతోపాటు ఎస్‌ఐ కాంత్రికుమార్ సిబ్బంది చిన్నవాగు వద్దే ఆగిపోవాల్సి వచ్చింది.

ఎక్కడ ఎంత వానంటే..

తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడి, ఏలూరు జిల్లా లింగపాలెంలలో 8.7, ద్వారకాతిరుమలలో 7.6, గుంటూరు జిల్లా పెదకాకానిలో 7.7, సత్తెనపల్లిలో 7.5, వల్లభాపురంలో 7.4, గుంటూరు నగరంలో 7.2, కృష్ణా జిల్లా నూజివీడులో 7.1, తోటవల్లూరులో 7.0, ప్రకాశం జిల్లా దర్శిలో 6.8 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. రాష్ట్రంలోని 47 ప్రాంతాల్లో 4 సెంటీమీటర్లపైగా వాన పడింది. ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల వర్షాలు, కోస్తాలో అక్కడక్కడ భారీవర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. కాగా, ఆదివారం కోస్తాలోని పలు జిల్లాల్లో పిడుగులతో కూడిన వర్షాలు కురుస్తాయని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. శ్రీకాకుళం, కోనసీమ, ఉభయ గోదావరి, ఏలూరు, కృష్ణా, గుంటూరు, బాపట్ల, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో మోస్తరు వర్షాలు, మిగతా జిల్లాల్లో తేలికపాటి జల్లులు పడే అవకాశం ఉందని పేర్కొంది. తీరం వెంబటి గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని తెలిపింది.



ఏలూరు జిల్లా రేపల్లెవాడ కాజ్‌వేపై ప్రవహిస్తున్న కొవ్వాడ కాల్వ



పోలవరం స్పిల్‌వే వద్ద గోదావరి వరద ఉధృతి

అనూహ్యంగా పెరిగిన గోదావరి

భారీ వర్షాలకు గోదావరి ఉప నదులు శబరి, సీలేరు, మంజీర, ప్రవర, ఇంద్రావతి పొంగి గోదావరిలో కలుస్తున్నాయి. దీంతో శనివారం సాయంత్రానికి గోదావరి నీటిమట్టం అనూహ్యంగా పెరిగింది. పోలవరం నుంచి 4,35,010 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేసినట్టు జలవనరుల శాఖ అధికారులు తెలిపారు. పోలవరం స్పిల్వే ఎగువన 29.700, దిగువన 20.300, భద్రాచలం వద్ద 31.20 అడుగులకు నీటిమట్టం చేరింది.

నిండుకుండల్లా ప్రాజెక్టులు

ప్రధాన జలాశయాల్లోకి పెరిగిన వరద

అమరావతి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రధాన జలాశయాలన్నీ నిండుకుండను తలపిస్తున్నాయి. నీటి నిల్వలు దాదాపుగా గరిష్ఠ స్థాయికి చేరుకున్నాయి. నదీ పరివాహక ప్రాంతాల్లో భారీ వర్షాలు లేకున్నా.. ఎగువ నుంచి భారీగా వరద వస్తోంది. శ్రీశైలం ప్రాజెక్టు గరిష్ఠ నీటి నిల్వ 215.81 టీఎంసీలకు గాను 97.55 శాతం అంటే.. 210.51 టీఎంసీలు ఉన్నాయి. శ్రీశైలం జలాశయంలోకి ఎగువ నుంచి 2,60,659 క్యూసెక్కుల వరద వస్తుండగా, దిగువకు 2,54,279 క్యూసెక్కులు వదులుతున్నారు. నాగార్జున సాగర్ గరిష్ఠ నీటి నిల్వ 312.05 టీఎంసీలకు గాను 99.62 శాతం అంటే.. 310.61 టీఎంసీలు ఉన్నాయి. ప్రాజెక్టులోకి 1,97,564 క్యూసెక్కుల వరద వస్తుండగా, దిగువకు అదే స్థాయిలో వదులుతున్నారు. పులిచింతల సామర్థ్యం 45.77 టీఎంసీలకు గాను 90.86 శాతం.. 41.59 టీఎంసీల జలాలు నిల్వ ఉన్నాయి. పులిచింతలకు 1,24,790 క్యూసెక్కుల వరద వస్తుండగా, కిందకు 1,29,393 క్యూసెక్కులు వదులుతున్నారు. ప్రకాశం బ్యారేజీ గరిష్ఠ నీటి నిల్వ 3.07 టీఎంసీలకు గాను 100 వంద శాతం నిండిపోయింది. ప్రకాశం బ్యారేజీకి వస్తున్న 1,42,293 క్యూసెక్కుల జలాలను వచ్చినట్లుగానే విడిచిపెడుతున్నారు.

ప్రధాన ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు

ప్రాజెక్టు	గరిష్ఠ నిల్వ (టీఎంసీలు)	ప్రస్తుత నిల్వ (టీఎంసీలు)	శాతం	ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	అవుట్ ఫ్లో (క్యూసెక్కులు)
శ్రీశైలం	215.81	210.51	97.55	2,60,659	2,54,279
నాగార్జున సాగర్	312.05	310.61	99.62	1,97,564	1,97,564
పులిచింతల	45.77	41.59	90.86	1,24,790	1,29,393
ప్రకాశం	3.07	3.07	100.00	1,42,393	1,42,393
ధవళేశ్వరం	2.93	2.71	92.76	3,60,395	3,93,942

లోకం తీరు





పోలీసులు స్వాధీనం చేసుకున్న నగదు, బంగారం

'రియల్' వ్యాపారమని నమ్మించి..

కోటిపైనే కొట్టేసిన మహిళ

- ఓ బ్యాంకు మేనేజర్‌కు టోకరా
- అరెస్టు చేసిన నిడదవోలు పోలీసులు
- నగలు, 4.9 లక్షల నగదు స్వాధీనం

నిడదవోలు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): రియల్ ఎస్టేట్ వ్యాపారం చేద్దామని, ఎక్కువగా డబ్బులు గడిద్దామని చెప్పి ఓ బ్యాంక్ మేనేజర్ వద్ద నగదు కొట్టేసింది ఓ మహిళ. బాధితుడి ఫిర్యాదు మేరకు మహిళను పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు నిడదవోలులో శనివారం సీఐ పీవీజీ తిలక్ వెల్లడించిన వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు ఎస్‌బీఐ బ్రాంచిలో గతంలో చప్పిడి శ్రీనివాస్ మేనేజర్‌గా పనిచేసేవారు. ఆ సమయంలో నిడదవోలు ఎన్టీఆర్ కాలనీకి చెందిన అంబటి ఉమ.. అలియాస్ శ్రావ్యారెడ్డి లోను కోసమని బ్యాంకుకు వెళ్లి మేనేజర్‌తో పరిచయం పెంచుకుంది. తనకు నూజివీడులో పొలాలు ఉన్నాయని, అక్కడ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తే ఎక్కువ లాభాలు వస్తాయని శ్రీనివాస్‌కు మాయమాటలు చెప్పి నమ్మించింది. ఆ మాటలు నమ్మిన ఆయన తన సొంత డబ్బులు రూ. కోటి పైనే ఆమెకు ఇచ్చారు. అనంతరం ఆమె తాత్సారం చేస్తుండటంతో అనుమానం వచ్చి తన డబ్బు వెనక్కి ఇచ్చేయాలని కోరారు. అయినా ఆమె స్పందించలేదు. డబ్బులు అడిగితే కేసులు పెడతానని బెదిరించింది. దీంతో మేనేజర్ శ్రీనివాస్ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి డీఎస్పీ జి.దేవ కుమార్ పర్యవేక్షణలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మేనేజర్‌ను మోసగించిన మహిళను శుక్రవారం అరెస్టు చేసి ఆమె వద్ద నుంచి 312 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ. 4.93 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ప్రస్తుతం బ్యాంక్ మేనేజర్ హైదరాబాద్ మెయిన్ బ్రాంచిలో పనిచేస్తున్నట్టు చెప్పారు.

నేటి నుంచి మహిళా సాధికార సదస్సు

- లోక్‌సభ స్పీకర్ సహా 200కు పైగా ప్రతినిధులు తిరుపతికి రాక
- ప్రారంభోత్సవానికి సీఎం చంద్రబాబు హాజరు
- ముగింపు సభకు రానున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

తిరుపతి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఆదివారం నుంచి రెండు రోజుల పాటు జరగనున్న జాతీయ మహిళా సాధికార సదస్సుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. సదస్సుకు లోక్‌సభ స్పీకరు ఓంబిర్లా సహా పార్లమెంటు, రాష్ట్రాల అసెంబ్లీల మహిళా సాధికార కమిటీల సభ్యులు హాజరు కానున్నారు. దేశవ్యాప్తంగా 200 మందికి పైగా ప్రతినిధులు పాల్గొననున్న ఈ సదస్సు ప్రారంభ కార్యక్రమానికి సీఎం చంద్రబాబు హాజరై ప్రసంగించనున్నారు. ముగింపు కార్యక్రమానికి గవర్నర్ అబ్దుల్ నజీర్ రానున్నారు. తిరుపతి శివార్లలోని రాహుల్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగే ఈ సదస్సును లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఆదివారం ఉదయం ప్రారంభిస్తారు. సదస్సుకు రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్, పార్లమెంటు మహిళా సాధికార కమిటీ చైర్‌పర్సన్ దగ్గుబాటి పురందేశ్వరి, ఏపీ స్పీకర్ అయ్యన్న పాత్రుడు, శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేను రాజుతో పాటు పలువురు రాష్ట్ర మంత్రులు పాల్గొంటున్నారు. 'వికసిత్ భారత్ కోసం మహిళల ఆధ్వర్యంలో అభివృద్ధి' అనే ప్రధాన లక్ష్యంతో జెండర్ రెస్పాన్సివ్ బడ్జెటింగ్, కొత్త సాంకేతిక సవాళ్ల నేపథ్యంలో మహిళా సాధికారత అనే రెండు అంశాలపై ప్రతినిధులు చర్చించనున్నారు. పలు కీలక తీర్మానాలు ఆమోదించనున్నారు. సదస్సుకు రాష్ట్ర ప్రభుత్వం ఆతిథ్యం ఇస్తుండడంతో జిల్లా యంత్రాంగం ప్రతిష్టాత్మకంగా తీసుకుని భారీ ఏర్పాట్లు చేసింది. ప్రతినిధులకు బస, రవాణా సదుపాయాలతో పాటు తిరుమల, శ్రీకాళహస్తి ఆలయాల్లో దర్శనాలకు సైతం ఏర్పాట్లు చేసింది.

సీఎం చంద్రబాబు పర్యటన ఇలా...

సీఎం చంద్రబాబు ఆదివారం ఉదయం ఉండవల్లిలోని తన నివాసం నుంచి హెలికాప్టరులో బయలుదేరి 9 గంటలకు తిరుపతి చేరుకుంటారు. శ్రీ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగే విట్ విద్యాసంస్థల వ్యవస్థాపకుడు విశ్వనాథం మనవరాలి వివాహానికి హాజరవుతారు. అనంతరం 10 గంటలకు సదస్సు జరిగే కన్వెన్షన్ సెంటర్‌కు చేరుకుని ఓం బిర్లాను ఆహ్వానిస్తారు. ప్రతినిధులనుద్దేశించి ప్రసంగిస్తారు. మధ్యాహ్నం అక్కడే భోజనం చేస్తారు. 2.15 గంటలకు హెలికాప్టర్‌లో ఉండవల్లికి తిరుగు ప్రయాణమవుతారు. కాగా, గవర్నర్ ఆదివారం ఉదయం తిరుపతి చేరుకుని ఓ వివాహ వేడుకలో పాల్గొంటారు. అనంతరం నగరంలోనే బస చేస్తారు. సోమవారం జాతీయ మహిళా సాధికార సదస్సు ముగింపు కార్యక్రమానికి హాజరవుతారు.

ఒక్క రోజే 60,953 కేసుల పరిష్కారం

- రాష్ట్రవ్యాప్తంగా లోక్ అదాలత్‌లకు విశేష స్పందన

అమరావతి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా లోక్ అదాలత్‌లకు విశేష స్పందన లభించింది. వీటి ద్వారా శనివారం ఒక్క రోజే 60,953 కేసులు పరిష్కారమయ్యాయి. మొత్తం రూ.109.99 కోట్ల పరిహారాన్ని బాధితులకు అందజేశారు. జాతీయ న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు హైకోర్టు చీఫ్ జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, ఏపీ న్యాయసేవాధికార సంస్థ కార్యనిర్వహణ అధ్యక్షులు జస్టిస్ ఎస్.రవినాథ్ తిల్హరి, హైకోర్టు న్యాయసేవల కమిటీ అధ్యక్షులు జస్టిస్ ఆర్.రఘునందనరావు మార్గదర్శకంలో రాష్ట్రవ్యాప్తంగా 381 లోక్ అదాలత్ బెంచ్‌లు నిర్వహించారు. రాజీకి అవకాశం ఉన్న కేసులను పరిష్కరించారు. హైకోర్టు న్యాయసేవల కమిటీ ఆధ్వర్యంలో హైకోర్టు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన లోక్ అదాలత్‌లో న్యాయమూర్తి జస్టిస్ వై.లక్ష్మణరావు పెండింగ్‌లో ఉన్న 108 కేసులను పరిష్కరించి రూ.2.05 కోట్లను బాధితులకు పరిహారంగా అందజేశారు. లోక్ అదాలత్‌లు విజయవంతానికి సహకరించిన న్యాయవాదులు, కక్షిదారులు, అధికారులకు ఏపీ న్యాయసేవాధికార సంస్థ సభ్యకార్యదర్శి బీఎస్‌వీ హిమబిందు, హైకోర్టు న్యాయసేవల కమిటీ కార్యదర్శి జి.మాలతి కృతజ్ఞతలు తెలిపారు.



చెరకు.. ఎంత పొడుగో!

చెరకు సాధారణంగా ఎనిమిది నుంచి పదడుగుల ఎత్తు పెరుగుతుంది. కానీ దీనిని చూశారా.. సుమారు 30 అడుగుల ఎత్తు పెరిగి.. రెండంతస్థుల డాబా పైకి వెళ్లిపోతోంది. తూర్పుగోదావరి జిల్లా చాగల్లు మండలం ఊనగట్ల గౌడపేటలో బొర్రా సూరిబాబు ఇంటి వద్ద పెరుగుతున్న ఈ చెరకు గెడను చూసినవారు వామ్మో.. ఎంత పొడుగో అని ఆశ్చర్యపోతున్నారు.

- చాగల్లు, ఆంధ్రజ్యోతి

14 జిల్లాలకు ఎస్పీల నియామకం

- కడప ఎస్పీగా విశ్వనాథ్
- ఇంటెలిజెన్స్ నుంచి జిల్లా బాధ్యతలు
- తిరుపతి ఎస్పీ ప్రకాశం జిల్లాకు బదిలీ
- వీరిలో ఏడుగురు కొత్తవారికి అవకాశం
- మరో ఏడుగురు అధికారులకు స్థానచలనం
- చివరి క్షణంలో ఆగిన విశాఖ సీపీ, ఐజీల బదిలీ

అమరావతి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): రాయలసీమలో కీలకమైన కడప జిల్లాకు ప్రభుత్వం కొత్త సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్(ఎస్పీ)ని నియమించింది. ప్రస్తుతం ఇంటెలిజెన్స్ ఎస్పీగా ఉన్న నచికేత్ విశ్వనాథ్‌ను కడపకు పంపింది. అదేవిధంగా తిరుపతి ఎస్పీగా ఉన్న హర్షవర్ధన్‌రాజును ప్రకాశం జిల్లాకు బదిలీ చేసింది. ఇలా.. మొత్తం 14 జిల్లాలకు ఎస్పీలను నియమించింది. వీరిలో ఏడుగురు కొత్తవారు కాగా, మరో ఏడుగురిని ప్రస్తుతం పనిచేస్తున్న జిల్లాల నుంచి మరో జిల్లాకు పంపించింది. దీంతో కొన్ని నెలలుగా జరుగుతున్న జిల్లా ఎస్పీల బదిలీ ప్రక్రియపై చర్చకు ప్రభుత్వం ముగింపు పలికింది. రాష్ట్రంలోని 26 జిల్లాల్లో విశాఖపట్నం పోలీస్ కమిషనర్‌తో పాటు పలు జిల్లాల ఎస్పీలు, డీఐజీలు, ఐజీలు, హెచ్‌వోడీల బదిలీ ఉంటుందని ప్రచారం జరిగినా 14 జిల్లాల్లో మాత్రమే ప్రభుత్వం మార్పులు, చేర్పులు చేసింది. 7 జిల్లాలకు కొత్త వారిని నియమించగా, ఇప్పటికే జిల్లాల్లో పనిచేస్తున్న మరో ఏడుగురు ఎస్పీలను ఇతర జిల్లాలకు పంపింది. విజయవాడ, విశాఖపట్నం పోలీసు కమిషనర్లతో పాటు మిగతా 12 జిల్లాల్లో ఎలాంటి మార్పు చేయలేదు. కడప, అన్నమయ్య, తిరుపతి, నెల్లూరు, బాపట్ల, కోనసీమ జిల్లాలకు కొత్త వారిని నియమించింది. విజయనగరం, కృష్ణా, గుంటూరు, పల్నాడు, ప్రకాశం, చిత్తూరు, శ్రీ సత్యసాయి జిల్లాలకు ఇతర జిల్లాల ఎస్పీలను ప్రభుత్వం నియమించింది. డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా నేతృత్వంలో ఉన్నతాధికారులు రూపొందించిన బదిలీల జాబితాపై సమీక్షించిన సీఎం చంద్రబాబు శనివారం స్వయంగా ఎస్పీలతో మాట్లాడారు. అనంతరం.. ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ రత్న, నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా, కడప ఎస్పీ అశోక్ కుమార్, నెల్లూరు జిల్లా ఎస్పీ కృష్ణకాంత్, పల్నాడు ఎస్పీ కంచి శ్రీనివాసరావు, కృష్ణా ఎస్పీ ఆర్. గంగాధర్‌రావుకు ప్రభుత్వం ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. ఎస్పీల బదిలీలకు సంబంధించిన వివరాలు ఇవీ..

అధికారి	ప్రస్తుత స్థానం(జిల్లా)	బదిలీ స్థానం(ఎస్పీ)
ఎ.ఆర్. దామోదర్	ప్రకాశం	విజయనగరం
విద్యాసాగర్ నాయుడు	అన్నమయ్య	కృష్ణా
వకుల్ జిందాల్	విజయనగరం	గుంటూరు
బి. కృష్ణారావు	కోనసీమ	పల్నాడు
హర్షవర్ధన్ రాజు	తిరుపతి	ప్రకాశం
తుషార్ డూడీ	బాపట్ల	చిత్తూరు
నచికేత్ విశ్వనాథ్	ఇంటెలిజెన్స్ ఎస్పీ	కడప
సతీశ్ కుమార్	గుంటూరు	శ్రీసత్యసాయి
సునీల్ షెరాన్	కమాండర్, గ్రేహౌండ్స్, విశాఖ	నంద్యాల
ధీరజ్ కనుబిలి	అడిషనల్ ఎస్పీ అల్లూరి	అన్నమయ్య
అజితా వెజెండ్ల	డీసీపీ, విశాఖ సిటీ	నెల్లూరు
ఎల్. సుబ్బరాయుడు	రెడ్‌శాండల్ టాస్క్‌ఫోర్స్	తిరుపతి
బి. ఉమామహేశ్వర్	సీఐడీ(అడ్మిన్)	బాపట్ల
రాహుల్ మీనా	రైల్వే ఎస్పీ, గుంతకల్లు	కోనసీమ

ఇదేం గోల గోవిందా!

- కొండకు మద్యంబాబుల బెడద
- ఉచిత భోజనం, వసతి దొరకడంతో కొన్నేళ్లుగా ఇక్కడే తిష్ట వేసిన వైనం
- పగలు ఏవేవో పనులతో కాలక్షేపం
- రాత్రయితే అరాచక,అపచార చేష్టలు
- తింటూ, తాగుతూ రోడ్లపై వీరంగం
- షెడ్లు, యాత్రికుల వసతి సముదాయాలు, షాపింగ్ కాంప్లెక్స్ వీరి అడ్డాలు
- గోవిందనామ స్మరణ జరిగేచోట ఇవేం ఆగడాలంటూ నొచ్చుకుంటున్న భక్తులు

(తిరుమల-ఆంధ్రజ్యోతి)



పవిత్రభావనతో స్వామివారిని దర్శించుకునే భక్తులకు పట్టెడన్నం పెట్టి సేదతీర్చే తిరుమల కొండపై ఆకయితాల ఆగడాలు అదుపు తప్పాయి. ఉచిత భోజనం, వసతి దొరుకుతుండటంతో చాలా మంది కొండపైనే తిష్టవేశారు. వారు పగలు నామాలు పెట్టడం, దేవుని పటాలు, బొమ్మలు విక్రయిస్తూ గడుపుతున్నారు. అందరూ కాదుగానీ, వీరిలో కొందరు రాత్రి అయితే మద్యం తాగి కొండపై హల్‌చల్ చేస్తున్నారు. నిత్యం గోవింద నామస్మరణ జరిగే ప్రాంతం తిరుమల కొండ. అలాంటి చోట అక్కడ తరచూ ఘర్షణలు జరుగుతూ, మద్యం మత్తులో కొందరు కేకలు వేస్తూ రోడ్లమీద తిరుగుతుండటం, భక్తులను భయభ్రాంతులకు గురిచేస్తోంది. కొండ పవిత్రతకు అపచారం తెచ్చిపెట్టే ఘటనలు ఇటీవల పెరిగిపోయాయి. గత గురువారం రాత్రి మద్యం మత్తులో హేమకుమార్ అనే హాకరు మరో మహిళా హాకర్ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించి చీపురు కర్రతో దెబ్బలు తిన్నాడు. అంతేకాదు, గత ఐదారేళ్లలో కొందరు వ్యక్తులు మద్యం, మాంసం, గంజాయి విక్రయిస్తూ, పట్టుబడిన సందర్భాలున్నాయి. ఇలాంటి వ్యక్తులు క్షేత్ర పవిత్రత, ప్రశాంతతను దెబ్బతీస్తున్నారు. 'ఇదేం గోల గోవిందా' అంటూ భక్తులు వాపోయే పరిస్థితి వచ్చింది.

ఇబ్బందిపడుతున్న భక్తులు

తిరుమల కొండకు వస్తున్నవారిలో కొంత మంది అక్కడే ఏవో పనులు చూసుకుంటున్నారు. సొంతూర్లలో అప్పులైపోయినా, ఏదైనా గొడవలైనా భక్తుల్లో కలిసిపోయి జీవించడానికి తిరుమల అనువుగా మారిపోయింది. దీంతో తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్ణాటక, తమిళనాడు నుంచీ చాలా మంది తిరుమల కొండెక్కేస్తున్నారు. ఎక్కినవారు తిరిగి దిగడం లేదు. హాకర్లుగా కొంతమంది, భవన కార్మికులుగా మరి కొందరు కొండను అడ్డాగా మార్చుకున్నారు. వీరిలో కొంతమంది తరచూ ఆలయ నిబంధనలను భంగపరుస్తున్నారు. మాంసం తీసుకుంటూ, మద్యం తాగుతూ కొందరు హడావుడి చేస్తే, గంజాయి మత్తులో మరికొందరు వీరంగం సృష్టిస్తున్నారు. తిరుమలలోని షెడ్లు, యాత్రికుల వసతి సముదాయాలు, షాపింగ్ కాంప్లెక్స్ ప్రాంతంలోని తాత్కాలిక షెడ్లు వీరి అడ్డాలు.

అపచారం..

- ఈ ఏడాది జనవరి 17వ తేదీన తమిళనాడులోని తిరువళ్లూరుకు చెందిన 28 మందితో కూడిన అన్యమత బృందం తిరుమలలోని రాంభగీచ వద్ద కోడిగుడ్ల కూర, పులావ్ తినడం విమర్శలకు దారి తీసింది.
- మార్చి 13వ తేదీన కర్ణాటకకు చెందిన ఓ యువకుడు మద్యం తాగి మాడవీధుల్లోని అర్చకనిలయం సమీపంలో ఉన్న గ్యాలరీల్లో హల్‌చల్ చేశారు. ఓ మహిళతో అసభ్యంగా ప్రవర్తించడంతో పాటు పోలీసులకు కూడా మద్యం విక్రయిస్తానంటూ వీరంగం సృష్టించాడు.
- మార్చి 17వ తేదీ అర్ధరాత్రి ఇద్దరు అన్నదమ్ములు మద్యం తాగి దారిన వెళ్లే ముగ్గురు కూలీలపై దాడి చేశారు. రోడ్డుపై బిగ్గరగా కేకలు వేస్తూ వచ్చివెళ్లే వాహనాలను అడ్డుకున్నారు. విజిలెన్స్ సిబ్బందికి కూడా వారిని అదుపుచేయడం సాధ్యం కాలేదు. మొబైల్ వాహనం అద్దాలను పగలగొట్టగా, ఓ విజిలెన్స్ అధికారి గాయపడ్డారు.
- 2024 నవంబరులో ఘాట్‌రోడ్లలో ఖాళీ మద్యం సీసాలు, గుట్కా ప్యాకెట్లు కనిపించడం కలకలం సృష్టించింది.
- 2024 ఆగస్టు 17వ తేదీన ఇద్దరు హాకర్లు గాజుబాటిళ్లతో ఒకరిపై ఒకరు పట్టపగలు నడిరోడ్డుపై దాడి చేసుకున్నారు. రక్తగాయాలతో పెద్దగా కేకలు వేసిన వారిని చూసి భక్తులు భయభ్రాంతులకు గురయ్యారు.
- 2023 ఫిబ్రవరిలో షాపింగ్ కాంప్లెక్స్ వద్ద ఓ వ్యక్తి మద్యం తాగుతూ, మాంసం తింటూ పట్టుబడ్డాడు.

పొగాకు కిలో రూ.430!

దేవరపల్లి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): పొగాకు ధర రోజురోజుకి రికార్డు స్థాయిలో పెరుగుతుండటంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. రాజమహేంద్రవరం పొగాకు బోర్డు రీజనల్ పరిధిలో ఉన్న 5 పొగాకు వేలం కేంద్రాల్లో శనివారం ధరలు రికార్డు స్థాయిలో పలికాయి. దేవరపల్లి పొగాకు కేంద్రంలో కిలో పొగాకు ధర రూ.428, కొయ్యలగూడెం రూ.428, జంగారెడ్డిగూడెం-1 రూ.429, జంగారెడ్డిగూడెం-2 రూ.430, గోపాలపురం 429 పలికింది.



హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో అవార్డు స్వీకరిస్తున్న జైలు సూపరింటెండెంట్ రాహుల్

రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు శుభ్రతలో దేశంలో మూడో స్థానం

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు మరో ఘనత దక్కింది. గతంలో జీవ వైవిధ్యంలో పురస్కారం పొందగా ఇప్పుడు ప్రిజన్ హైజీన్‌లో దేశంలోనే మూడో స్థానం కైవసం చేసుకొంది. ఈ మేరకు కాంస్య పతకాన్ని హైదరాబాద్‌లో ఈ నెల 11వ తేదీన అందుకున్నట్టు సూపరింటెండెంట్ ఎస్.రాహుల్ శనివారం తెలిపారు.

చిన వెంకన్న సేవలో జస్టిస్ గోపాలకృష్ణారావు



జస్టిస్ వి.గోపాలకృష్ణారావుకు స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేస్తున్న ఈవో మూర్తి

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా ద్వారకా తిరుమలలోని చిన వెంకన్న ఆలయాన్ని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.గోపాలకృష్ణారావు శనివారం దర్శించుకున్నారు. స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఆయనకు వేదాశీర్వచనం, ఆలయ ఈవో ఎన్వీ సత్యనారాయణమూర్తి స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని, ప్రసాదాలను, పట్టువస్త్రాలను అందజేశారు.

లేపాక్షి శిల్పకళ అద్భుతం: జస్టిస్ రామకృష్ణ ప్రసాద్

లేపాక్షి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): లేపాక్షి ఆలయంలో శిల్పకళ అద్భుతంగా ఉందని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రామకృష్ణ ప్రసాద్ అన్నారు. శ్రీసత్యసాయి జిల్లా లేపాక్షిలోని దుర్గా వీరభద్రస్వామి ఆలయాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఆలయంలోని ఏడు శిరస్సుల నాగేంద్రుడు, సీతాదేవి పాదం, అర్ధాంతరంగా ఆగిన కల్యాణ మండపం, వేలాడే స్తంభాన్ని జస్టిస్ రామకృష్ణ ప్రసాద్ దర్శించుకున్నారు. దుర్గా వీరభద్రస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏకశిలా నంది విగ్రహాన్ని సందర్శించారు. ఆయన వెంట జిల్లా అదనపు న్యాయాధికారి కంపల్లె శైలజ, పెనుకొండ ఆర్డీఓ ఆనంద్‌కుమార్, తహసీల్దారు సౌజన్యలక్ష్మి ఉన్నారు.



ఏకశిలా నంది విగ్రహం వద్ద జస్టిస్ రామకృష్ణ ప్రసాద్

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ



కొత్తపలుకు

▪ఆర్కే RK

అసహనం పరాకాష్ఠకు!

జగన్‌రెడ్డి కేసు పుణ్యమా అని న్యాయ వ్యవస్థ విశ్వసనీయతపై నీలి నీడలు కమ్ముకుంటున్నాయి. బిల్లుల ఆమోదం విషయంలో గవర్నర్లు, రాష్ట్రపతికి గడువు లేకపోతే ఎలా– అని ప్రశ్నిస్తున్న న్యాయ వ్యవస్థను జగన్మోహన్‌రెడ్డి వంటి వారి విషయంలో తీర్పు ఇవ్వడానికి గడువు లేకపోతే ఎలా– అని ప్రజలు ప్రశ్నించకుండా ఉంటారా? అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రజా ప్రతినిధుల కేసులు ఏడాదిలోగా పరిష్కారం కావాలని సర్వోన్నత న్యాయస్థానం పలు సందర్భాలలో స్పష్టం చేసింది. అయినా జగన్‌రెడ్డి కేసులలో పుష్కర కాలం గడచినా విచారణ కూడా పూర్తి కాలేదు. ఈ మధ్యలో ఎందరో ప్రధాన న్యాయమూర్తులు పదవీ విరమణ చేశారు. ఇలాంటి సందర్భాలలోనే కదా వ్యవస్థలపై ప్రజలు విశ్వాసం కోల్పోయేది? తమ వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసం పాదుకొల్పాల్సిన బాధ్యత న్యాయ వ్యవస్థలోని బాధ్యులపై లేదా? అతీగతీ లేకుండా పడివున్న ఈ కేసులలో భవిష్యత్తులో విచారణ పూర్తై జగన్‌రెడ్డి దోషిగా తేలితే గతంలో ముఖ్యమంత్రిగా ఆయన చేసిన తప్పు ఒప్పులకు ఎవరు బాధ్యత వహిస్తారు?

'భారత రాజ్యాంగాన్ని చూసి గర్విస్తున్నాం' ..నేపాల్ పరిణామాల నేపథ్యంలో భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్ చేసిన వ్యాఖ్య ఇది. రాజ్యాంగాన్ని చూసి మాత్రమే కాదు, అంతటి మహోన్నత రాజ్యాంగాన్ని రచించి మనకు అందించిన రాజ్యాంగ నిర్మాతలను చూసి కూడా గర్వించాలి కదా? భిన్న మతాలు, భిన్న జాతులతో కూడిన మన దేశం భిన్నత్వంలో ఏకత్వంతో అప్రతిహతంగా సాగిపోవడానికి వారు అందించిన రాజ్యాంగమే ప్రాతిపదిక కదా? రాజ్యాంగం ఎంత గొప్పదైనా దాన్ని పరిరక్షించాల్సిన వ్యవస్థల అధిపతులు మంచివాళ్లు కాకపోతే పరిస్థితి ఏమిటి? శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్ పరిణామాల తర్వాత మన దేశంలో కూడా ఇలాంటి పరిస్థితులు తలెత్తే అవకాశం ఉందా? అన్న అనుమానం కొందరిలోనైనా ఏర్పడటం ఆందోళన కలిగిస్తోంది. శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్‌లో రాజ్యాంగం లోపభూయిష్టంగా ఉందని కాదు.. పాలకులు బాధ్యతారహితంగా, రాజ్యం వీర భోజ్యం అన్నట్టుగా వ్యవహరించడం వల్ల అవినీతి, అరాచకాలు పెచ్చరిల్లి ప్రజల్లో అసహనం పరాకాష్ఠకు చేరింది. ఫలితమే ప్రజాగ్రహం పెల్లుబికి పాలకులు దేశం విడిచి పారిపోయే పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ దుస్థితి వెనుక అమెరికా హస్తమో లేక మరొకరి హస్తమో ఉందని చెప్పుకోవచ్చు కానీ ప్రభుత్వాల పట్ల ప్రజల్లో అసంతృప్తి గూడుకట్టుకొని ఉండక పోతే తిరుగుబాట్లు చోటుచేసుకోవు. మన పొరుగు దేశాలైన శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్‌తో మన దేశాన్ని ఏ విధంగానూ పోల్చలేము. భిన్న జాతులు, భిన్న మతాలు, భిన్న సంస్కృతుల కలబోతగా ఉన్న మన దేశంలో ప్రభుత్వాలపై ఈ రూపంలో తిరుగుబాట్లు అసాధ్యం. అలా జరగాలని కూడా కోరుకో కూడదు. మన ప్రజాస్వామ్య వ్యవస్థ అనేక పరీక్షలకు నిలబడి పరిపక్వత చెందింది. ప్రజలు కూడా ఎప్పటికప్పుడు విజ్ఞత ప్రదర్శించి హద్దులు మీరిన పాలకులకు ఎన్నికల సందర్భంగా బ్యాలెట్ ద్వారా కర్రు కాల్చి వాత పెడుతున్నారు. అయితే ఏ సందర్భంలో కూడా కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ప్రజల తీర్పు ఒకే రకంగా ఉండకపోవడం మన విశిష్టత. ఉదాహరణకు, ఎమర్జెన్సీనే తీసుకుందాం. నాటి ప్రధాని ఇందిరాగాంధీ తన అధికారానికి ముప్పు ఏర్పడుతోందని గ్రహించి దేశంలో అత్యవసర పరిస్థితిని విధించారు. ఫలితంగా లభించిన అపరిమిత అధికారాలతో అధికార యంత్రాంగం ప్రజలను హింసించింది. భావ ప్రకటనా స్వేచ్ఛను హరించివేశారు. అయితే ఉత్తరాది రాష్ట్రాలతో పోల్చితే దక్షిణాది రాష్ట్రాలలో ఎమర్జెన్సీ ప్రభావం తక్కువగా ఉండింది. ఈ కారణంగా ఉత్తరాదిలో తుడిచిపెట్టుకు పోయిన కాంగ్రెస్ పార్టీ దక్షిణాదిన కొంత మేరకు నిలదొక్కు కోగలిగింది. అత్యవసర పరిస్థితి నాటి దురాగతాలను కూడా ప్రజలు ఎన్నికల వరకు భరించి బ్యాలెట్ ద్వారా ఇందిరాగాంధీకి గుణపాఠం చెప్పారు. అంతేగానీ ప్రభుత్వంపై తిరుగుబాటు చేయలేదు. 1984లో తెలుగునాట చోటుచేసుకున్న అధికార దుర్వినియోగాన్నే తీసుకుందాం. మెజారిటీ శాసనసభ్యుల మద్దతు కలిగి ఉన్న ఎన్టీఆర్‌ను తొలగించి నాదెండ్ల భాస్కర రావును ముఖ్యమంత్రిగా అప్పటి ఉమ్మడి రాష్ట్ర గవర్నర్ రాంలాల్ నియమించారు. ఇది కూడా నాటి ప్రధాని ఇందిరా గాంధీ ప్రోద్బలంతోనే జరిగింది. ఎన్నికల్లో గెలుపొంది అధికారంలోకి వచ్చిన ఎన్టీఆర్‌ను అన్యాయంగా, అక్రమంగా తొలగించడాన్ని జీర్ణించుకోలేని తెలుగు ప్రజలు శ్రీకాకుళం నుంచి ఆదిలాబాద్ వరకు ఆందోళన చేపట్టారు. ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమం ఊపందుకోవడంతో గవర్నర్ రాంలాల్ తన పదవికి రాజీనామా చేయవలసి వచ్చింది. ఇందిరాగాంధీ దిగివచ్చి ఎన్టీఆర్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా నియమించడానికి అంగీకరించారు. ఆ తర్వాత కొద్దిరోజులకే ఇందిరాగాంధీ హత్యకు గురయ్యారు. ఆ కారణంగా జరిగిన ఎన్నికల్లో కూడా తెలుగు ప్రజల ఆగ్రహం చల్లారలేదు. దేశవ్యాప్తంగా సానుభూతి పవనాలు వీచి కాంగ్రెస్ పార్టీకి ఎన్నడూ లేనంత స్థాయిలో మెజారిటీ లభించి, రాజీవ్‌గాంధీ ప్రధానమంత్రి అయ్యారు. అయితే ఆ ఎన్నికల్లో తెలుగునాట మాత్రం ప్రజలు కాంగ్రెస్‌పై తమ కక్ష తీర్చుకున్నారు. అధికార దురహంకారంతో వ్యవహరిస్తూ అవినీతి, అక్రమాలకు పాల్పడిన ప్రభుత్వాలపై మన ప్రజలు బ్యాలెట్‌ను బుల్లెట్‌లా ప్రయోగించారే గానీ, పొరుగు దేశాల్లో వలె విధ్వంస చర్యలకు పాల్పడలేదు. ఇందుకు మన సమాజాన్ని చూసి మనం గర్వించాలి. అయితే ప్రజలు మాత్రమే ఎల్లవేళలా విజ్ఞత ప్రదర్శించాలనుకోవడం అత్యాశే అవుతుంది. పాలకులపై ఆ బాధ్యత ఉండదా? ప్రజల మనో భావాలు, ఆకాంక్షలకు అనుగుణంగా పాలించాల్సిన బాధ్యత పాలకులపై ఉండదా? ఒక్కసారి అధికారంలోకి వస్తే ఐదేళ్ల పాటు విర్రవీగుతూ అధికార దుర్వినియోగానికి, అవినీతికి పాల్పడవచ్చా? అలా చేయడం ప్రజల సహనాన్ని పరీక్షించడం కాదా? రాజ్యాంగ పరిరక్షకులుగా ఉన్న ఆయా వ్యవస్థల అధిపతులపై కూడా బాధ్యత ఉంటుంది కదా? మన రాజ్యాంగ నిర్మాతలు ఆయా రాజ్యాంగ వ్యవస్థల మధ్య సున్నితమైన లక్ష్మణ రేఖలు గీశారు. ఒక వ్యవస్థ అధికార పరిధుల్లోకి మరో వ్యవస్థ చొరబడకుండా సరిహద్దులు నిర్ణయించారు. అయితే రాజ్యాంగబద్ధమైన పదవులలో ఉన్నవారు బాధ్యతారహితంగా వ్యవహరించిన సందర్భాలలో ఆయా వ్యవస్థల మధ్య ఘర్షణ తలెత్తుతోంది. శాసనసభలో మెజారిటీ ఎమ్మెల్యేల మద్దతు ఉన్న నాయకుడే ముఖ్యమంత్రిగా నియమితులు కావాలని రాజ్యాంగం అభిప్రాయపడింది. అదే సమయంలో గవర్నర్లు ఎవరినైనా ముఖ్యమంత్రులుగా నియమించవచ్చునని అదే రాజ్యాంగంలో పేర్కొన్నారు. దీని ఉద్దేశం దారినపోయే దానయ్యను ముఖ్యమంత్రిని చేయమని కాదు. ముఖ్యమంత్రిగా నియమితుడయ్యే వ్యక్తి అప్పటికి చట్టసభల్లో సభ్యుడు కాక పోయినా సభలో మెజారిటీ నిరూపించుకొని ఆరు నెలల్లో ఏదో ఒక సభకు ఎన్నిక కావాలని రాజ్యాంగంలో నిర్దేశించారు. సదుద్దేశంతో కల్పించిన ఈ వెసులుబాటును రాంలాల్ వంటి వారు దుర్వినియోగం చేశారు. రాజ్యాంగ నిర్మాతల అభిమతాన్ని తప్పుగా అన్వయించి అధికార దుర్వినియోగానికి పాల్పడిన సందర్భాలను ఎన్నో చూశాం. రాష్ట్ర ప్రభుత్వాలు ఆమోదించిన బిల్లులను ఆమోదించే విషయంలో గవర్నర్లు, రాష్ట్రపతికి కాల వ్యవధి ఉండాలా? వద్దా? అన్నది ప్రస్తుతం సర్వోన్నత న్యాయస్థానం విచారణ పరిధిలో ఉంది. రాజ్యాంగ నిర్మాతలు సదుద్దేశంతో రాష్ట్రపతి, గవర్నర్లు, న్యాయమూర్తులకు ప్రత్యేక రక్షణలు కల్పించడంతో పాటు విశేష అధికారాలూ కల్పించారు. అలా అని మా ఇష్టం వచ్చినట్టు వ్యవహరిస్తామని వారు భావిస్తే ప్రజల్లో అసహనం ఏర్పడదా? బిల్లుల ఆమోదం విషయంలో గవర్నర్లు, రాష్ట్రపతికి గడువు విధిస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం ఏమిటని పాలకులు ప్రశ్నిస్తున్నారు. రాజ్యాంగాన్ని పరిరక్షించాల్సిన ప్రాథమిక బాధ్యత సర్వోన్నత న్యాయస్థానం పైనే ఉంటుంది. పార్లమెంటు ఆమోదించే చట్టాలు సైతం రాజ్యాంగానికి లోబడి ఉన్నాయా లేవా అని సమీక్షించి నిర్ణయం తీసుకొనే అధికారం సుప్రీంకోర్టుకు ఉంటుంది కదా? శాసనసభలు ఆమోదించిన బిల్లులకు గవర్నర్లు, రాష్ట్రపతి ఆమోదముద్ర వేయకుండా నెలలూ, సంవత్సరాల తరబడి పక్కన పడేస్తే ప్రజలు ఎన్నుకొన్న ప్రభుత్వాలు ఏమి చేయాలి? శాసనసభలు ఆమోదించిన బిల్లులు రాజ్యాంగానికి లోబడి లేని పక్షంలో ఆ విషయం చెప్పి తిరస్కరించవచ్చు. కానీ శాశ్వతంగా పెండింగ్‌లో ఉంచడం, అదేమంటే మా అధికారాన్ని ప్రశ్నించి, మాకు గడువు విధించే అధికారం సుప్రీంకోర్టుకు ఎక్కడిది? అని హుంకరించడం సమర్థనీయమా? గవర్నర్లు, రాష్ట్రపతి రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటే ఇలాంటి అవాంఛనీయ వివాదాలు తలెత్తవు కదా? మన దేశంలో రాజ్యాంగబద్ధమైన వ్యవస్థల విశ్వసనీయత కొంతకాలంగా మసకబారుతోంది.

సీఎం, పీఎం ఇష్టమేనా?

ఇక చట్టసభల విషయానికి వద్దాం. అధికార పార్టీ, అంటే దాని అధినేత మనసులో ఏమనుకుంటారో అవే చట్టాలు అవుతున్నాయి. ఆయా బిల్లులపై పార్టీలో గానీ, మంత్రుల స్థాయిలో గానీ చర్చలు జరగవు. ముఖ్యమంత్రి లేదా ప్రధాన మంత్రి మనసులో మాటకు అనుగుణంగా అధికారులు బిల్లులు రూపొందిస్తున్నారు. సదరు బిల్లులను కనీసం చదవ కుండానే శాసనసభల్లో, పార్లమెంటులో ఆమోదిస్తున్నారని ఎప్పటి నుంచో ఆరోపణలు ఉన్నాయి. ఎన్నికల్లో ప్రజల ద్వారా ఎన్నికైన ఒక ముఖ్యమంత్రి లేదా ప్రధానమంత్రి ఏదైనా కేసులో 3 నెలలకు మించి జైల్లో ఉంటే పదవి కోల్పోవలసి ఉంటుందని లోక్‌సభలో ఇటీవల ఒక బిల్లును ఆమోదించారు. ఈ బిల్లుకు మద్దతు తెలిపిన వారిలో ఎంత మంది ఆ బిల్లును చదివారంటే చెప్పలేని పరిస్థితి. ఒకరకంగా చూస్తే ఈ బిల్లు ఉద్దేశం మంచిదే. అయితే మన దేశంలో అస్మదీయుల విషయంలో ఒకలా, తస్మదీయుల విషయంలో మరోలా చట్టాలు, వ్యవస్థలు పనిచేస్తాయన్న విషయం తెలిసిందే కదా? ప్రస్తుత పరిస్థితులలో ప్రతిపక్షాలకు చెందిన లేదా తస్మదీయ ముఖ్యమంత్రులపై కేంద్ర ఏజెన్సీలతో కేసులు పెట్టించి మూడు నెలలకు పైగా జైల్లో పెట్టడం కష్టమా? న్యాయవ్యవస్థ కూడా బెయిలు మంజూరు విషయంలో ఒక్కో సందర్భంలో ఒక్కోలా వ్యవహరిస్తోంది. ఈ నేపథ్యంలో ఈ బిల్లు చట్టమైతే అది

> **ప్రజలు న్యాయంకోసం చివరిగా తలుపు తట్టేది న్యాయ వ్యవస్థనే. న్యాయాధికారులు, న్యాయమూర్తులు ఈ వాస్తవాన్ని గుర్తించి బాధితులకు సత్వర న్యాయం అందిస్తే మిగతా వ్యవస్థలు ఎన్ని వికారాలు పోయినా ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లదు. భారతదేశం అజేయంగా, మన ప్రజాస్వామ్యం అజరామరంగా వెలుగొందుతాయి.**



దుర్వినియోగం కాదన్న గ్యారెంటీ ఏముంది? కేంద్రంలో అధికారంలో ఉన్న వారికి గిట్టని ముఖ్యమంత్రిని ఈ చట్టాన్ని అడ్డుపెట్టుకొని తొలగించబోరన్న గ్యారెంటీ ఏముంది? ఇలాంటి సందేహాలు రావడానికి అనేక కారణాలు ఉన్నాయి. మన దేశంలో ఎంతో మంది రాజకీయ నాయకులపై అవినీతి ఆరోపణలు ఉన్నాయి. పలువురిపై కేసులు నమోదయ్యాయి. పలువురు ముఖ్యమంత్రులు, మాజీ ముఖ్యమంత్రులు బెయిల్‌పై ఉంటున్నారు. కేసులను ఎదుర్కొంటున్న నాయకులు అస్మదీయులు అయితే చట్టాలు వారి చుట్టాలవు తున్నాయి. తస్మదీయులైతే చట్టాలు కాల నాగుల్లా బుసకొడుతూ కాటేస్తున్నాయి.

తెలుగు రాష్ట్రాల విషయానికి వద్దాం. తెలంగాణ ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా బెయిల్‌పై ఉన్నారు. తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై రేపోమాపో కాళేశ్వరం వ్యవహారంపై సీబీఐ విచారణ జరగబోతోంది. ఏపీ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పుష్కర కాలంగా బెయిల్‌పై ఉన్నారు. అవినీతి కేసులలో బెయిల్‌పై ఉన్న ఆయన ముఖ్యమంత్రి కూడా అయ్యారు. జగన్‌రెడ్డి కేసు పుణ్యమా అని న్యాయ వ్యవస్థ విశ్వసనీయతపై నీలి నీడలు కమ్ముకుంటున్నాయి. బిల్లుల ఆమోదం విషయంలో గవర్నర్లు, రాష్ట్రపతికి గడువు లేకపోతే ఎలా? అని ప్రశ్నిస్తున్న న్యాయ వ్యవస్థను జగన్మోహన్‌రెడ్డి వంటి వారి విషయంలో తీర్పు ఇవ్వడానికి గడువు లేకపోతే ఎలా? అని ప్రజలు ప్రశ్నించకుండా ఉంటారా? అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రజా ప్రతినిధుల కేసులు ఏడాదిలోగా పరిష్కారం కావాలని సర్వోన్నత న్యాయస్థానం పలు సందర్భాలలో స్పష్టంచేసింది. అయినా జగన్‌రెడ్డి కేసులలో పుష్కర కాలం గడచినా విచారణ కూడా పూర్తి కాలేదు. ఈ మధ్యలో ఎందరో ప్రధాన న్యాయమూర్తులు పదవీ విరమణ చేశారు. ఇలాంటి సందర్భాల లోనే కదా వ్యవస్థలపై ప్రజలు విశ్వాసం కోల్పోయేది? తమ వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసం పాదుకొల్పాల్సిన బాధ్యత న్యాయ వ్యవస్థలోని బాధ్యులపై లేదా? జగన్‌రెడ్డిపై త్వరితగతిన విచారణ జరగకుండా అడ్డుకుంటోంది ఎవరు? ఆయనపై త్వరితగతిన విచారణ పూర్తిచేసి, దోషి లేదా నిర్దోషి అని ప్రకటిస్తే ప్రజలకు అటు న్యాయ వ్యవస్థపైనా, ఇటు పాలక వర్గాలపైనా నమ్మకం పెరుగుతుంది కదా? అతీగతీ లేకుండా పడివున్న ఈ కేసులలో భవిష్యత్తులో విచారణ పూర్తై జగన్‌రెడ్డి దోషిగా తేలితే గతంలో ముఖ్యమంత్రిగా ఆయన చేసిన తప్పు ఒప్పులకు ఎవరు బాధ్యత వహిస్తారు? వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసునే తీసుకుందాం. మంత్రిగా, ఎంపీగా, ఎమ్మెల్యేగా పనిచేయడమే కాకుండా ఒక దివంగత ముఖ్యమంత్రికి సొంత సోదరుడు, మరో మాజీ ముఖ్యమంత్రికి సొంత బాబాయి అయిన వివేకానందరెడ్డి హత్య కేసుకే దిక్కూమొక్కూ లేకపోతే ప్రజలకు న్యాయ వ్యవస్థపైన, ప్రభుత్వాలపైన నమ్మకం ఎందుకుండాలి? ఎన్నికల్లో ప్రజలు ఇచ్చే తీర్పు మాత్రమే పరిష్కారం అని చెబితే మరి ఇన్ని వ్యవస్థలు ఎందుకు? మనం గర్విస్తున్న రాజ్యాంగానికి ఏపాటి విలువ ఇస్తున్నట్టు?

ప్రజలు ఆగ్రహిస్తే అంతే!

శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్‌లో ప్రజల తిరుగుబాటుకు రాజ్యాంగం బలహీనంగా ఉండటం కారణం కాదని చెప్పవచ్చు. విదేశీ హస్తం కూడా కారణం కాకపోవచ్చు. ప్రజల్లో అసంతృప్తి, అసహనం గూడుకట్టుకొని ఉండకపోతే ఏ విదేశీ శక్తి కూడా ఏమీ చేయలేదు. ఇందిరాగాంధీ అధికారంలో ఉన్నప్పుడు తన ప్రభుత్వానికి ఇబ్బంది ఏర్పడినప్పుడల్లా విదేశీ హస్తం అని నిందించేవారు. నిజానికి నాటి నుంచి నేటి వరకు ఏ విదేశీ శక్తి లేదా హస్తం మన దేశ పురోగతిని అడ్డుకోలేకపోయింది కదా? ప్రభుత్వాలు, వ్యవస్థలలో అవినీతి పెరిగిపోవడం వల్లనే మన దేశం అభివృద్ధి చెందాల్సినంతగా చెందలేదు. రాజ్యాంగ బద్ధ సంస్థలలో కూడా అవినీతి చొరబడటం వల్ల సామాన్యులకు న్యాయం దొరకని దుస్థితి ఏర్పడింది. జగన్‌రెడ్డి, వివేకానంద రెడ్డి కేసులే అపరిష్కృతంగా ఉన్నాయంటే న్యాయ వ్యవస్థ పైన, ప్రభుత్వాలపైన ప్రజలకు నమ్మకం ఎలా ఉంటుంది? నేపాల్ ప్రభుత్వం కొన్ని సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలను నిషేధించడం వల్ల ప్రజల్లో ఆగ్రహావేశాలు పెల్లుబికాయని చెబుతున్నారు గానీ, అంతకు మించిన కారణం ఉండే ఉంటుంది. కేవలం సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలను నిషేధించి నంత మాత్రాన మంత్రులపై దాడులు చేయడం, వారి ఇళ్లు ధ్వంసం చేయడం జరిగే పనేనా? ఆ ప్రభుత్వంపై ప్రజల్లో అప్పటికే అసంతృప్తి గూడుకట్టుకొని ఉండి ఉంటుంది. ఆలస్యంగా అందుతున్న సమాచారం ప్రకారం నేపాల్‌కు చెందిన ఒక మంత్రి కారు ఒక మైనర్ బాలికను ఢీకొని ఆపకుండా వెళ్లిపోవడంతో అగ్నికి ఆజ్యం పోసినట్టయింది. కారు డ్రైవర్‌ను పట్టుకున్న 24 గంటల్లోనే సదరు డ్రైవర్‌కు బెయిల్ ఇవ్వడం, సదరు సంఘటనను స్వల్పమైనదిగా పేర్కొన డంతో ప్రజల్లో ఆగ్రహావేశాలు రగిలించిందని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో నిరాశ, నిస్పృహలతో ఉన్న ప్రజలు సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలను నిషేధించడంతో ఆగ్రహావేశాలు కట్టులుతెగి దాడులకు తెగబడ్డారు. చివరికి ప్రభుత్వం కూలి పోయింది. శ్రీలంకలో కూడా ఆ దేశ అధ్యక్షుడి భవనంపై ప్రజలు దాడి చేసి అధ్యక్షుడి బెడ్ రూంలోనూ, స్నానాల తొట్టిలోనూ కూర్చొని ఫొటోలకు పోజులిచ్చారంటే ప్రభుత్వంపై ఎంత విరక్తి చెందారో అర్థం చేసుకోవచ్చు. ఆ తిరుగుబాట్ల తర్వాత శ్రీలంక, బంగ్లాదేశ్‌లో ప్రజల జీవితాలు అమాంతం బాగుపడ్డాయా అంటే లేదనే చెప్పవచ్చు. అయితే అప్పటి తమ కోపానికి కారకులైన పాలకులు దేశం విడిచి పారిపోవ డంతో ప్రజలు శాంతించారు. ఇప్పుడు నేపాల్‌లో కూడా ఓలి ప్రభుత్వం రాజీనామా చేయడంతో ప్రజలు మెల్ల మెల్లగా శాంతించారు. ఆ దేశ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని తాత్కాలిక ప్రధానిగా నియమించుకుందామని సైన్యం నుంచి ప్రతిపాదన వచ్చినా ఆందోళనకారులు సమర్థించలేదు. అంటే న్యాయ వ్యవస్థపైనా అక్కడి ప్రజలు విశ్వాసం కోల్పోయారని భావించాలి. ఎట్టకేలకు వివాదం పరిష్కారమైంది. మాజీ చీఫ్ జస్టిస్ సుశీలా కార్కి తాత్కాలిక ప్రధానిగా బాధ్యతలు స్వీకరించారు. అయితే ఈ మూడు దేశాలు మన దేశానికి మిత్ర దేశాలు. కొంతకాలంగా శ్రీలంక, నేపాల్.. చైనాకు సన్నిహితం అవుతున్నాయని వార్తలు వచ్చాయి. ఈ మూడు దేశాలలో చోటుచేసుకున్న ప్రజల ధర్మాగ్రహం నుంచి మన పాలకులు, రాజ్యాంగ వ్యవస్థల అధిపతులు నేర్చుకోవాల్సిన పాఠాలు ఏమైనా ఉన్నాయా? అంటే ఉన్నాయని కచ్చితంగా చెప్పవచ్చు. మన దేశం భిన్న జాతులు, భిన్న మతాలు, భిన్న సంస్కృతులు, భిన్న భాషల సమాహారం కనుక ఆ చిన్న దేశాలలో వలే తిరుగుబాట్లు చేయరు. అంతమాత్రాన ప్రజలను టేకెన్ ఫర్ గ్రాంటెడ్ అన్నట్టు తీసుకోకూడదు. పాలకులు అప్రజాస్వామికంగా, దురహంకారంతో వ్యవహరించారని భావించడంతో 1984లోనే తెలుగునాట ప్రజాస్వామ్య పరిరక్షణ పేరిట సాగిన ఉద్యమం ఒక దశలో హింసాత్మకంగా మారింది. అప్పుడు పోలీసు వ్యవస్థ కూడా ప్రజలతో మమేకం అయింది. ఎన్టీఆర్‌కు అన్యాయం జరిగిందని శాంతిభద్రతలను కాపాడాల్సిన బలగాలు కూడా భావించాయి. దీంతో ఉద్యమకారుల పట్ల సానుభూతితో వ్యవహరించారు. పాలకులు ఈ విషయం గుర్తుంచుకోవాలి. ఇందిరాగాంధీ వంటి శక్తిమంతురాలు కూడా ప్రజాగ్రహానికి దిగిరాక తప్పలేదు. ఇక్కడ ఇంకో విషయాన్ని పాలకులు గుర్తుంచుకోవాలి. నాడు అంతటి ప్రజాదరణను చూరగొన్న ఎన్టీఆర్‌ను ఐదేళ్ల తర్వాత 1989లో జరిగిన ఎన్నికల్లో అదే ప్రజలు ఓడించారు. భారతీయులు శాంతి కాముకులు. మన చుట్టూ ఇప్పుడు జరుగుతున్న ఇటువంటి సంఘటనలు మన దేశంలో జరగకుండా మన రాజ్యాంగ నిర్మాతలు తగు జాగ్రత్తలు తీసుకున్నారు. పొరుగు దేశాలలో వలె అధికారం సైన్యం చేతుల్లోకి వెళ్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. మిలటరీని, వాయుసేనను, నౌకాదళాన్ని విడివిడిగా ఏర్పాటు చేసి వాటికి అధిపతులను నియమించే వ్యవస్థను ఏర్పాటు చేశారు. అయితే పాలకులపై ప్రజలు విశ్వాసం కోల్పోతున్నారు. ఎల్లయ్య మీద కోపం వస్తే పుల్లయ్యకు పట్టం కడుతున్నారే గానీ ఎన్నికల ప్రక్రియ, రాజకీయ వ్యవస్థపై అపార నమ్మకం ఉండి కాదు. ప్రస్తుతానికి ఆయా వ్యవస్థలపై ప్రజల్లో అసంతృప్తి గూడుకట్టుకుంటోంది. అధికారంలోకి రావాలనుకుంటున్న వారు సంక్షేమం పేరిట హద్దు మీరి ప్రజా ధనాన్ని పంచి పెట్టడంపై పన్ను చెల్లింపుదారులు ఆగ్రహంగా ఉన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించకుండా ప్రజలను సోమరులుగా మార్చే పథకాలను ప్రవేశపెట్టే అధికారం రాజకీయ నాయకులకు ఎక్కడిది? అన్న ప్రశ్న తరచుగా వినిపిస్తోంది. మరోవైపు వనరులన్నీ పాలకుల మెప్పు పొందిన వారి సొంతం అవుతున్నాయి. ఇంకోవైపు సామాన్యులకు న్యాయం ఎండమావి అవుతోంది. మొత్తం మీద మన దేశంలో ప్రస్తుతం ఫలానా వ్యవస్థ పటిష్ఠంగా, న్యాయబద్ధంగా, రాజ్యాంగబద్ధంగా వ్యవహరిస్తోందని చెప్పలేని పరిస్థితి నెలకొంది. అధికార దుర్వినియోగం పరిపాటిగా మారిపోయింది. దీంతో అవినీతిపరులు తప్పించుకోవడం సులువవుతోంది. ఎవరు మాత్రం అవినీతికి పాల్పడటం లేదు? అని ప్రజలు నిస్పృహతో ప్రశ్నిస్తున్నారు. ఈ పరిస్థితిని చక్కదిద్దాల్సిన బాధ్యత అటు పాలకులు, ఇటు రాజ్యాంగ సంస్థల అధిపతులపై ఉంది. లేని పక్షంలో శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్‌లో వలె కాకపోయినా మన దేశంలో మరో రూపంలో అశాంతి ప్రబలుతుంది. ఈ క్లిష్ట సమయంలో న్యాయ వ్యవస్థపైనే గురుతర బాధ్యత ఉంది. న్యాయ వ్యవస్థ తాను రాజ్యాంగానికి మాత్రమే జవాబుదారీనని భీష్మించుకొని ఒత్తిళ్లు, ప్రలోభాలకు తలొగ్గకుండా వ్యవహరిస్తే మిగతా వ్యవస్థలు కూడా దారిలోకి వస్తాయి. ప్రజలు న్యాయంకోసం చివరిగా తలుపు తట్టేది న్యాయ వ్యవస్థనే. న్యాయాధికారులు, న్యాయమూర్తులు ఈ వాస్తవాన్ని గుర్తించి బాధితులకు సత్వర న్యాయం అందిస్తే మిగతా వ్యవస్థలు ఎన్ని వికారాలు పోయినా ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లదు. భారతదేశం అజేయంగా, మన ప్రజాస్వామ్యం అజరామరంగా వెలుగొందుతాయి. జై హింద్!

> **మన చుట్టూ ఇప్పుడు జరుగుతున్న ఇటువంటి సంఘటనలు మన దేశంలో జరగకుండా మన రాజ్యాంగ నిర్మాతలు తగు జాగ్రత్తలు తీసుకున్నారు. పొరుగు దేశాలలో వలె అధికారం సైన్యం చేతుల్లోకి వెళ్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. మిలటరీని, వాయుసేనను, నౌకాదళాన్ని విడివిడిగా ఏర్పాటు చేసి వాటికి అధిపతులను నియమించే వ్యవస్థను ఏర్పాటు చేశారు. అయితే పాలకులపై ప్రజలు విశ్వాసం కోల్పోతున్నారు. ఎల్లయ్య మీద కోపం వస్తే పుల్లయ్యకు పట్టం కడుతున్నారే గానీ ఎన్నికల ప్రక్రియ, రాజకీయ వ్యవస్థపై అపార నమ్మకం ఉండి కాదు. ప్రస్తుతానికి ఆయా వ్యవస్థలపై ప్రజల్లో అసంతృప్తి గూడుకట్టుకుంటోంది. అధికారంలోకి రావాలనుకుంటున్న వారు సంక్షేమం పేరిట హద్దు మీరి ప్రజా ధనాన్ని పంచి పెట్టడంపై పన్ను చెల్లింపుదారులు ఆగ్రహంగా ఉన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించకుండా ప్రజలను సోమరులుగా మార్చే పథకాలను ప్రవేశపెట్టే అధికారం రాజకీయ నాయకులకు ఎక్కడిది? అన్న ప్రశ్న తరచుగా వినిపిస్తోంది. మరోవైపు వనరులన్నీ పాలకుల మెప్పు పొందిన వారి సొంతం అవుతున్నాయి. ఇంకోవైపు సామాన్యులకు న్యాయం ఎండమావి అవుతోంది.**

కిర్క్ హత్యలో కార్ల్ మార్క్స్ 'ప్రమేయం'!!

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మానసపుత్రుడైన చార్లీ కిర్క్ దారుణ హత్యకు గురయ్యాడు. ఉథా వ్యాలీ యూనివర్సిటీలో సెప్టెంబరు 11న నిర్వహించిన 'ద అమెరికన్ కమ్‌బ్యాక్ టూర్' కార్యక్రమంలో ప్రసంగిస్తుండగా కిర్క్‌ను కాలేజీ విద్యార్థి ఒకడు తుపాకీతో కాల్చి చంపేశాడు. కిర్క్ 32 ఏళ్ల యువకుడు. అయితే ఛాందసుడు. కొంతమంది యువకులు పుట్టుకతో వృద్ధులు అనే బాపతు!

అమెరికా కళాశాలల్లో అల్లరిమూకలు కాల్పులు జరిపిన వార్తలు తరచూ వింటుంటాం. ఇది అలాంటి హత్య కాదు. అమెరికన్లేగాక ఈ వార్త తెలిసిన వారంతా దీన్ని ఒకానొక హత్యా సంఘటనగా తేలిగ్గా తీసిపడేయడం లేదు. దాన్నొక భిన్న సైద్ధాంతిక శిబిరాల ఘర్షణగా చూస్తున్నారు. వివిధ దేశాలపై, వివిధ సమూహాలపై ట్రంప్ అనుసరిస్తున్న కక్షసాధింపు విధానాల మీద జరుగబోయే ప్రతిచర్యలకు ఇదొక మచ్చుతునక అంటున్నారు. ఇది ఇంతటితో ఆగదని కూడ కొందరు అంటున్నారు. చార్లీ కిర్క్ మీద కాల్పులు జరిపిన విద్యార్థిని పోలీసులు గుర్తించారు, అరెస్టు చేశారు. అతని పేరు టేలర్ రాబిన్‌సన్. 22 ఏళ్ల యువకుడు. హంతకుడ్ని చూసి ఉథా గవర్నర్ స్పెన్సర్ కాక్స్ షాక్‌కు గురయ్యాడు. రాబిన్‌సన్ కుటుంబంతో అతనికి సన్నిహిత సంబంధాలున్నాయి. మంచి కుటుంబం; మంచి అబ్బాయి; కానీ ఇంతలో ఇలా ఎలా రాడికల్‌గా మారిపోయాడు అంటూ ఆశ్చర్యపోయాడు. అమెరికాలో కూడా కమ్యూనిస్టు తీవ్రవాదుల్ని రాడికల్స్ అంటారు. చార్లీ కిర్క్ క్రైస్తవ మతవాది; అతివాద జాతీయవాది. సులువుగా చెప్పుకోవాలంటే అమెరికాలో పురాతన అమెరికన్లు, సనాతన క్రైస్తవులు మాత్రమే ఉండాలని ప్రగాఢంగా నమ్మేవాడు.

2016 అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ "అమెరికాకు పూర్వ వైభవాన్ని పునరుద్ధరిద్దాం" (Make America Great Again – MAGA) అనే నినాదాన్ని ఇచ్చాడు. ఉదారవాదాన్ని తిరస్కరించడం, ప్రపంచీకరణను వ్యతిరేకించడం, అమెరికాకు వలసల్ని అడ్డుకోవడం, అన్నింటా అమెరికా ప్రయోజనాలే ముఖ్యం అనడం ఇందులో ముఖ్యమైన అంశాలు. రోనాల్డ్ రీగన్ 1980లలోనే ఇలాంటి నినాదాలు ఇచ్చాడు. అయితే, ట్రంప్ వాటికి మరింత పదునుపెట్టాడు. ట్రంప్ విధానాలను చార్లీ గట్టిగా అందిపుచ్చుకున్నాడు. వాటిని దేశమంతటా విస్తృతంగా ప్రచారం చేయడానికి 'టర్నింగ్ పాయింట్ యూఎస్‌ఏ' అనే సంస్థను నెలకొల్పాడు.

2020 నవంబరు నెలలో జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో డెమొక్రాట్ జో బైడెన్ చేతిలో ట్రంప్ ఓడిపోయాడు. అయినా ప్రెసిడెంట్ ఎలెక్ట్‌కు అధికారాన్ని అప్ప చెప్పి గద్దె దిగడానికి ట్రంప్ ఒప్పుకో లేదు. 2021 జనవరి 6న వాషింగ్టన్ డీసీలో తన అనుచరులైన అల్లరిమూక లతో ఒక కపట దాడిని నిర్వహించాడు. ఆ అల్లర్లలో కిర్క్ కీలక పాత్ర పోషించి ట్రంప్‌కు మరింత దగ్గర అయ్యాడు. ట్రంప్ రెండోసారి శ్వేతభవన నివాసి కావడంతో కిర్క్ మరింత రెచ్చిపోయాడు. చార్లీకి ఉదారవాదం అస్సలు పడదు. ఒక్కసారి అందులో పడితే కొట్టుకు పోతాం అనేది అతని ప్రగాఢ నమ్మకం. ఉదారవాదం అంటే ఇతర మతాలను, ఇతర దేవుళ్లను గౌరవించాలి. మహిళల్ని ఆదరించాలి. అతనికి గర్భస్రావం, విడాకులు కూడా నచ్చవు. ఎల్‌జీబీటీ క్యూ హక్కులు అస్సలు నచ్చవు.

> **కిర్క్ హత్యకు వాడిన తుపాకీతో పాటు కొన్ని బుల్లెట్లను కూడ రాబిన్‌సన్ నుంచి ఫెడరల్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఒక బుల్లెట్ కేసింగ్ మీద 'రేయ్ ఫాసిస్ట్! అందుకో' అని రాసి ఉంది. ఇంకో కేసింగ్ మీద 'బెల్లా సియావో' అని ఉంది. ముస్సోలిని ఫాసిస్టు పాలన రోజుల్లో అతనికి వ్యతిరేకంగా బాధితులు పాడుకున్న ఇటాలియన్ పాట పల్లవి అది. ఇటలీలో ఫాసిజాన్నీ, జర్మనీలో నాజీజాన్నీ కార్ల్ మార్క్స్ అభిమానులు అంతం చేశారు. ఇప్పుడు అమెరికా ఫాసిస్టుల మీద సాంస్కృతిక మార్క్సిస్టులే తిరగబడుతున్నారు మరి.**




ఉదారవాదాలకు మూలం కార్ల్ మార్క్స్ అని అతని అక్కసు. తన ప్రత్యర్థుల్ని 'సాంస్కృతిక మార్క్సిస్టులు' అని తిట్టేవాడు. ఇదో విచిత్ర పదబంధం. మార్క్సిజం ఆర్థిక మూలాలను మాత్రమే పట్టించుకుంటుంది గానీ సాంస్కృతిక అంశాలను పట్టించుకోదని మన దేశంలో నయా అంబేడ్కరిస్టులు కొందరు విమర్శిస్తుంటారు. కిర్క్ మార్క్సిజాన్ని ఒక పెద్ద ఉపద్రవంగా పరిగణించేవాడు. ఒకసారి మార్క్సిజం వలలో పడితే ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక అంశాలన్నింటిలోనూ రాజీపడాల్సి వస్తుందని అతను భావించేవాడు. ప్రపంచవ్యాప్తంగా అమెరికా బలపడాలంటే ఫాసిజం, నాజీజం వంటి సిద్ధాంతాలను పునరుద్ధరించాల్సిందే అని నమ్మేవాడు. 'సాంస్కృతిక బోల్షివిక్కు' అనే మాటను హిట్లర్ కాలపు జర్మనీలో ఒక తిట్టుగా వాడేవారు. ఇప్పుడు అమెరికాలో ట్రంప్ అనుయాయులు తమ ప్రత్యర్థుల మీద ఇదే మాటను ప్రయోగిస్తున్నారు.

ట్రంప్ బలహీనపడుతున్న దశలో చార్లీ కిర్క్ చెలరేగిపోతుండడం చాలా మందికి చికాకు తెప్పించింది. ఆ మేరకు అమెరికా యువతరంలో అతని మీద ఏవగింపు కూడా పెరుగుతూ వచ్చింది. రాబిన్‌సన్ చాలాకాలంగా కిర్క్ కదలికల్ని గమనిస్తున్నట్టు విచారణలో తేలింది. కిర్క్ సనాతన భావాల్ని అతను అసహ్యించు కునేవాడట. అతన్ని 'ఫాసిస్టు' అనేవాడట. ట్రంప్ కన్నా ముందు వీడి ఆట కట్టించాలి అనే భావంతో ఉండేవాడట. కిర్క్ హత్యకు వాడిన తుపాకీతో పాటు కొన్ని బుల్లెట్లను కూడ రాబిన్‌సన్ నుంచి ఫెడరల్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఒక బుల్లెట్ కేసింగ్ మీద 'రేయ్ ఫాసిస్ట్! అందుకో' అని రాసి ఉంది. ఇంకో కేసింగ్ మీద 'బెల్లా సియావో' అని రాసి ఉంది. ముస్సోలిని ఫాసిస్టు పాలన రోజుల్లో అతనికి వ్యతిరేకంగా బాధితులు పాడుకున్న ఇటాలియన్ పాట పల్లవి అది. అంటే చార్లీ కిర్క్‌ను రాబిన్‌సన్ ఎంతగా అధ్యయనం చేశాడో అతని మీద ఎంతగా కసితో రగిలిపోయాడో అర్థం అవుతోంది.

రెండవ ప్రపంచ యుద్ధకాలంలో ఇటలీలో ఫాసిజాన్నీ, జర్మనీలో నాజీజాన్నీ కార్ల్ మార్క్స్ అభిమానులు అంతం చేశారు. ఇప్పుడు అమెరికా ఫాసిస్టుల మీద కూడా సాంస్కృతిక మార్క్సిస్టులే తిరగబడుతున్నారు మరి.

■ డానీ (సమాజ విశ్లేషకులు)



పట్టని పనులు!

జల్ జీవన్ మిషన్‌పై అలక్ష్యం

జల్ జీవన్ మిషన్‌ను అందిపుచ్చుకోవడంలో ఉమ్మడి కృష్ణాజిల్లా గ్రామీణ నీటి సరఫరా విభాగం తడబడుతోంది. ఉన్నతాధికారుల బాధ్యతారాహిత్యం, ప్రజా ప్రతినిధుల అలసత్వం కారణంగా ఇతర జిల్లాల కంటే మన జిల్లా బాగా వెనుకబడింది. ఒక్కో జిల్లా 300 పనులు చొప్పున దక్కించుకుంటే మన జిల్లాకు కేవలం 14 తాగునీటి పైపులైన్ల పనులే మంజూరయ్యాయి. ఇవి కూడా చెంచులు ఎక్కువుగా ఉండే ప్రాంతాలకు కేంద్రం తప్పనిసరిగా ఇచ్చే పనులు కావటం గమనార్హం.

6

పట్టించుకోని ఆర్‌డబ్ల్యూఎస్ ఉన్నతాధికారులు » అన్ని జిల్లాల్లో 300- 350 పనులకు ఆమోదం

- ఉమ్మడి కృష్ణాజిల్లాకు మాత్రం 14 పనులే దక్కాయి..
- అవి కూడా చెంచులు నివాసం ఉండే ప్రాంతాలు కావటంతో తప్పనిసరిగా ఇచ్చినవే!
- రూ.6,063 కోట్ల వ్యయంతో వాటర్‌గ్రిడ్ ప్రాజెక్టుకు డీపీఆర్ తయారీ
- ఆమోదం పొంది.. మనకు శాంక్షన్ రావటానికి మరింత సమయం
- జిల్లాలో పనులు లేక పొరుగు జిల్లాలకు కాంట్రాక్టర్లు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): గ్రామాల్లో ప్రతి గృహానికి కుళాయి ద్వారా తాగునీరు అందించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం జల్ జీవన్ మిషన్‌ను ప్రారంభించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధుల భాగస్వామ్యంతో నడుస్తుంది. గత వైసీపీ ప్రభుత్వం ఈ పథకానికి రాష్ట్ర మ్యాచింగ్ గ్రాంట్ విడుదల చేయలేదు. దీంతో చాలా పనులు ఆగిపోయాయి. అసంపూర్తిగా ఎక్కడివక్కడ ఉండి పోయాయి. వీటిలో ఎంతో ప్రాధాన్యమైన పనులు కూడా కొన్ని ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక.. పనుల ప్రాధాన్యతను గుర్తించి పలు జిల్లాలు కొన్ని పనులను ప్రభుత్వానికి ప్రతిపాదనలుగా సమర్పించి, వాటికి ఆమోదం తెచ్చుకున్నాయి. పొరుగున ఉన్న ఉమ్మడి గుంటూరు జిల్లా 300 పైబడి పనులను తిరిగి తెచ్చుకుంది. ఎక్కడో దూరాన ఉండే ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా కూడా 300 పైబడి పనులను తిరిగి సాధించుకుని వాటిని చేపడుతోంది. ఇక్కడే ఉన్న ఉమ్మడి కృష్ణా జిల్లా పట్టుమని 100 పనులను కూడా తెచ్చుకోలేకపోయింది. కేవలం 14 తాగునీటి పైపులైన్ల పనులే మంజూరయ్యాయి. ఎన్టీఆర్ జిల్లాలో కంచికచర్ల మండలం పరిధిలో 9 పనులు, విజయవాడ రూరల్ మండలం పరిధిలో 5 పనులు మాత్రమే మంజూరయ్యాయి. వీటికి టెండర్లు పిలిచారు. అగ్రిమెంట్ల దశలో ఉన్నాయి. విజయవాడ రూరల్ మండల పరిధిలో టెండర్లు వేసిన కాంట్రాక్టర్లు పనులకు ఆసక్తి చూపిస్తారా ? వదిలేస్తారా అన్న అనుమానాలు కూడా ఉన్నాయి.

తమది కాదన్నట్టు వ్యవహరించారు!

ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కార్యాలయం నుంచి ఈ మేరకు ప్రతిపాదనలు చేయాల్సి ఉంది. రెండు జిల్లాల్లోని ప్రజా ప్రతినిధుల ద్వారా ప్రాధాన్యతా పనుల జాబితా తెప్పించుకుని వాటి సాకారానికి కృషి చేయాల్సిన ఉన్నతాధికారులు తమది కాదన్నట్టుగా వ్యవహరించారని విమర్శలు వస్తున్నాయి. ఆర్‌డబ్ల్యూఎస్‌లో పనిచేస్తున్న కొందరు ఉన్నతాధికారులు ఇక్కడ బలవంతంగా పనిచేస్తున్నారని సమాచారం. ఎప్పుడు వెళ్లిపోదామా అన్న ఆలోచనలో ఉన్నట్టు తెలిసింది. ఇలాంటి ఆలోచనలతో ఉన్నవారు జిల్లాలో ఈ పనులపై ఎంత వరకు శ్రద్ధ చూపుతారన్నది అర్థం చేసుకోవచ్చు. చెంచులు నివశించే ప్రాంతాలు లేకపోతే ఈ 14 పనులు కూడా మనకు వచ్చేవి కావని తెలిసింది.

వాటర్ గ్రిడ్ ప్రాజెక్టు విషయంలోనూ తాత్సారం

ఉమ్మడి కృష్ణాజిల్లాకు 2025-26 ఆర్థిక సంవత్సరానికి జల్ జీవన్ మిషన్ కింద రూ.6,063 కోట్ల వ్యయంతో వాటర్ గ్రిడ్ ప్రాజెక్టుకు ఆర్‌డబ్ల్యూఎస్ నేతృత్వంలో డీపీఆర్ తయారు చేశారు. పాత పనులను పూర్తిగా వదిలేసి.. కొత్త పనులపై దృష్టి సారించారు. 50 మండలాల పరిధిలో నూరుశాతం రక్షిత నీటిని అందించాలన్న ఉద్దేశ్యంతో సమగ్ర డీపీఆర్‌ను తయారు చేశారు. ప్రస్తుతం ఏలూరు జిల్లాలో కలిసిన ప్రాంతాలను మిగతా 6లో..

ఉచిత టికెట్ల రగడ!

గతేడాది దసరా ఉత్సవాల్లో ప్రొటోకాల్, వీవీఐపీ, వీఐపీలకు పంపిణీ

- నిర్దేశించిన సమయానికి రాకుండా ఇష్టారాజ్యంగా దర్శనాలు
- మళ్లీ ఈ ఏడాది ఉచిత టికెట్లు కావాలని సమన్వయశాఖల సూచన
- ఇప్పటికే వీఐపీల కోసం రూ. 500 టికెట్లు రద్దు
- తిరుమలను చూసైనా నేర్చుకోవడంలేదని పలువురి విమర్శ
- నేడు మంత్రి సమక్షంలో సమన్వయశాఖల సమావేశం



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): తిరుమలలో శ్రీవారి దర్శనానికి వచ్చే వారు ఎవరైనా సరే ఖచ్చితంగా టికెట్ కొనుగోలు చేయాల్సిందే. కానీ రాష్ట్రంలోనే రెండో అతిపెద్దదైన కనకదుర్గమ్మ ఆలయానికి వచ్చే సరికి మాత్రం దర్శనాలు ఉచితంగా కావాలని ప్రోటోకాల్, వీవీఐపీ, వీఐపీలు కోరుకుంటున్నారు. గతేడాది ప్రోటోకాల్, వీవీఐపీలకు జీరో ఫేర్ టికెట్లను దేవస్థానం జారీ చేసింది. దీని వల్ల దేవస్థానం రూ.2 కోట్ల మేర ఆదాయాన్ని కోల్పోయింది. ఈ దసరా ఉత్సవాలలో కూడా ఉచిత టికెట్లను ఇవ్వాలని పలుశాఖలు దేవస్థానానికి సూచిస్తున్నాయి. సమన్వయ కమిటీ సమావేశంలో భక్తుల ఇబ్బందులు, మిగతా 6లో..

ఇష్టారాజ్యంగా పైరవీలు!

దసరా ఉత్సవాలలో వీఐపీ అనే అర్థమే మారిపోతుంది. గుడికి వచ్చేవాళ్లంతా వీఐపీలే. ఎవరికి వారు వీఐపీ దర్శనాలకు ఎగబడుతుంటారు. పైరవీలు చేస్తారు. రాజకీయ ఒత్తిళ్లు తీసుకువస్తారు. రాజకీయ నాయకులు కూడా ఇష్టానుసారంగా తమ అనుచరులను కొండమీదకు పంపుతారు. సమన్వయ శాఖలన్నీ తమ కుటుంబాలనే కాకుండా బంధువర్గాలకు వీఐపీల పేరుతో దర్శనాలు చేయిస్తుంటాయి. ప్రోటోకాల్‌లో కూడా ఇష్టానుసారం దర్శనాలు జరుగుతున్నాయి. వీఐపీ సంగతి చెప్పనక్కర లేదు. ఈ రెండింటికీ ధరతో కూడిన టికెట్లను తప్పనిసరి చేస్తేనే అనధికారిక దర్శనాలను నియంత్రించటం సాధ్యమవుతుంది. తిరుపతిలో అనుసరిస్తున్న విధానాన్ని విజయవాడలో అమలు చేయటం ద్వారా భక్తులందరికీ న్యాయం జరుగుతుందని పలువురు పేర్కొంటున్నారు.



పోర్టు నిర్మాణ పనులు పరిశీలిస్తున్న రవాణ, ఆర్‌అండ్‌బీ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి కృష్ణబాబు

వచ్చే ఏడాది అక్టోబరుకు పోర్టు సిద్ధం

ఆర్ అండ్‌బీ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి కృష్ణబాబు

మచిలీపట్నం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం పోర్టు నిర్మాణ పనులను వేగవంతం చేసి 2026 అక్టోబరులో పోర్టురవాణా కార్యకలాపాలు ప్రారంభిస్తామని రాష్ట్ర రవాణ, రహదారులు, భవనాల శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎంటి.కృష్ణబాబు పేర్కొన్నారు. శనివారం ఉదయం ఆయన అధికారులతో కలిసి మచిలీపట్నం పోర్టు నిర్మాణ ప్రాంతాన్ని సందర్శించి పనుల పురోగతిని పరిశీలించారు. నార్త్, సౌత్ బ్రేక్ వాటర్, డ్రెడ్జింగ్ బెర్తులు, రహదారులు, పరిపాలన భవనాలు, గిడ్డంగుల నిర్మాణాలు తదితర పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఏపీ మారిటైం బోర్డు సీఈవో ప్రవీణ్ ఆదిత్యతో కలిసి పరిపాలన భవనంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఆయన ఇప్పటివరకూ ఆయా పనుల పురోగతి ఎంతవరకు పూర్తయింది అనే అంశంపై సమీక్షించారు. పెద్దమొత్తంలో యంత్రాలు, మ్యాన్‌పవర్ పెంచి నిర్ధేశించిన సమయానికి పోర్టు పనులను పూర్తిచేయాలని ఆయన ఈ సందర్భంగా అధికారులకు సూచించారు. అనంతరం కృష్ణబాబు మీడియాతో మాట్లాడుతూ, రూ.5,500 కోట్ల వ్యయంతో చేపట్టిన మచిలీపట్నం పోర్టునిర్మాణ పనులను వేగవంతం చేసి 2026 అక్టోబరు నాటికి పోర్టు రవాణా కార్యకలాపాలను ప్రారంభించాలనే కృతనిశ్చయంతో ముఖ్యమంత్రి ఉన్నారని తెలిపారు. గిలకలదిండి హార్బర్ పనుల్లో పురోగతి కనిపించకపోతే కాంట్రాక్టు రద్దు చేస్తామని హెచ్చరించారు.

అదుపులో డయేరియా

విజయవాడ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నగరంలో డయేరియా కేసులు అదుపులోకి వస్తున్నాయి. న్యూ రాజరాజేశ్వరిపేటలో శనివారం కొత్త కేసులు నమోదుకాలేదు. 24 మందికి డయేరియా లక్షణాలు కనిపించడంతో వారందరికీ హుటాహుటిన వైద్యసేవలు అందించారు. వారిలో ఇరవై మంది ఆరోగ్యం కుదుటపడగా, నలుగురి పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో వారిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. డయేరియా పరీక్షలు నిర్వహించి నిర్ధారణ చేయాల్సి ఉంది. ప్రభుత్వాసుపత్రిలో మొత్తం 91 మంది డయేరియా లక్షణాలతో చేరారు. ప్రస్తుతం పాత జీజీహెచ్‌లో 11 మంది, కొత్త జీజీహెచ్‌లో 40 మందిని కలుపుకుని మొత్తం 51 మంది చికిత్స పొందుతున్నట్టు జీజీహెచ్ సూపరింటెండెంట్ తెలిపారు.

జిల్లా అంతటా వర్షం

తిరువూరు, మైలవరం నియోజకవర్గాల్లో కుండపోత

లోతట్టు ప్రాంతాలు జలమయం

- మెట్ట ప్రాంతంలోని పత్తి పంటకు నష్టం
- జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాల్లో తేలికపాటి జల్లులు




విస్సన్నపేటలో జాతీయ రహదారిపై భారీగా చేరిన వర్షపు నీరు

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లాలో శనివారం భారీ వర్షం కురిసింది. మైలవరం, తిరువూరు నియోజకవర్గాలోని పలు మండలాల్లో కుండపోతగా వర్షం పడింది. లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ఈ వర్షం వరి పంటకు మేలు చేయగా, పత్తి పంటకు మాత్రం తీవ్ర నష్టం చేసే ప్రమాదం ఉందని పలువురు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

» రోడ్లపై భారీగా నీరు

తిరువూరులో బస్టాండ్‌లోకి వర్షపు నీరు చేరింది. పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. గంపలగూడెం మండలంలో 16 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయ్యింది. పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ఎ.కొండూరు మండలంలో 20 మిల్లీమీటర్ల వర్షం పడింది. లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. విస్సన్నపేట మండలంలో భారీ వర్షం కురిసింది. జాతీయ రహదారి 216 జలమయం అయ్యింది. వర్షపు నీరు రహదారిపై ఆగిపోయింది. దీంతో వాహన రాకపోకలకు అంతరాయం మిగతా 6లో..

ముక్త్యాల వద్ద పరుగులు పెడుతున్న కృష్ణమ్మ



నదీ పరివాహక గ్రామాల్లో హైఅలెర్ట్

జగ్గయ్యపేట రూరల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కృష్ణానదికి ఎగువ నుంచి వస్తున్న వరదతో పులిచింతల నుంచి దిగువకు 2.50 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేయటంతో నదీ పరివాహక గ్రామాలైన ముక్త్యాల, రావిరాల, వేదాద్రి గ్రామాలలో అధికారులు హైఅలెర్ట్ ప్రకటించారు. వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణితో తెలంగాణలో భారీ వర్షాలు కురుస్తాయనే హెచ్చరికలతో శ్రీశైలం, నాగార్జున సాగర్ డ్యాంల నుంచి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో అప్రమత్తమైన అధికారులు పులిచింతల నుంచి నీటి విడుదలను పెంచారు. కృష్ణానదికి వరదతో పాటు పరివాహక ప్రాంతాలలోని ఉప నదులకు భారీగా వరద నీరు చేరుతుండటంతో కృష్ణానదికి వరద పెరిగింది. మూడు లక్షలకు పైగా నీటి విడుదల పెరిగే అవకాశం ఉందనే హెచ్చరికలతో అధికారులు అప్రమత్తమయ్యారు.

విషజ్వరాల విజృంభణ

ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు క్యూ కడుతున్న రోగులు

- వీరిలో సీజనల్ వ్యాధిగ్రస్తులే అధికం
- అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు



రోగులతో కిటకిటలాడుతున్న ప్రభుత్వ ఆస్పత్రి 6

విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ జ్వరాలు ప్రజలను చుట్టుముడుతున్నాయి. దీంతో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు రోగులు క్యూ కడుతున్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో వార్డులు కిటకిటలాడుతున్నాయి. బెడ్లు సరిపోక తీవ్ర అవస్థలు పడుతున్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు. పరిసరాలు, వ్యక్తిగత శుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొంటున్నారు.

చంపి వైరా నదిలో పడేసిన తండ్రి

మైలవరం మైనర్ బాలిక కేసును ఛేదించిన పోలీసులు

వివరాలు వెల్లడించిన పోలీసులు

మైలవరం రూరల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మైలవరంలో సంచలనం రేపిన బాలిక హత్య కేసును పోలీసులు ఛేదించారు. మైలవరం పోలీస్‌స్టేషన్‌లో ఈ కేసు వివరాలను సీఐ దాడి చంద్రశేఖర్ శనివారం మీడియాకు వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. మైలవరంలోని శాంతినగర్‌లో నివాసం ఉంటున్న చిందే బాజికి ఇద్దరు భార్యలు. మొదటి భార్య నాగమ్మకు ఐదుగురు కుమార్తెలు. రెండో భార్య నాగేంద్రమ్మకు గాయత్రీ(14) అనే కుమార్తె ఉంది. స్థానిక బాలికల హైస్కూల్లో 7వ తరగతి చదివి మానేసింది. నాగమ్మ, ఆమె కుమార్తెలతో కలిసి గాయత్రీ శాంతినగర్‌లో నివాసం ఉంటుంది. బాజికి నూజివీడు జైలులో పరిచయమైన నూజివీడుకు చెందిన రోహిత్ అనే వ్యక్తిని ఉల్లిపాయల వ్యాపారం కోసం బాజి తోడుగా తెచ్చుకున్నాడు. రోహిత్‌తో గాయత్రీ చనువుగా ఉండటాన్ని గమనించిన బాజి పలుమార్లు కుమార్తె గాయత్రీని మందలించాడు. ఆగస్టు 31వ తేదీన మరోమారు మందలించగా, గాయత్రీలో మార్పు రాకపోగా ఎదురు సమాధానం చెప్పింది. దీంతో ఆగ్రహంతో ఊగిపోయిన బాజి ఇనుప రాడ్డుతో గాయత్రీని కొట్టగా తీవ్రగాయమై ఆమె చనిపోయింది. గాయత్రీ మృతదేహాన్ని అదే రోజు అర్ధరాత్రి మూడు గంటల సమయంలో ఆటోలో తీసుకెళ్లి మధిర - సిరిపురం బ్రిడ్జిపై నుంచి వైరా నదిలో పడేశాడు. ఆ తర్వాత తాను మందలిస్తే గాయత్రీ ఇంట్లో నుంచి వెళ్లిపోయిందని స్థానికులు, బంధువులను నమ్మించాడు. ఈ క్రమంలో తిరువూరు, తెలంగాణలోని భద్రాచలం ఏజెన్సీలోని వెంకటాపురంలో బాజి మిగతా 6లో..



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న సీఐ దాడి చంద్రశేఖర్, పక్కన ఎస్సై సుధాకర్, తదితరులు

దసరా ఏర్పాట్లపై దిశానిర్దేశం

8లో

కొనసాగుతున్న బూడిద ఉద్యమం 8

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల మృతి 8

రాష్ట్ర స్థాయి ధర్మ సమ్మేళనం నేడు 6 8

విషజ్వరాల విజృంభణ

● ఎక్కువ మంది జ్వరం, ఒళ్లు నొప్పులు, గొంతు ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్న వారే ● కలుషిత నీరు, ఆహారమే కారణం

(ఆంధ్రజ్యోతి - విజయవాడ)

ఉభయ జిల్లాల్లో ప్రజలు పెద్ద సంఖ్యలో విషజ్వరాల బారిన పడుతున్నారు. మలేరియా, టైఫాయిడ్‌తో పాటు డెంగ్యూ వ్యాధులతో వచ్చే రోగులతో ప్రభుత్వాసుపత్రులు కిటకిటలాడుతున్నాయి. ప్రైవేటు ఆసుపత్రులకు రోగులు క్యూ కడుతున్నారు. విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో పరిస్థితి మరింత తీవ్రంగా ఉంది. జ్వరంతో వైద్యం కోసం వచ్చే వారితో ఆసుపత్రిలోని పలు వార్డులు కిటకిటలాడుతున్నాయి. రోగులకు సరిపడా మంచాలు లేకపోవడంతో వార్డు నడవాలో బెడ్లు వేసి చికిత్స అందిస్తున్నారు. జ్వరాల తీవ్రతను ముందు గుర్తించి ఊహించి నివారణ చర్యలు తీసుకోవాల్సిన వైద్య ఆరోగ్య శాఖ, వీఎంసీ ఆ దిశగా స్పందించడం లేదు. మురుగునీటి కాల్వలు, కుంటల్లో వర్షపు నీరు చేరి నిల్వ ఉండడం వల్ల దోమలు వృద్ధి చెంది వ్యాధులు ప్రబలుతున్నాయి. కొద్దిపాటి వర్షాలకు విజయవాడలోని కొన్ని ప్రాంతాల్లో తాగునీరు కలుషితమై ప్రజలు అతి సార (డయేరియా) వ్యాధికి గురైన సంగతి తెలిసిందే. ప్రజారోగ్య విభాగం దీనిని గుర్తించి దోమల నివారణకు ఫాగింగ్, నెట్ల పంపిణీ చేయడంతో పాటు నీరు కలుషితం అవుతున్న ప్రాంతాలను గుర్తించి వారికి తాగునీరు అందించే ఏర్పాట్లు చేయాలని ప్రజలు కోరుతున్నారు.


జ్వరపీడితులతో కిటకిటలాడుతున్న విజయవాడ ప్రభుత్వాసుపత్రి

అప్రమత్తంగా ఉండాలి

వ్యాధుల వ్యాప్తికి దోమలు, ఈగలతో పాటు కలుషితమైన ఆహారం, కలుషిత నీటిని తీసుకోడమే ప్రధాన కారణమని వైద్యులు చెబుతున్నారు. కలుషిత నీటి నీ తాగడం వల్ల టైఫాయిడ్, కలరా, పచ్చకామెర్లు, విషజ్వరాలు, అమీబియాసిస్, రక్తవిరేచనాలు వ్యాప్తి చెందుతాయని, వీటి బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

వర్షాలూ కారణమే..

కొన్ని రోజులుగా సీజనల్ వ్యాధులు వ్యాపిస్తున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది కేసులు నమోదవుతున్నాయి. రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు వ్యాధులు విజృంభించే అవకాశ ముందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. వర్షాలతో పాటు వాతావరణంలో వచ్చిన మార్పులు కూడా వైరల్ జ్వరాల వ్యాప్తికి కారణమని వైద్యు లు తెలిపారు. చల్లగాలుల వల్ల గొంతు ఇన్‌ఫెక్షన్, గొం తు వాపు, తలనొప్పి, జలుబు, దగ్గు వంటి సమస్యలు వస్తాయన్నారు. వాతావరణ మార్పులతో వైరస్, బాక్టీరియా యాక్టివ్ అయి వ్యాధుల బారినపడేలా చేస్తాయన్నారు. ముఖ్యంగా చిన్నారులు, బాలింతలు, గర్భిణిలు చల్లటిగాలుల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.

కాచి చల్లార్చిన నీటిని తాగాలి

● బ్లీచింగ్ పౌడర్ కలిపి క్లోరినేషన్ చేసిన నీటిని, కొళాయి నీటిని మాత్రమే తాగాలి. నీరు కలుషితమైనట్లు ఏమాత్రం అనుమానం వచ్చినా కాచి చల్లార్చిన నీటిని తాగడం మంచిది.

● పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా దోమల వ్యాప్తిని నివారించాలి.

● నీరు నిలిచి ఉన్న చోట కిరోసిన్, ఏదైనా ఆయిల్ వేస్తే దోమల వృద్ధిని అరికట్టవచ్చు.

● నీటితొట్టె, టైర్లు, ట్యాంకులు ఉంటే నీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలి.

ముందస్తు జాగ్రత్తలు అవశ్యం



ప్రస్తుతం ఆసుపత్రికి వస్తున్నవారిలో అధిక శాతం మంది తీవ్రమైన జ్వరం, ఒళ్లునొప్పులతో బాధపడుతున్నవారే. కీళ్ల నొప్పులు, కఫం, గొంతునొప్పి వంటి లక్షణాలతో వస్తున్నారు. ఇవన్నీ సీజనల్ వ్యాధుల లక్షణాలే. ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంతోనే సీజనల్ వ్యాధుల బారినపడకుండా ఉండొచ్చు. ఇంటి పరిసరాల్లో వీలైనంత వరకు తొట్టె, టైర్లు, ఖాళీ డబ్బాలు ఉం డకుండా చూసుకోవాలి. ఒకవేళ ఉన్నా వాటిని వారానికి రెండు రోజులు ఖాళీ చేస్తూ డ్రైడే పాటించాలి. దోమకాట్ల నుంచి రక్షణకు దోమతెరలు, దోమల బ్యాట్లు వాడడం మంచిది. కాచి చల్లార్చిన నీటిని తాగాలి. ఆహారం కలుషితం కాకుండా చూసుకోవాలి. ఆహారం ఏ పూటది ఆ పూట వండుకోవడం ఉత్తమం..

- డాక్టర్ కె.ఇందిరా దేవి, జనరల్ మెడిసిన్ హెచ్‌వోడీ, విజయవాడ ప్రభుత్వాసుపత్రి

సీబీఐ కూడా అన్యాయమే చేస్తోంది!

» కోర్టుకు సీబీఐ ఇచ్చిన నివేదిక కాపీ మాకు ఇవ్వకుండా అభ్యంతరం చెప్పమంటే ఎలా?

» అందుకే నోటీసులు తిరస్కరించాం

» సీఎం, డిప్యూటీ సీఎం జోక్యంతోనే న్యాయం: ఆయేషామీరా తల్లిదండ్రులు


ఆయేషా ఫొటోతో తల్లిదండ్రులు సంషాద్ బేగం, ఇక్బాల్ బాషా

తెనాలి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): "మా అమ్మాయిని దారుణంగా హత్య చేసిన నరహంతకులకు శిక్ష పడాలని 18 ఏళ్లుగా పోరాడుతున్నాం. కానీ ఇక మాకు న్యాయం జరగదని సీబీఐ తీరుతో అర్థమైపోయింది" అని ఆయేషామీరా తల్లిదండ్రులు షంషాద్ బేగం, ఇక్బాల్ బాషా ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 19న సీబీఐ కోర్టుకు హాజరు కావాలంటూ నోటీసు పంపిన నేపథ్యంలో వారు శనివారం గుంటూరు జిల్లా తెనాలిలో విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా సీబీఐ వ్యవహరించిన తీరుపై మండిపడ్డారు. వారేమన్నారంటే.. "మా పాప హత్య తర్వాత నిర్భయ, ప్రియాంక, వరంగల్‌లో ప్రణతి వంటివారి దారుణ సంఘటనలు జరిగాయి. వారి కేసుల్లో నేరస్థులు ఆర్థిక, రాజకీయ పలుకుబడి లేనివారు కాబట్టే ఆ దోషులకు శిక్ష పడింది. కానీ మా పాప కేసు అలాకాదు. నేరస్థులకు రాజకీయ, ఆర్థిక, పోలీసు అండదండలు ఉన్నాయి కాబట్టే ఇన్నేళ్లయినా న్యాయం జరగటంలేదు. చేయని నేరానికి శిక్ష అనుభవించి నిర్దోషిగా విడుదలైన పిడతల సత్యంబాబునే మళ్లీ సీబీఐ తెరపైకి తీసుకురావడం ఏమిటి? ఇప్పటికీ మేము సత్యంబాబు దోషి కాదని చెబుతున్నా, మళ్లీ కోర్టుకు వచ్చి అభ్యంతరం చెప్పాలనటం ఏమిటి? అతడు నిర్దోషి అని గౌరవ న్యాయస్థానమే తీర్పు చెప్పాక అతనిపై ఉన్న కేసుకు సంబంధించి సెక్షన్ల ప్రస్తావన ఎందుకు వచ్చిందో అర్థంకావటంలేదు. కేసు విచారణ పూర్తయిందని జూన్‌లోనే సీబీఐ నివేదికను కోర్టుకు సమర్పించింది. ఆ రిపోర్టు కాపీలను మా చేతికివ్వకుండా, కేసు విచారణ విషయంలో మా అభ్యంతరాలను ఏ విధంగా తెలియచేయగలం? అందుకే కోర్టు నోటీసును తిరస్కరించాం. సీబీఐ దర్యాప్తు కోరవద్దని సుగాలీ ప్రీతి బంధువులకు సలహా ఇస్తున్నాం. మా కేసు విషయంలో అప్పట్లో సిట్, సీబీఐ దర్యాప్తునకు సహకరించిన ప్రస్తుత సీఎం, కొత్తగా వచ్చిన డిప్యూటీ సీఎం స్పందించాలి. వారు జోక్యం చేసుకుంటే దోషులు బయటకు వస్తారన్న నమ్మకం ఉంది. చివరి ఆశ వారిపైనే ఉంది. న్యాయం జరిగేలా చూడాలి" అని షంషాద్ బేగం, ఇక్బాల్ బాషా అభ్యర్థించారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో తెలుగు అమలు చేయండి

» రఘురామకు తెలుగు విజ్ఞాన సమితి విజ్ఞప్తి

బెంగళూరు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ కార్యాలయాల్లో తెలుగు భాషను సంపూర్ణంగా అమలు చేయాలని శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజుకు తెలుగు విజ్ఞాన సమితి విన్నవించింది. కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ సదస్సులో పాల్గొనేందుకు బెంగళూరుకు వచ్చిన రఘురామకృష్ణరాజును తెలుగు విజ్ఞాన సమితి అధ్యక్షుడు రాధాకృష్ణరాజు, ఉపాధ్యక్షుడు ఆదికేశవులు నాయుడు శనివారం కలిశారు. మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ అమలు చేసిన భాషా విధానాన్ని విస్మరించరాదని కోరారు.

జింక్ రేకుల పరిశ్రమలో పేలుడు

» ఒకరి మృతి, పది మందికి గాయాలు


పేలుడు సంభవించిన పరిశ్రమలోని ప్రాంతం, ఆదిత్య కుమార్

గూడూరు అర్బన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా గూడూరు మండలం తుంగపాళెం గ్రామ సమీపంలోని జింక్ రేకుల తయారీ పరిశ్రమలో శనివారం పేలుడు సంభవించింది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా, పది మంది గాయపడ్డారు. కలర్‌షైన్ పరిశ్రమలో జింక్ రేకులను తయారు చేస్తారు. స్టాకు ఎక్కువగా ఉండటంతో 15 రోజులుగా ఉత్పత్తి నిలిపివేశారు. శనివారం నుంచి మళ్లీ ఉత్పత్తి ప్రారంభించేందుకు సిబ్బంది జింక్ పాట్‌ను పరిశీలిస్తున్న సమయంలో ఎయిర్ లీకేజీ కారణంగా పేలుడు సంభవించింది. ఈ ఘటనలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన కార్మికుడు ఆదిత్యకుమార్(30) మృతి చెందాడు. ఇద్దరు తీవ్రంగా, ఎనిమిది మంది స్వల్పంగా గాయపడ్డారు.

టీటీడీ బోర్డు సభ్యులుగా ఇద్దరు ప్రమాణస్వీకారం


సుదర్శన్ వేణు , హరి జవహర్‌లాల్

తిరుమల, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): టీటీడీ ధర్మకర్తల మండలి ఎక్స్ అఫిషియో సభ్యుడిగా దేవదాయ శాఖ కార్యదర్శి హరి జవహర్‌లాల్, సభ్యుడిగా సుదర్శన్ వేణు శనివారం ప్రమాణం చేశారు. టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి వారితో ప్రమాణం చేయించారు. శ్రీవారి దర్శనానంతరం వారిని రంగనాయక మండపంలో వేదపండితులు ఆశీర్వదించగా, అదనపు ఈవో లడ్డూ ప్రసాదాలు అందజేశారు.

ఉద్యోగులకు ఓ న్యాయం? ప్రజా ప్రతినిధులకో న్యాయమా?


» పెన్షన్ విషయంలో ప్రభుత్వాల తీరు మారాలి: బొప్పరాజు

అనంతపురం కలెక్టరేట్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): 'పెన్షన్ విషయంలో ప్రజా ప్రతినిధులకో న్యాయం.. మాకో న్యాయమా? ఏమిటీ వివక్ష?' అని ఏపీ రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు ప్రశ్నించారు. అనంతపురంలో శనివారం ఆయన మాట్లాడారు. 'ఉద్యోగులు 35 ఏళ్ల పనిచేసినా పెన్షన్ వద్దట. కానీ ఎమ్మెల్యేగా ఒక పెన్షన్, ఎంపీగా గెలిస్తే మరో పెన్షన్, ఉప రాష్ట్రపతికి ఇంకో పెన్షన్ పొందుతారు. ఇన్ని పెన్షన్‌లు తీసుకుంటుంటే రాష్ట్రం, కేంద్రానికి భారం కాదా?' అని నిలదీశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎందుకిలా ప్రవర్తిస్తున్నాయో తెలియడం లేదన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తామని ఉపాధ్యాయ దినోత్సవం రోజు ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారని, దసరా కానుకగా ప్రకటిస్తారనే ఆశతో ఉన్నామన్నారు. కాగా, అనంతపురం జిల్లాలో నవంబరు 7, 8, 9 తేదీల్లో రాష్ట్రస్థాయి రెవెన్యూ క్రీడలు, సాంస్కృతిక ఉత్సవాలను నిర్వహిస్తామని తెలిపారు.

7న ఉపాధ్యాయ సంఘాల రాష్ట్రస్థాయి ధర్నా

అమరావతి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల సమస్యలపై వచ్చే నెల 7న విజయవాడలో రాష్ట్రస్థాయి ధర్నా చేపట్టనున్నట్టు ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) చైర్మన్, సెక్రటరీ జనరల్ ఎల్.సాయి శ్రీనివాస్, ఎస్.చిరంజీవి తెలిపారు. ఏకీకృత సర్వీస్ రూల్స్ సమస్యలు పరిష్కరించాలని, పంచాయతీరాజ్ మేనేజ్‌మెంట్ పాఠశాలల్లో పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలుచేయాలని, ఉపాధ్యాయులకు బోధనేతర కార్యక్రమాలు లేకుండా చేయాలని, హైస్కూల్ ప్లస్‌లలో టీచర్ల నియామకాలు చేపట్టాలని కోరారు.

'భోగాపురం' పనులు 86 శాతం పూర్తి


ఎయిర్ పోర్టు పనుల వివరాలను తెలుసుకుంటున్న కేంద్రమంత్రి రామ్మోహన్

భోగాపురం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా భోగాపురంలో నిర్మిస్తున్న విమానాశ్రయం పనులు ఇప్పటికి 86 శాతం పూర్తయినట్లు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ తెలిపారు. శనివారం ఆయన ఎయిర్‌పోర్టు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 14 నెలల కిందట 26శాతం ఉన్న పనులు ప్రస్తుతం 86 శాతం పూర్తయ్యాయని చెప్పారు. దేశంలో అందమైన ఎయిర్ పోర్టు భోగాపురం అన్నారు. రన్‌వే, ట్యాక్సీవే పనులు దాదాపు పూర్తయ్యాయన్నారు. ప్రధాన టెర్మినల్ 79, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ భవనం 90, అదనపు భవనాలు 62శాతం పూర్తయినట్టు తెలిపారు.

న్యూరాజరాజేశ్వరిపేటలో మంత్రి నారాయణ పర్యటన

అజిత్‌సింగ్‌నగర్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : న్యూ రాజరాజేశ్వరిపేట ప్రాంతంలో డయేరియా లక్షణాలతో ప్రజలు ఆసుపత్రుల పాలవుతుండటంతో మున్సిపల్ శాఖా మంత్రి నారాయణ ఆ ప్రాంతంపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఇప్పటికే వ్యాధి లక్షణాలతో ముగ్గురు మృతి చెందగా, వందల మంది ఆసుపత్రుల పాలవడంతో మంత్రి వరుస పర్యటనలు చేస్తున్నారు. రెండు రోజులు ఆ ప్రాంతంలో పర్యటించిన మంత్రి మూడో రోజైన శనివారం కూడా న్యూ రాజరాజేశ్వరిపేటలోని కేర్ అండ్ షేర్ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని పరిశీలించారు. నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్రతో మాట్లాడి రోగులకు అందుతున్న వైద్య సేవల వివరాలు తెలుసుకున్నారు. వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరించి ప్రజల్లో ధైర్యం నింపాలని కమిషనర్‌కు సూచించారు. కలెక్టర్ లక్ష్మీశా, నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర శనివారం రాజరాజేశ్వరిపేటలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. పారిశుధ్యం, మంచినీటి సరఫరా, వైద్య శిబిరంలో అందుతున్న సేవలు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, అవసరమైతే ప్రభుత్వాసుపత్రికి తరలించాలని సూచించారు. ఆసుపత్రుల్లో చేరిన స్థానికుల ఇళ్లకు వెళ్లి వ్యాధి నివారణకు తగు సూచనలు చేశారు.

కృష్ణా ఎస్పీగా విద్యాసాగర్‌నాయుడు



మచిలీపట్నం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్పీగా వాసన విద్యాసాగర్ నాయుడు నియమి తులయ్యారు. రాష్ట్రంలోని పలు జిల్లాల ఎస్పీలను బదిలీ చేస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ప్రక్రియలో భాగంగా అన్నమయ్య జిల్లా ఎస్పీగా పనిచేస్తున్న విద్యాసాగర్ నాయుడు జిల్లాకు బదిలీ అయ్యారు. ఇప్పటి వరకు జిల్లా ఎస్పీగా పనిచేసిన ఆర్.గంగాధరరావును డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఉత్తర్వులలో పేర్కొన్నారు.

తాడిగడప విచారణకు వస్తున్నా..

● ఆంధ్రజ్యోతి కథనానికి విచారణాధికారి స్పందన

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

కానూరు, సెప్టెంబరు13 (ఆంధ్రజ్యోతి) : తాడిగడప మునిసిపాలిటీలో అటకెక్కిన విచారణ శీర్షికన ప్రచురితమైన కథనానికి విచారణాధికారి స్పందించారు. ప్రభుత్వం జీవో ఇచ్చి నెలలు కావస్తున్నా విచారణకు రాని అధికారి..నేనొస్తున్నానంటూ తాడిగడప మునిసిపాలిటీకి సమాచారం ఇచ్చా రు. ప్రభుత్వం ఆర్డర్ ఇచ్చినా తనకు కాపీ రాలేదని, తనను ప్రశ్నించిన వారితో చెప్పిన విచారణాధికారి ఎట్టకేలకు విచారణకు సిద్ధమయ్యారు. తాడిగడప మునిసిపాలిటీ టౌన్‌ప్లానింగ్ విభాగం పరిధిలో జరిగిన అవినీతిపై విచారణ చేసేందుకు ప్రభుత్వం విచారణాకారిగా నియమించిన డైరెక్టరేట్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్(డీటీసీపీ) అడిషనల్ డైరెక్టర్ జి.వి.జి.ఎస్.వరప్రసాద్ ఈనెల 29న తాడిగడప మునిసిపాలిటీకి వస్తున్నట్లు సమాచారం పంపారు. ఈ విషయాన్ని తాడిగడప కమిషనర్ షేక్ నజీర్ శనివారం ఆంధ్రజ్యోతికి తెలిపారు. మునిసిపల్ కార్యాలయం టౌన్‌ప్లానింగ్ సెక్షన్‌లోని ఫైళ్లను పరిశీలించడంతోపాటు అవసరమైతే ఫీల్డ్‌కు వెళ్లి విచారణ నిర్వహిస్తారని పేర్కొన్నారు. మూడు, నాలుగు దఫాలుగా విచారణ జరిగిన అనంతరం పూర్తి సమాచారం వచ్చిన తరువాత ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని కమిషనర్ షేక్ నజీర్ పేర్కొన్నారు.

పట్టని పనులు!

(5వ పేజీ తరువాయి)

కూడా ఉమ్మడి కృష్ణా డీపీఆర్‌లో చేర్చటం జరిగింది. ఈ డీపీఆర్‌ను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించటంలోనూ అంతులేని జాప్యం జరిగింది. ప్రభుత్వం నుంచి తెచ్చుకునే విషయంలో కూడా జాప్యం జరుగుతూ వస్తోంది. వాటర్‌గ్రిడ్ ప్రాజెక్టులో భాగంగా పులిచింతల నుంచి జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాలకు మంచినీటిని ఒడిసి పట్టాలని నిర్ణయించారు. దీనికి సంబంధించిన ప్రణాళికలను సిద్ధం చేశారు. ప్రకాశం బ్యారేజీ బ్యాక్ వాటర్ ద్వారా గొల్లపూడి నుంచి తిరువూరు నియోజకవర్గంలో మూడు మండలాలు, మైలవరం నియోజకవర్గం పరిధిలో విజయవాడ రూరల్ మండలానికి కృష్ణా నీటిని తీసుకువెళ్లేలా నిర్ణయించారు. వీటీపీఎస్ కూలింగ్ కెనాల్ ద్వారా ఇప్పటికే మైలవరం, జి.కొండూరు, ఇబ్రహీంపట్నం, రెడ్డిగూడెం మండలాలకు పాక్షికంగా మంచినీటి అవసరాలను తీర్చటం జరుగుతోంది. తాజా వాటర్‌గ్రిడ్ డీపీఆర్‌లో ఆయా మండలాలకు పూర్తిస్థాయిలో మంచినీటిని అందించేందుకు వీలుగా ప్రతిపాదనలు సిద్ధం చేశారు. తిరువూరు నియోజకవర్గం పరిధిలోని ఏ.కొండూరు మండలంలో కిడ్నీ వ్యాధి ప్రభావిత ప్రాంతాలకు కూడా సంపూర్ణంగా కృష్ణాజలాలను తీసుకు వెళ్లేందుకు వీలుగా ప్రతిపాదనలు చేశారు. వాటర్ గ్రిడ్ ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వం ఆమోదించాల్సి ఉంది. ఆ తర్వాత వాటర్ గ్రిడ్ ప్రాజెక్టులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం తన ఆర్థిక పరిస్థితులను బట్టి మొదటి దశలో ప్రాధాన్యతా క్రమంలో ఎంత వరకు శాంక్షన్ ఇస్తుందన్నదానికి మరి కొంత సమయం పట్టే అవకాశం ఉంది. వాటర్ గ్రిడ్ ప్రాజెక్టు పేరుతో ఇప్పటికే నోటిఫైడ్ అయి, టెండర్లు పిలిచిన పనులలో ప్రాధాన్యత కలిగిన వాటిపై నిర్లక్ష్యం చూపటం వల్ల క్షేత్ర స్థాయిలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

పొరుగు జిల్లాలకు తరలిన కాంట్రాక్టర్లు

ఉమ్మడి కృష్ణాజిల్లాలో పనులు లేకపోవటంతో ఇక్కడి కాంట్రాక్టర్లు ఇతర జిల్లాలకు తరలి వెళ్లిపోయారు. అక్కడ పనులు చేసుకుంటున్నారు. ఈ పరిస్థితికి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులే కారణమని విమర్శలు వస్తున్నాయి.

ఉచిత టికెట్ల రగడ!

(5వ పేజీ తరువాయి)

సౌకర్యాలపై ఆయా శాఖలు దృష్టి సారించి దేవస్థానానికి సలహాలు ఇవ్వాలి కానీ, టికెట్ల వంటి దేవస్థాన అంతరంగిక విషయాలను కూడా సమన్వయ శాఖలు ప్రభావితం చేసేలా వ్యవహరించడంపై విమర్శలు వస్తున్నాయి. గత దసరా ఉత్సవాల్లో వీఐపీ దర్శనాల ప్రభావంతో రూ.500 టికెట్ కొనుక్కుని క్యూలో వెళ్లిన వారికి చుక్కలు కనిపించాయి. వీఐపీ దర్శనాలను క్రమబద్ధీకరించాలని ఒక నిర్దీత సమయంలో పంపాలని భావించి.. సమన్వయ శాఖలకు, వారు చెప్పిన వారికి ఉచితంగా టికెట్లను ఇచ్చారు. అయితే వీఐపీలు వారికి నిర్ణయించిన సమయాలలో రాలేదు. దీంతో వీఐపీలను క్రమబద్ధీకరించే విధానమన్నది విఫలమైంది. వీఐపీ దర్శనాలు, అనధికారిక వీఐపీ దర్శనాలను నియంత్రించలేకపోయారు. ఇప్పుడైనా వాటిని కట్టడి చేసే అంశంపై దృష్టి సారించకుండా ఈ ఏడాది ఏకంగా రూ.500 టికెట్లు రద్దు చేశారు. ఈ కారణంగా దేవస్థానానికి మరో రూ.2 కోట్ల మేర ఆదాయం కోల్పోవాల్సి వస్తోంది. వీఐపీలను క్రమబద్ధీకరించటం చేతకాక రూ.500 టికెట్లు కొనుగోలు చేసే భక్తులను నియంత్రిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. సమన్వయ శాఖలు సమస్యలను పరిష్కరిస్తున్నాయా లేక సమస్యలను సృష్టిస్తున్నాయో అర్థం కాని పరిస్థితి ఏర్పడింది.

జిల్లా అంతటా వర్షం

(5వ పేజీ తరువాయి)

ఏర్పడింది. కొండపర్వలో ప్రధాన రహదారి జలమయం అయ్యి తటాకాన్ని తలపించింది.

వాహనచోదకుల అవస్థలు

మైలవరం నియోజకవర్గంలోని మైలవరం, రెడ్డిగూడెం, జి.కొండూరు, ఇబ్రహీంపట్నం, విజయవాడ రూరల్ మండలాల్లో భారీ వర్షం కురిసింది. కొన్ని చోట్ల ఎడతెరిపి లేకుండా రెండు మూడు గంటల పాటు వర్షం పడింది. దీంతో పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ఇబ్రహీంపట్నం- చత్తీస్‌గఢ్ 30వ నంబరు జాతీయ రహదారిపై కొండపల్లి ఐడీఏ వద్ద, చార్మినార్ రేకుల కంపెనీ వద్ద, శాంతినగర్ వద్ద భారీగా వర్షపు నీరు చేరింది. వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎన్‌హెచ్ అధికారులు డ్రైనేజీ నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో జాతీయ రహదారి పక్కన నిర్మించిన డ్రైనేజీలోని నీరు రోడ్డు మీదకు వచ్చి చేరుతుంది. దీంతో చాలా చోట్ల వర్షపు నీరు నిలవడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాల్లో ఓ మోస్తార్ వర్షం పడింది.

పత్తి పంటకు దెబ్బ

మైలవరం, తిరువూరు నియోజకవర్గాల్లోని మెట్ట ప్రాంతాల్లో సాగు చేసిన పత్తి పంట వర్షాలకు దెబ్బతింటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. తేమ అధికం అయితే కాయ తయారవ్వకుండానే గూడు రాలిపోతుందని, గోలి కాయల సైజులో ఉన్న కాయలు సైతం రాలిపోయే ప్రమాదం ఉందని చెబుతున్నారు.

తరకటూరు వద్ద రోడ్డు ప్రమాదం

ఇద్దరు యువకుల మృతి

● విజయవాడ నుంచి బీచ్‌కు వెళ్తుండగా ఘటన


మృతులు ఆదాంబాబు, షారిన్


మోపెడ్ ఢీకొట్టిన ట్రాక్టర్

గూడూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం - విజయవాడ జాతీయ రహదారిపై గూడూరు మండలం తరకటూరు వద్ద శనివారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందగా మరొక యువకుడు గాయపడ్డాడు. విజయవాడలోని పోరంకికి చెందిన పరిమి ఆదామ్‌బాబు (19), పెనమలూరుకు చెందిన కొమ్మవరపు షారిన్ (19), తాడిగడపకు చెందిన కోట కౌషిక్ మోపెడ్‌పై మంగినపూడి బీచ్‌కు వెళ్తూ ఎదురుగా ఇటుక రాళ్ల లోడ్ ట్రాక్టర్‌ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనం నుజ్జునుజ్జయింది. జోరున వర్షం కురుస్తుండటంతో ముందు ట్రాక్టర్ కనబడక ప్రమాదం జరిగినట్లు భావిస్తున్నారు. ఆదాంబాబు తలకు బలమైన గాయం తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. షారిన్‌కు బలమైన గాయాలు కాగా కొన ఊపిరితో ఉన్న అతన్ని మచిలీపట్నం సర్వజన ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కౌషిక్ స్వల్ప గాయాలతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. సమాచారం తెలుసుకున్న రూరల్ సీఐ నాగేంద్రప్రసాద్, ఎస్సై కె.ఎన్.వి. సత్యనారాయణ సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నారు.


ప్రమాణస్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం


గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఎంప్లాయిమెంట్ విభాగం రాష్ట్ర కార్యవర్గం ఏకగ్రీవం

భారతీనగర్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఎంప్లాయిమెంట్ విభాగం రాష్ట్ర కార్యవర్గం ఏకగ్రీవం అయి నట్లు ఎన్నికల అధికారి తోట కృష్ణ కిషోర్ తెలిపారు. నూతన కార్యవర్గానికి ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్ర అధ్యక్షుడిగా డి.మనోహర్, కార్యదర్శిగా ఆర్.రవికుమార్, కోశాధికారిగా రామ్‌మోహన్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా కె.దొరబాబు, కార్యవర్గ సభ్యులుగా ఎ.సురేష్ కుమార్, రేవతి, ఎస్.వెంకటేశ్వరరావు, కె.రమాదేవి ఎన్నికయ్యారని తెలిపారు. ముఖ్యఅతిథిగా ఐటీఐ అండ్ డీఎల్‌టీసీ రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు పుట్టగుంట రమేష్ బాబు పాల్గొని నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎ.వెంకటరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నవోదయలో 11వ తరగతి ప్రవేశానికి దరఖాస్తు గడువు పెంపు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2025-26 విద్యాసంవత్సరంలో 11వ తగరతిలో ప్రవేశానికి దరఖాస్తు గడువు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ డి. ఏడునందన శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఆయా జిల్లాల్లోని ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 10వ తరగతి చదివి ఉండాలన్నారు. ఆసక్తి గల అర్హులైన విద్యార్థులు సెప్టెంబరు 23వ తేదీలోపు జవహర్ నవోదయ విద్యాలయంలో నేరుగా లేదా జెఎన్‌వీ అధికారిక వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని వేలేరు జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ ఏడునందన పేర్కొన్నారు.

శతాధిక వృద్ధురాలు వెంకట సుబ్బమ్మ కన్నుమూత


వెంకట సుబ్బమ్మ

పెనుగంచిప్రోలు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పెనుగంచిప్రోలుకు చెందిన శతాధిక వృద్ధురాలు మర్రెబోయిన వెంకట సుబ్బమ్మ (125) అలియాస్ చిట్టెమ్మ వయోభారంతో శుక్రవారం రాత్రి స్వగృహంలో కన్ను మూశారు. ఆమె పెనుగంచిప్రోలు దేవస్థానంలో అర్చకుడిగా పనిచేసిన మర్రెబోయిన కాసులు సతీమణి. 20 సంవత్సరాల క్రితమే కాసులు మృతి చెందాడు. ఆమె కుమారుడు కూడా మృతి చెందగా, కుమార్తెతో కలిసి ఉంటున్నారు. ఆమెకు మనవలు, మనవరాళ్లు ఉన్నారు. ఇప్పటి వరకు ఆరోగ్యంగా ఉన్న వెంకట సుబ్బమ్మ తన పనులు తానే చేసుకునేదని కుటుంబ సభ్యులు తెలిపారు.

చంపి వైరా నదిలో పడేసిన తండ్రి

(5వ పేజీ తరువాయి)

తలదాచుకున్నాడు. ఈ క్రమంలో తన చెల్లెలు నాగేంద్రమ్మ కుమార్తె చిందే గాయత్రీ కనిపించడం లేదని ఈ నెల 3న పినపాకకు చెందిన పోతర్లంక స్వప్న అనే మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాలిక తండ్రిపై అనుమానం వ్యక్తం చేసింది. మొదటి భార్య నాగమ్మ, ఆమె కుమార్తెలు కూడా కనిపించకపోవడంతో పోలీసులు బృందాలుగా ఏర్పడి కేసు దర్యాప్తును ముమ్మరం చేశారు. బాజిని అదుపులోకి తీసుకుని విచారించగా, తానే కుమార్తెను చంపినట్టు ఒప్పుకున్నాడు. బాజిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుడు చెప్పిన వివరాల మేరకు డ్రోన్‌తో నదిలో గాలించినా ఆచూకీ లభించలేదు. కేసు దర్యాప్తులో చురుగ్గా వ్యవహరించిన ఎస్సై కె.సుధాకర్, ఇతర సిబ్బందిని సీఐ అభినందించారు. కాగా, మే 30వ తేదీన గంజాయి కేసులో భర్తతో కలిసి జైలుకు వెళ్లిన నాగేంద్రమ్మ ఇంకా జైలులోనే ఉంది.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	140,149, 160
చికెన్ విత్ స్కిన్	268
చికెన్ స్కిన్‌లెస్	278

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 545

క్రీడలకు అండగా కూటమి ప్రభుత్వం : గద్దె క్రాంతికుమార్

పటమట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని టీడీపీ యువ నాయకుడు గద్దె క్రాంతికుమార్ తెలిపారు. శనివారం అశోక్‌నగర్‌లోని టీడీపీ కార్యాలయంలో రాణిగారితోట టైటాన్స్ టీం క్రికెట్ క్రీడాకారులకు ఆయన రూ.10వేలు విలువ క్రికెట్ కిట్‌ను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో విజయవాడలో జరగనున్న క్రికెట్ లీగ్‌ను కూడా ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు. గణేష్, ప్రసాద్, రవీంద్ర, సోము, భార్గవ్, పవన్, పాల్గొన్నారు.



ఆటోనగర్‌లోని ఓ వీధిలో పేరుకుపోయిన చెత్తకుప్ప, ఆటోనగర్ ఆర్టీసీ బస్టాండ్ వద్ద చెత్తాచెదారం, ఆటోనగర్‌లోని ఓ రోడ్లో మట్టికుప్ప

ఆటోనగర్‌లో పేరుకున్న చెత్తకుప్పలు

- రోడ్ల వెంట దుకాణాల్లోని వ్యర్థాలు
- తొలగించని డ్రెయినేజీ పూడిక మట్టి
- సమస్యలు వినే నాథుడే కరువు

ఆటోనగర్, ఆంధ్రజ్యోతి: విజయవాడ జవహర్ ఆటోనగర్ అపారిశుధ్యానికి కేరాఫ్ అడ్రస్‌గా మారింది. కార్మికవాడ ఆటోనగర్‌లోని అన్ని ప్రాంతాల్లో చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. నిత్యం సుమారు 30 టన్నుల వరకు చెత్త ఇక్కడ వస్తుంది. వీటిని తొలగించేందుకు కేవలం 48 మందే పారిశుధ్య సిబ్బంది ఉన్నారు. ఒకప్పుడు 150 మంది వరకు పారిశుధ్య సిబ్బంది ఉండగా నేడు వారి సంఖ్య గణనీయంగా తగ్గింది. వీరే ఆటోనగర్‌లో 20కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న రోడ్ల వెంట చెత్తా, చెదారం తొలగించడంతోపాటు మైనర్ డ్రెయినేజీల్లో ఉన్న వ్యర్థాలను కూడా తీసివేయాలి. వివిధ దుకాణదారులు, కర్మాగారాలు తమ దుకాణాల్లో, కార్ఖానాల్లో వచ్చే వ్యర్థాలను రోడ్లపైనే పడవేస్తూ ఉండటంతో కాలుష్యం మరింతగా పెరుగుతోంది. ముఖ్యంగా పగిలిపోయిన గాజు వస్తువులు కూడా రోడ్లపైనే పడవేస్తూ ఉండటంతో ప్రమాదాలకు కేంద్రంగా మారింది.

పట్టించుకోని ఐలా అధికారులు

ఆటోనగర్‌లో సమస్యల పరిష్కారానికి ఐలా అధికారులు దృష్టి సారించిన దాఖలాల్లేవు. రెండున్నర ఏళ్లగా ఐలా పాలకవర్గం లేక పోవడంతో కార్మికవాడలో సమస్యలు పరిష్కరించే వారే కరువయ్యారు. ప్రస్తుతం ఉన్న ఐలా కమిషనర్ ఏపీఐఐసీ జోనల్ మేనేజర్‌గా పలు జిల్లాలకు ఉండటంతో ఆయన ఆటోనగర్ అభివృద్ధిపై దృష్టి సారించ లేకపోతున్నారు. ఇటీవల ఆటోనగర్‌లోని సన్‌లైట్ సెంటర్‌లో డ్రెయినేజీ పైపులైన్ పగలడం వల్ల వారం రోజులపాటు మురుగునీరు రోడ్లపైకి వచ్చి దుర్వాసన వెదజల్లింది. దీనిపై ఐలా అధికారులు స్పందించిన దాఖల్లాలేవు. ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి వీఎంసీ అధికారులు స్పందించి పగిలిన డ్రెయినేజీ పైపులైన్‌కు మరమ్మతులు చేశారు.

11ఏళ్లగా పారిశుధ్యం అంతంత మాత్రమే

2014 నుంచి నేటి వరకు జవహర్ ఆటోనగర్‌లో పారిశుధ్యం, డ్రెయినేజీ వ్యవస్థ మెరుగుపడలేదు. డ్రెయినేజీల్లో సరిగా పూడిక తీసిన దాఖలాల్లేవు. దీంతో చెత్తకుప్పలు ఆటోనగర్ పురవీధుల్లో దర్శనమిస్తున్నాయి. ఐలా పాలకవర్గం లేకపోవడంతో ఎక్కడ సమస్యలు అక్కడే ఉన్నాయి. ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలి.

- రాజనాల వెంకట రమణారావు, అధ్యక్షుడు ఆటోమొబైల్స్ టెక్నీషియన్స్ అసోసియేషన్

పారిశుధ్యం మెరుగుపరచాలి

జవహర్ ఆటోనగర్‌లో పారిశుధ్యం అధ్వానంగా ఉంది. వీధుల్లో చెత్తకుప్పలు అధికంగా కనిపిస్తున్నాయి. డ్రెయినేజీల్లో తీసిన మట్టి కూడా అక్కడే వదిలేశారు. దీనివల్ల దోమలు, ఈగలు వృద్ధిచెంది అనారోగ్య పరిస్థితులు సృష్టిస్తున్నాయి. దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలి.

- గంధం వెంకటేశ్వరరావు, అధ్యక్షుడు ఆటోమొబైల్స్ మెకానిక్స్ అసోసియేషన్

వాహనాల తనిఖీలు

ఆటోనగర్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): బందరురోడ్డు- ఆటోనగర్ వంద అడుగుల రోడ్డు జంక్షన్‌లో శనివారం ట్రాఫిక్ పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. బెంజిసర్కిల్ నుంచి కానూరు వైపు, ఆటోనగర్ వంద అడుగుల రోడ్డు నుంచి పటమట వైపు వెళ్లే ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలను ట్రాఫిక్ ఎస్ఐ ఎం. అనీల్‌కుమార్ తమ సిబ్బందితో తనిఖీలు చేశారు. వాహనాల సీ బుక్‌పాటు వాహనచోదకుని డ్రైవింగ్ లైసెన్స్‌ను కూడా తనిఖీ చేశారు. ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్‌లు, కార్లు నడిపే వారికి సీటుబెల్ట్ లేకుంటే ఫైన్‌లు విధించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్ఐ అనిల్‌కుమార్ ఆంధ్రజ్యోతి ప్రతినిధితో మాట్లాడుతూ ద్విచక్ర వాహనచోదకులందరూ విధిగా హెల్మెట్ పెట్టుకోవాలని సూచించారు. నిబంధలను పాటించని వారి నుంచి అపరాధ రుసుం వసూలు చేస్తున్నామని తెలిపారు.



వాహనాలను తనిఖీ చేస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ అనిల్‌కుమార్

ఈఎస్ఐ జంక్షన్ వద్ద గుర్తు తెలియని మృతదేహం




గుణదల, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లుగా మాచవరం పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం గుణదల ఈఎస్ఐ హాస్పటల్ జంక్షన్ వద్ద సుమారు గుర్తుతెలియని వ్యక్తి (50)చనిపోయి ఉన్నట్లుగా స్థానికులు గుర్తించారు. మాచవరం పోలీసులకు సమాచారం అందించారు. మాచవరం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. మృతుడి వివరాలు తెలియక పోవడంతో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లుగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మాచవరం పోలీసులు తెలిపారు. మృతుని వివరాలు తెలిసిన పక్షంలో స్టేషన్‌లో తెలియజేయాలని కోరారు.



మృతుడి భార్య లక్ష్మికి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

టీడీపీ కార్యకర్త కుటుంబానికి రూ.5లక్షల చెక్కు అందజేత

రాణిగారితోట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నాయకులకు, కార్యకర్తలకు పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. కృష్ణలంక 21వ డివిజన్‌లో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన టీడీపీ కార్యకర్త విష్ణుబొట్ల సుబ్బరాయ శాస్త్రికి పార్టీ నుంచి వచ్చిన రూ.5 లక్షల చెక్కును మృతుడి భార్య లక్ష్మీకి అందజేశారు. అనంతరం మాట్లాడుతూ సుబ్బరాయ శాస్త్రి పార్టీ కార్యవర్గ సభ్యత్వం తీసుకున్నారని, బస్సు ప్రమాదంలో మృతి చెందిన కారణంగా అతని భార్యకు బీమా చెక్కును అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గొరిపర్తి నామేశ్వరరావు, వేములపల్లి రంగారావు, కొర్ర అప్పన్న, పుప్పాల సుబ్బారావు, పాల్గొన్నారు.



చెట్టు కొట్టేసిన తరువాత సామాజిక భవనం

సామాజిక భవనంపై చెట్టు కొట్టేశారు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పటమట, ఆంధ్ర జ్యోతి: పటమట నల్లూరి వారి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం ముందు ఉన్న సామాజిక భవనంపై మొలిచిన చెట్టును కార్పొరేషన్ అధికారులు కొట్టివేశారు. ఆ చెట్టు మొదళ్లు భవనం లోపలికి చొచ్చుకుపోయి అలాగే ఉన్నాయి. ఈనెల 9న శిథిలావస్థలో సామాజిక భవనం అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన కార్పొరేషన్ అధికా రులు భవనంపై ఉన్న చెట్టును తొలగించారు. శిథిలా వస్థలో ఉన్న సామాజిక భవనాన్ని పూర్తిగా తొల గించి దాని స్థానంలో ప్రజలకు ఉపయోగపడే భవ నాన్ని నిర్మించాలని 14వ డివిజన్ వాసులు కోరుతున్నారు.

సంప్రదాయ హస్తకళలపై యువ డిజైనర్లు అధ్యయనం

సందడి చేసిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ విద్యార్థులు



విజయవాడ, సెప్టెంబరు 13 (ఆంధ్రజోతి) :యువ డిజైనర్లు డిజైన్ రంగంలో తమ ఆలోచనలను పదును పెట్టడానికి వేదికగా లేపాక్షి హస్తకళల డిజైన్ పోటీ, మాస్టర్ పీసెస్ ఎగ్జిబిషన్‌ను నిర్వహించారు. రాష్ట్రానికి చెందిన 25 మంది విద్యార్థులు సంప్రదాయ హస్తకళలపై శనివారం అధ్యయనం చేశారు. టెక్స్‌టైల్ డిజైన్, ఇండస్ట్రియల్ డిజైన్, కమ్యూనికేషన్ డిజైన్ వంటి విభాగాల్లో ఆసక్తి కలిగిన విద్యార్థులు ప్రదర్శనలోని కళాఖండాలను పరిశీలించి డిజైన్, నాణ్యత, ప్రజెంటేషన్ వంటి అంశాలపై చర్చలు జరిపారు. మార్కెట్ అవసరాలకు అనుగుణంగా సంప్రదాయాన్ని కాపాడుకుంటూ కొత్త ఆలోచనలు అందించారు. ఆంధ్రప్రదేశ్ హస్తకళల అభివృద్ధి సంస్థ(లేపాక్షి) ఎండీ విశ్వ మనోహర్ రాష్ట్ర హస్తకళా రంగంలో కొత్తదనాన్ని తీసుకురావడానికి చేసిన కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల సందర్శనను ఏర్పాటుచేశారు. విద్యార్థులు కళాకారులు, సందర్శకులతో మాట్లాడి డిజైన్ మెరుగుపరిచే విధానం, ప్యాకేజింగ్‌లో కొత్త విధానాలు, మార్కెటింగ్ వ్యూహాలపై వారి నుంచి అభిప్రాయాలను సేకరించారు.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించండి

పటమట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): విజయవాడ పటమట కార్మికుల అడ్డా వద్ద జిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ విజయవాడ తూర్పు సిటీ ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కారం చేయాలని కరపత్రాలతో నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా నగర కార్యదర్శి రాజు మాట్లాడుతూ ఏపీ బిల్డింగ్స్ కన్‌స్ట్రక్షన్స్ ఫెడరేషన్ సీఐటీయూ రాష్ట్ర పిలుపుల్లో భాగంగా ఈ నెల 15న రాష్ట్రంలో ఉన్న భవన నిర్మాణ కార్మికులు చలో విజయవాడ పిలుపునివ్వడం జరిగిందని వివరించారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయడానికి వేల సంఖ్యలో కార్మికులు పని బంద్ చేసి రావాలని పిలుపునిచ్చారు. నాయకులు నాగమల్లేశ్వరరావు, ఏడుకొండలు, అప్పారావు, రాజు, దుర్గారావు, రాంబాబు, అశ్వినికుమార్, తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి చెంతకు పాటల ద్వారానే చేరుకోగలం

సింగర్ శ్రీలలిత



గుణదల, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జగన్మాత కనకదుర్గమ్మ చెంతకు పాటలద్వారానే చేరుకోగలం అన్న ఆలోచనతో దసరా శరన్నవరాత్రులకు ఏటా సరికొత్త పాటలను సమాజానికి అందించడం జరుగుతుందని సింగర్ శ్రీలలిత తెలిపారు. రామవరప్పాడు రింగ్ రోడ్డు వద్దగల ది కెహోటల్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ తాను 2019లో శ్రీలలిత దసరా శరన్నవరాత్రులు సిరీస్ పేరుతో యూట్యూబ్ చానల్ ద్వారా అమ్మవారి పాటలకు రూపకల్పన చేయడం ప్రారంభించానని తెలియజేశారు. ఈ యేడాది రామవరప్పాడు రింగ్ వద్ద అమ్మవారి సెట్‌ను ఏర్పాటు చేసి సరికొత్త పాటలతో అందరూ అమ్మవారికి దగ్గరయ్యేలా చేయనున్నట్లు చెప్పారు. ఈ ఏడాది తన ప్రయాణానికి ఎంఎస్ సుబ్బలక్ష్మి ముని మనవరాళ్లు ఐశ్వర్య, సౌందర్యలు తోడు కావడం మరింత బలం చేకూరినట్లయిందన్నారు.

డ్రెయినేజీ పనులు త్వరలో ప్రారంభిస్తాం: అపర్ణ

భారతీనగర్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): 10వ డివిజన్ పరిధిలోని పంట కాలువ రోడ్డులో వీఎంసీ అధికారులతో కలిసి స్థానిక కార్పొరేటర్ దేవినేని అపర్ణ పర్యటించారు. ఈ సందర్భంగా దేవినేని అపర్ణ మాట్లాడుతూ న్యూ పీఅండ్ టీ కాలనీ సమీపంలోని పంట కాలువ రోడ్డులోని అరుణ్ ఐస్‌క్రీమ్ షాప్ నుంచి ప్రియా పిల్లల ఆసుపత్రి వరకు నూతనంగా డ్రెయినేజీ ఏర్పాటుచేయడానికి అడ్డుగా ఉన్న సమస్యలను పరిష్కరించామని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు. స్థానిక పెద్దలు, ఏఈ రాఘవేణి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

విజయవాడ ఉత్సవ్‌ను ఎవరూ అడ్డుకోలేరు: గన్నే అన్న

వన్‌టౌన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ఉత్సవ్‌ను అడ్డుకుంటామని వైసీపీ నాయకుడు దేవినేని అవినాష్ చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదమని, ఉత్సవాన్ని ఎవరూ అడ్డుకోలేరని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గన్నే ప్రసాద్(అన్న) తెలిపారు. శనివారం ఆయన హనుమాన్‌పేటలోని తన కార్యాలయం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విజయవాడ ఉత్సవ్ అనేది ప్రజల పండగ, నగర గౌరవం, దానిని అడ్డుకోవాలని ప్రయత్నించటం ప్రజ లనే అవమానించటం అన్నారు. జగన్మోహన్ రెడ్డి మెప్పు కోసం నీచ రాజకీయాలు చేసి, ప్రజా ఉత్సవాన్ని అడ్డుకోవాలని చూస్తే, ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

వైసీపీ నేతల విమర్శలు సిగ్గుచేటు : నాగుల్‌మీరా

విజయవాడ ఉత్సవ్‌పై వైసీపీ నేతలు విమర్శలు చేయటం సిగ్గుచేటని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల్ మీరా అన్నారు. శనివారం గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విజయవాడ ఉత్సవ్, ఎంపీ కేశినేని చిన్నిపై వైసీపీ నేతలు దేవినేని అవినాష్, వెలంపల్లి శ్రీనివాస్‌లు చేసిన అనుచిత వ్యాఖ్యలను నాగుల్‌మీరా తీవ్రంగా ఖండించారు. దేవదాయ శాఖ భూములకు డబ్బులు చెల్లించే విజయవాడ ఉత్సవ్ నిర్వహిస్తున్నామన్నారు. ఎంపీ చిన్నీ గురించి ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే ప్రజలే వైసీపీ నాయకులకు బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

దసరా ఏర్పాట్లపై దిశానిర్దేశం

● సామాన్య భక్తులకు ప్రాధాన్యమివ్వాలి ● తనిఖీల్లో అధికారులతో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



దసరా ఏర్పాట్లపై దేవాలయ, పోలీసు అధికారులతో చర్చిస్తున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): దసరా ఉత్సవాల్లో సామాన్య భక్తులకు పెద్దపీట వేయాలని ఎన్టీఆర్ జిల్లా జి.లక్ష్మీశ అన్నారు. ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం అధికారులతో కలిసి శనివారం ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులు ప్రవేశ ద్వారాలు, బయటకు వెళ్లే మార్గాల విషయంలో ఎటువంటి ఇబ్బందుల తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. భక్తులకు ఏమాత్రం అసౌకర్యం కలిగినా, అలసత్వం కనిపించినా ఇంజనీరింగ్ అధికారులదే బాధ్యత అని కలెక్టర్ అన్నారు. ఈనెల 22వ తేదీన ప్రారంభం కానున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాల ఏర్పాట్లలో రాజీ పడవద్దన్నారు. భక్తులకు సౌకర్యాల కల్పనలో నిర్లక్ష్యం కనిపించకూడదని అధికారులను ఆదేశించారు. క్యూలైన్లు, ప్రసాదాల తయారీ, రక్షితనీరు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించే ప్రాంతాలు పరిశీలించారు. మునిసిపల్ కార్పొరేషన్ సహకారంతో భక్తులకు అవసరమైన స్నానఘట్టాలు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయడంతో పాటు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అందుకు అవసరమైన సిబ్బందిని నియమించుకోవడంతో పాటు నిరంతరం పర్యవేక్షించి పారిశుధ్య నిర్వహణకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.

అధికారులపై కలెక్టర్ ఆగ్రహం...

దుర్గగుడి అధికారులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కనకదుర్గానగర్ ప్రారంభంలో ఉన్న షాపును వెంటనే తొలగించాలని పలుమార్లు దసరా ఏర్పాట్లు పరిశీలనకు వచ్చిన సమయంలో ఆదేశించినా ఎందుకు తొలగించలేదని ప్రశ్నించారు. స్పందించిన అధికారులు తొలగింపునకు చర్యలు తీసుకుంటామన్నారు.

ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ

ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ దర్శనానికి శనివారం పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకునేందుకు తరలివచ్చారు. కృష్ణానదిలో పవిత్ర స్నానాలు చేసి అమ్మవారి దర్శనానికి కొండపైకి చేరుకున్నారు. క్యూలైన్లలో అనుసరించాల్సిన విధివిధానాల పై సిబ్బందికి ఈవో పలు సూచనలు చేశారు.



దుర్గమ్మ దర్శనానికి క్యూలైన్‌లో వేచియున్న భక్తులు

దసరా ఉత్సవాల్లో పరోక్ష ఆర్జిత సేవల రుసుం ఇలా..

దుర్గామల్లేశ్వర దేవస్థానంలో 22నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు జరిగే దసరా మహోత్సవాల సందర్భంగా పరోక్షంగా ఆర్జిత సేవల్లో పాల్గొనే భక్తులు చెల్లించాల్సిన రుసుముల వివరాలను ఈవో శీనానాయక్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వర్చువల్ సేవ - ఆన్‌లైన్ వెబ్‌లింక్ ద్వారా పరోక్షంగా వీక్షించవచ్చు. ఈ విధంగా వీక్షించేందుకు తగిన రుసుములు భక్తులు చెల్లించాల్సి ఉంటుంది. పరోక్ష ప్రత్యేక ఖడ్గమాలార్చనకు రూ.1500, ప్రత్యేక కుంకుమార్చనకు రూ.1500, శ్రీచక్ర నవావరణార్చనకు రూ.1500, చండీహోమానికి రూ.1500 చొప్పున ఒకసారికి చెల్లించవలసి ఉంటుంది. పది రోజులకుగాను రూ.11,116 చెల్లించాలి. ఆలయ నియమాల మేరకు ప్రసాదాలను పోస్టు ద్వారా చిరునామాకు పంపుతామన్నారు.

మూడు రోజుల్లో పనులు పూర్తి చేయండి

ఆయా విభాగాలకు ఈవో శీనానాయక్ ఆదేశాలు

వన్‌టౌన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వర దేవస్థానంలో 22నుంచి జరగనున్న దసరా మహోత్సవాలను పురస్కరించుకుని జరుగుతున్న ఏర్పాట్లను మూడు రోజుల్లో పూర్తి చేయాలని ఈవో శీనానాయక్ అయా విభాగాల అధికారులను ఆదేశిస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ పర్యటనలో చేసిన కొన్ని సూచనలు మేరకు అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. క్యూలైన్లు, ఘాట్లు, టాయిలెట్లు, క్లోకరూమ్, అన్నదానం బిల్డింగ్, లడ్డూ పోటు, గోశాల, డోనర్ లాంజ్‌లలో శానిటేషన్ విభాగం ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తుండాలని ఆదేశించారు. టాయిలెట్ల మరమ్మతులుంటే తక్షణం పూర్తి చేయాలన్నారు. గోశాల వద్ద నిలిచిపోయిన నీటిని తక్షణమే తొలగించాలన్నారు. టోల్ గేట్ నుంచి కొండపై వరకు వేసిన క్యూలు, సీతమ్మవారి పాదాలు, కేశఖండనశాల, ఓం టర్నింగ్, భవానీఘాట్, దోబీ ఘాట్, చిన్నరాజగోపురం క్యూలైన్లను పటిష్టంగా ఏర్పాటు చేయాలన్నారు. ఘాట్‌ల వద్ద నీటి సరఫరా నిరతంరంగా ఉండాలన్నారు. స్త్రీలు దుస్తులు మార్చుకోవటానికి అదనపు టాయిలెట్లను కూడా ఏర్పాటు చేయాలన్నారు. ఎలక్ట్రికల్, ఫైర్ సేఫ్టీ విషయంలో చర్యలకు ఆదేశాలు ఇచ్చారు. ప్రథమ చికిత్స ఏర్పాట్లతోపాటు ఓఆర్ఎస్ వంటి వాటిని మెడికల్ క్యాంపుల వద్ద ఏర్పాటు చేయాలన్నారు. సీతమ్మవారి పాదాలు, ఓం టర్నింగ్ సర్వీసు లైన్, స్కానింగ్ కౌంటర్లు, సీసీ టీవీ కెమెరాలు, ఎల్ఈడీ స్క్రీన్స్, మైక్ అనౌన్స్‌మెంట్ సిస్టమ్, తదితరాల దగ్గర మెటల్ డిటెక్టర్లను ఏర్పాటు చేయాలన్నారు. మల్లేశ్వరాలయం మెట్లు, రాయభారం మండపం ఎగ్జిట్ పాయింట్ వద్ద, మహామండపం, అండర్‌పాస్ ఉచిత బస్టాప్ వద్ద, ఫుట్ ఓవర్ బ్రిడ్జి, ఆలయం లోపల హుండీలు, తదితర ప్రాంతాల్లో మరమ్మతులు చేయాలన్నారు. ప్రమాదకరంగా ఉన్న షెడ్లను వెంటనే కూల్చేవేయాలన్నారు. కుమ్మరిపాలెం సెంటర్ (టీటీడీ సైట్), రైల్వే గ్రౌండ్, పూల మార్కెట్ ప్రాంగణం, విఎంసీ ఆఫీసు వెనుకాల, భవానీఘాట్, బబ్బూరి గ్రౌండ్స్ వద్ద లెవల్ చేసి బారికేడ్లను ఏర్పాటు చేయాలన్నారు. పున్నమీఘాట్ వద్ద విజయవాడ ఉత్సవాలు నిర్వహిస్తున్న కారణంగా అక్కడ పార్కింగ్‌కు కేటాయించకుండా బబ్బూరి గ్రౌండ్స్, భవానీఘాట్, వీఎంసీ కల్యాణ మండపం, తదితరాలను పార్కింగ్‌కు వినియోగించుకోవాలన్నారు. క్యూలలో ప్రతి వంద మీటర్లకు క్యూఆర్‌కోడ్ బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. అన్నదానం, లడ్డూ పోటు, క్లోక్ రూమ్, నిష్క్రమణ మార్గాల వద్ద ఆధ్యాత్మిక వాతావరణం కలిగేలా అమ్మవారి చిత్రాలు, అష్టోత్తరాలు, శ్లోకాలు తదితర బొమ్మలతో క్యూలైన్లలో ఏర్పాటు చేయాలని ఈవో సూచించారు.



ముగిసిన సైన్స్ ఎగ్జిబిషన్

ఆకట్టుకున్న ప్రాజెక్టులు

విజయవాడ: పీబీ సిద్ధార్థ ఆడిటోరియంలో ఆర్‌జీకర్, సిద్ధార్థ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్ శనివారం ముగిసింది. విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టు నమూనాలు సందర్శకులకు ఆకర్షించాయి. విద్యార్థులు వారు తయారు చేసిన ప్రాజెక్టులను కళ్లకు కట్టినట్టు వివరించారు. సిద్ధార్థ కళాశాల 50వ వార్షికోత్సవం సందర్భంగా ఐజీసీఏఆర్ ఇన్‌స్టిట్యూట్‌తో కలిసి నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్ ఈ నెల 8 నుంచి 12వ తేదీ వరకు జరిగింది. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు మాట్లాడుతూ ఇటువంటి ఎగ్జిబిషన్‌ల వల్ల విద్యార్థుల్లో పరిశోధనలపై ఆసక్తితోపాటు మేధో శక్తికి దోహదపడుతుందన్నారు.

ఆకట్టుకున్న ప్రాజెక్టులు

ప్లూటోనియం, యురేనియంతో విద్యుత్ తయారుచేసే ఫాస్ట్ బ్రీడా రియాక్టర్. నేచురల్ బ్యాగ్రౌండ్ రేడియేషన్ అనే వైద్య పరికరం. ప్రజలు ఏదోవిధంగా రేడియేషన్ ప్రభావంతో అనారోగ్యానికి గురవుతున్నారో తెలిపారు. బాబాట్రామ్ ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి.

సెల్.. చెల్లా





ఇంద్రకీలాద్రిపై సెల్ ఫోన్ నిషేధం.. కానీ కొందరు భక్తులు యథేచ్ఛగా వాటిని గుడి ఆవరణలోకి తీసుకొచ్చి వినియోగిస్తున్నారు. దీనిపై సెక్యూరిటీ సిబ్బంది ప్రశ్నిస్తే.. వీఐపీ పేర్లు చెప్పి వారి తాలూకా, ప్రొటోకాల్ సిబ్బంది తాలూకా, అధికారుల పేర్లు చెప్పటంతో సెక్యూరిటీ కూడా చూసీ చూడనట్లు వదిలేస్తున్నారన్న విమర్శలు న్నాయి.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)







సమావేశంలో మాట్లాడుతున్న శివస్వామి

ధర్మ సమ్మేళనం నేడు

గొల్లపూడి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): పీఠాధిపతుల నిర్దేశకత్వంలో రాష్ట్ర స్థాయి హిందూ న్యాయవాదుల ధర్మ సమ్మేళనం ఆదివారం నిర్వహించనున్నట్లు తాళ్లాయపాలెం స్వామీజీ శివస్వామి తెలిపారు. శనివారం గొల్లపూడిలోని పద్మావతి కల్యాణ మండపంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శివస్వామి, ఆత్మానంద భారతి స్వామీజీ మాట్లాడుతూ ఆదివారం జరిగే కార్యక్రమంలో వివిధ జిల్లాల నుంచి వందలాది న్యాయవాదులు హాజరై ఆలయాల ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా పరిరక్షణ, పీఠాల, ఆశ్రమాల, అన్నసత్రాల సంరక్షణ, పూజ్య స్వామీజీలు, హిందూ సంఘాలు, హిందూ కార్యకర్తలపై అక్రమ కేసులు, వేధింపుల గురించి సలహాలు, సూచనలు తీసుకుంటామన్నారు. నివారణ చర్యలపై చర్చ జరుగుతుందన్నారు. కార్యాచరణ గురించి ఆలోచన చేయనున్నట్లు తెలిపారు. హిందూ న్యాయవాదులు కోటు ధరించి విశేష సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఆధ్యాత్మికవేత్త వేముల హజరత్తయ్య గుప్తా, నిర్వాహకుడు కృష్ణకుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ వ్యవహారంలో మహిళపై దాడి

మనస్తాపంతో ఫ్యానుకు ఉరి : చికిత్స పొందుతూ మృతి

గుణదల, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రేమికులు పెద్దలను ఒప్పించుకుని పెళ్లి చేసుకుందామని నిర్ణయించుకున్నారు. ప్రియురాలి ఇంటికి వెళ్లి విషయం చెప్పాడు. క్షణాల వ్యవధిలోనే ప్రియురాలి బంధువులు దాడికి తెగబడ్డారు. దాడి సమయంలో ప్రియుడి తల్లికి తీవ్ర అవమానం జరిగేలా ప్రవర్తించటంతో తట్టుకోలేక ఇంట్లో ఫ్యానుకు ఉరేసుకుంది. గమనించిన స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందింది. గిరిపురంలో పల్లెపోగు కుమార్ బాబు, కుమారి పెద్దకుమారుడు గోపీచంద్ గిరిపురానికి చెందిన యువతితో కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. ఈ నెల 11న గోపీచంద్ ప్రియురాలి ఇంటికి వెళ్లికి నేరుగా ఆమె తండ్రి రాజశేఖర్‌తో చెప్పాడు. దానికి అతను అంగీకరించలేదు. రాత్రి బిషప్ అజరయ్య స్కూల్ సెంటర్ వద్ద రాజశేఖర్, అతని బావమర్దితో కలిసి గోపీచంద్‌తో వాగ్వాదానికి దిగారు. యువతి మేనమామ మరో ఇరువురు ఇద్దాలతో కలిసి గోపీచంద్ ఇంటికి వెళ్లి దాడికి తెగబడ్డారు. ఆ సమయంలో గోపీచంద్ తల్లి కుమారిని తీవ్రంగా అవమానించటంతో మనస్తాపం చెంది ఇంట్లోకి వెళ్లి ఫ్యానుకు ఉరేసుకుంది. అక్కడే ఉన్న వారు కుమారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్సపొందుతున్న కుమారి శనివారం మృతిచెందింది. మాచవరం పోలీసులు ఆసుపత్రికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. కుమారి భర్త పల్లెపోగు కుమార్‌బాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రజలను భయాందోళనకు గురిచేస్తే చర్యలు : టీడీపీ

విజయవాడ, సెప్టెంబర్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం తప్పదని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నవనీతం సాంబశివరావు హెచ్చరించారు. న్యూరాజరాజేశ్వరిపేటలో శనివారం రాత్రి మీడియా సమావేశంలో మాట్లాడుతూ, డయేరియా విషయం తెలియగానే ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టింది. మంత్రి నారాయణ, ఎమ్మెల్యే బొండా ఉమా, కలెక్టర్ లక్ష్మీశ, కమిషనర్ ధ్యానచంద్ర ఈ వ్యవహారంపై దృష్టి సారించిందన్నారు.

టీడీపీ, వైసీపీ మధ్య తోపులాట

న్యూరాజరాజేశ్వరిపేటలో టీడీపీ, వైసీపీ వర్గాల మధ్య తోపులాట జరిగింది. డయేరియా లక్షణాలున్నవారిని శనివారం రాత్రి టీడీపీ నాయకులు ఆసుపత్రికి తరలిస్తున్న సమయంలో వైసీపీ నాయకులు అడ్డుకుని వాగ్వాదానికి దిగారు. ఇక్కడే రక్త పరీక్షలు నిర్వహించాలని, ల్యాబ్‌లు ఏర్పాటుచేయాలని వైసీపీ అడ్డుకుంది. ఇటువంటి విపత్కర పరిస్థితుల్లో ల్యాబ్‌లు ఏర్పాటు కంటే బాధితులను ఆసుపత్రికి తీసుకెళ్తేనే సరైన చికిత్స అందించవచ్చని టీడీపీ నాయకులు బదులిచ్చారు. పోలీసు సిబ్బంది ఇరువర్గాలకు నచ్చజెప్పి బాధితులను ఆసుపత్రికి తరలించారు.

క్రికెటర్ మూర్తి మృతికి పలువురి సంతాపం

విజయవాడ(స్పోర్ట్స్), సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా కాకినాడకు చెందిన క్రికెటర్, లెఫ్ట్ హ్యాండ్ స్పిన్నర్ మాజీ ఆంధ్రా రంజీ క్రికెటర్ ఎం.ఎస్.ఆర్ మూర్తి(73)మృతిపై ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఎంపీ కేశినేని శివనాథ్, ఏసీఏ కార్యదర్శి, రాజ్యసభ ఎంపీ సానా సతీష్ విచారం వ్యక్తం చేశారు. మూర్తి మృతి రాష్ట్ర క్రికెట్ రంగానికి తీరని లోటన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు. మూర్తి వయోభారంతో హైదారబాద్‌లోని ఆయన నివాసంలో శుక్రువారం మృతి చెందారు. హైదరాబార్ లీగ్ మ్యాచ్‌ల్లో, ఆంధ్రా రంజీ మ్యాచ్‌లో అగ్రశ్రేణి ఆటగాడిగా గుర్తింపు పొంది నేటితరం క్రికెటర్స్‌కు ఆదర్శంగా నిలిచారు.

అధికారుల నిర్లక్ష్యంతోనే డయేరియా

కలుషిత నీటి వల్లే అంటున్న జనం

అపరిశుభ్రతే కారణమంటున్న అధికారులు

ఆంధ్రజ్యోతి, విజయవాడ సిటీ:న్యూ రాజరాజేశ్వరి పేటలో అతిసారకు కలుషిత నీరే కారణమని స్థానికులు చెబుతున్నారు. పైప్‌లైన్ లీకులు వల్ల డ్రెయినేజీ నీరు కుళాయిలకు ద్వారా సరఫరా అవుతున్నాయని ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఆ నీటిని తాగటం వల్లే వందలాది మంది డయేరియా బారిన రక్షిత నీటిని సరఫరా చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారు ప్రభుత్వ చర్యల నుంచి తప్పించుకునేందుకు కొత్తడ్రామాలకు తెరదీస్తున్నారని ఆరోపిస్తున్నారు.

న్యూఆర్‌ఆర్‌పేటలో 6,800 గృహాల్లో 19వేల మంది జనాభా ఉంటున్నారు. వీరికి 15 లక్షల లీటర్ల కెపాసిటీ ఉన్న రక్షితనీటి పథకం నుంచి 5,900 కుళాయిలకు కార్పొరేషన్ సరఫరా చేస్తోంది. ఈ నెల 9వతేదీ రాత్రి నుంచి అతిసార కేసులు బయటపడ్డాయి. శనివారం మధ్యాహ్నం మూడు గంటల వరకు అధికారికంగా 273 కేసులు నమోదయినట్లు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ ప్రకటించారు. ఈ కేసుల సంఖ్య 500లకు పైబడి ఉంటుందని అక్కడి ప్రజలు చెబుతున్నారు. చాలా మంది నగరంలోని ప్రవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు.

మురికి నీటి కారణంగానే..

10 రోజుల నుంచి కుళాయిలకు మురికి నీరు వస్తుంది. పాచి పట్టిన నీరు రావటం మునిసిపల్ అధికారులు అందరికీ తెలుసు. అయినా ఏ ఒక్క అధికారి ఎట్టించుకోలేదు. ఆ నీటినే వంట, తాగటం వల్ల డయేరియా ప్రబలిందని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. రక్షితనీటిని సరఫరా చేసి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని స్థానిక మహిళ ఆవేదన వ్యక్తంచేసింది.

ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు..

మా ఇంటి పక్కనే డ్రెయినేజీ, ఆ నీరు పైప్‌లైన్‌లో కలుస్తున్నాయి. అవే కుళాయిలకు వచ్చేవి. దీనిపై కార్పొరేషన్ అధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని స్థానిక మహిళ తెలిపారు. కొందరు అధికారులు అపరిశుభ్రతతోపాటు ఫుడ్ పాయిజన్ వల్ల కూడా డయేరియా ప్రబలుతుందంటున్నారు.

ప్రభుత్వ వైఫల్యం : గిడుగు రుద్రరాజు

విజయవాడ: న్యూ రాజరాజేశ్వరిపేటలో డయేరియా విజృంభిస్తున్నా.. అధికార యంత్రాంగం పరీక్షల పేరుతో కాలయాపన చేస్తుండడం ప్రభుత్వం చేతగానితనానికి నిదర్శనమని సీడబ్ల్యూసీ సభ్యుడు గిడుగు రుద్రరాజు విమర్శించారు. శనివారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ, డయేరియాతో ప్రజలు మృత్యువాత పడుతున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్టుగా కూడా లేదన్నారు. డయేరియాను అదుపుచేయడంలో ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. కలుషిత నీరే కారణమని స్థానికులు గగ్గోలు పెడుతున్నా, ముగ్గురు మృతితో పాటు వందలాది మంది ఆసుపత్రి పాలైనా అధికారులు పట్టనట్టు వ్యవహరించడం దారుణమన్నారు. వెంటనే వైద్యబృందాలను పెంచాలని రుద్రరాజు డిమాండ్ చేశారు. మృతుల కుటుంబాలకు సహాయంతోపాటు అందరికీ ఆహారం, వైద్యం, వైద్య ఖర్చులు చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు.



డయేరియా చికిత్స కేంద్రంలోని రోగులు



కలుషిత నీరు చూపిస్తున్న మహిళ

మా ఇంట్లో అందరికీ జ్వరాలు..

ఈ ప్రాంతం డ్రెయినేజీలు శుభ్రం చేయరు. రోడ్లపై పేరుకుపోయిన చెత్తను తరలించరు. దాంతో దోమలు విపరీతంగా పెరిగిపోయాయి. ఇప్పుడు హడావిడిగా వచ్చి శుభ్రం చేసి, బ్లీచింగ్ చల్లుతున్నారు. ముందే చేసుంటే ఈ జబ్బులు వచ్చేవి కాదు. మా ఇంట్లో అందరికీ జ్వరాలు. డ్రెయినేజీల్లోని నీటిని కుళాయిలకు పంపి, ఆ నీటినే మాతో తాగించి జబ్బుల బారిన పడేశారు.

తీర్థాల అన్నపూర్ణ, స్థానికురాలు

రోజూ ఆసుపత్రికి తిరుగుతున్నాం..

తొలుత నా చిన్నకూతురికి డయేరియా వచ్చింది. ఆమెను ఆసుపత్రిలో చూపిస్తుండగానే పెద్ద కూతురు జ్వరం బారిన పడింది. ఆసుపత్రిలో బెడ్‌లు లేవన్నారు. ఉదయం, సాయంత్రం ఇలా ఒకరి తరువాత ఒకరు ఆసుపత్రికి తీసుకెళ్తున్నాను. ఇద్దరికీ ఇంకా నయం కాలేదు. కూలీ పనులకు చేసుకుని బతికే వాళ్లం. ఒక్క రోజు పని మానితే కుటుంబ గడవని బతుకులు మావి.

బత్తుల కొండమ్మ, స్థానికురాలు

కొనసాగుతున్న బూడిద ఉద్యమం

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉచిత బూడిద లోడింగ్ కోసం డాక్టర్ ఎన్టీటీపీఎస్ టిప్పర్, లారీ ఓనర్స్ తలపెట్టిన ఉద్యమం రోజు రోజుకు ఉధృత రూపం దాల్చుతోంది. జోరు వర్షంలోనూ శనివారం సొసైటీ నాయకులు, సభ్యులు నిరసన ప్రదర్శనను ఆపలేదు. ఉచిత బూడిద లోడింగ్ ఆపేసి 400 మంది స్థానిక ట్రాన్స్‌పోర్టర్స్‌ను వాటి మీద ఆధారపడి జీవించే 1,000 కుటుంబాలను జెన్కో యాజమాన్యం స్వార్థ ప్రయోజనాల కోసం రోడ్డున పడేసిందని కర పత్రాలను ఇంటింటికీ తిరిగి పంచారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి వినతిపత్రం అందించారు. అనంతరం సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు కోయ వెంకట్రావ్, కొండిశెట్టి నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ ఎన్టీటీపీఎస్ బూడిద ప్రభావిత ఏడు గ్రామాల ప్రజల నుంచి తమకు సంపూర్ణ మద్దతు లభిస్తుందన్నారు. ఇప్పటికైనా జెన్కో యాజమాన్యం కార్పొరేట్ సంస్థకు ఇచ్చిన బూటకపు కాంట్రాక్టును రద్దు చేసి స్థానిక వాహనాలకు బూడిదను ఎప్పటిలానే ఉచితంగా అందించాలన్నారు. యాజమాన్యం మొండిగా వ్యవహరిస్తే నిరవధిక దీక్ష చేస్తామని హెచ్చరించారు.ఉద్యమానికి గ్రామ సర్పంచ్ బూక్యా కవిత, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు పెదర్ల రవి, కూటమి నాయకులు సంఘీభావం తెలిపి ర్యాలీలో పాల్గొన్నారు.



గుంటుపల్లిలో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఉద్యమానికి మాజీ మంత్రి జోగి మద్దతు

టిప్పర్, లారీ ఓనర్స్‌కు తమ పార్టీ అండగా ఉంటుందని వైసీపీ మైలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీమంత్రి జోగి రమేష్ స్పష్టం చేశారు. శనివారం ఇబ్రహీంపట్నంలో తన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. ఉద్యమం చేస్తున్న ప్రతి ఒక్కరికీ వైసీపీ అండగా ఉంటుందన్నారు.

స్వాతంత్రోద్యమంలో హిందీ పాత్ర మరువలేనిది

● వీఐటీ డీమ్డ్ వర్సిటీ ప్రొఫెసర్ జగన్నాథం

విజయవాడ, సెప్టెంబర్ 13 (ఆంధ్రజ్యోతి): భారత స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో హిందీభాష పోషించిన పాత్ర ఎనలేనిదని వీఐటీ డీమ్డ్ వర్సిటీ హిందీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జగన్నాథం సురేష్ అన్నారు. సిద్ధార్థ మహిళా కళాశాల హిందీ విభాగం ఆధ్వర్యంలో శనివారం హిందీభాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వి.వి.సుబ్రహ్మణ్య కుమార్ మాట్లాడుతూ, అందరూ హిందీ నేర్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ సందర్భంగా వ్యసరచన, వ్యక్తిత్వ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


పీబీ సిద్ధార్థలో ఇంటర్నేషనల్ ప్రోగ్రామర్ దినోత్సవం

పీబీ సిద్ధార్థ కాలేజీలో డేటా సైన్స్ అండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విభాగం ఫెస్టాడెల్ కోడైస్ పేరుతో శనివారం అంతర్జాతీయ ప్రోగ్రామర్ దినోత్సవం జరిగింది. విద్యార్థుల్లో ప్రోగ్రామింగ్ నైపుణ్యాలు పెంచే విధంగా కోడ్ క్యాస్కేడ్, ఆల్గోక్వెస్ట్, యూ.ఎస్.ఓ కోడ్ తదితర అంశాల్లో కార్యక్రమాలు నిర్వహించినట్టు డేటాసైన్స్ అండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ హెచ్‌వోడీ ఉదయశ్రీ కొంపల్లి తెలిపారు.

ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా ఓటీటీల్లో విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌లు...





ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
ది బాస్టర్డ్స్ ఆఫ్ బాలీవుడ్	హిందీ సిరీస్	సెప్టెంబర్18
అమెజాన్ ప్రైమ్		
జెన్ వి	వెబ్‌సిరీస్	సెప్టెంబర్ 17
జియో హాట్‌స్టార్		
సిన్నర్స్	హాలీవుడ్ మూవీ	సెప్టెంబర్ 18
ది ట్రయల్ 2	హిందీ సిరీస్	సెప్టెంబర్ 19
ఆహా...		
ష్...	తమిళ సిరీస్	సెప్టెంబర్ 19

వర్షాకాలంలో రకరకాల శిరోజాల సమస్యలు తలెత్తుతుంటాయి. చుండ్రు, దురద, మాడుమీద కురుపులు, శిరోజాలు రాలడం లాంటివి చికాకు కల్గిస్తుంటాయి. వాతావరణంలో ఉండే తేమ వల్ల తలలో చెమట, జిడ్డు చేరి ఈ సమస్యలను జటిలం చేస్తాయి. ఇలా వర్షాకాలంలో ఎదురయ్యే శిరోజాల సమస్యలకు ఆయుర్వేదం చక్కని పరిష్కారాలను చూపిస్తోందని నిపుణులు చెబుతున్నారు. వాటి గురించి వివరంగా తెలుసుకుందాం...

వర్షాకాలంలో జుట్టుకు రక్షణ



ఆయుర్వేద పరిష్కారాలు

- **బృంగరాజ్:** జుట్టు బాగా రాలుతుంటే బృంగరాజ్ నూనెను తలంతా పట్టించి మువి వేళ్లతో మెల్లగా మర్దన చేయాలి. రాత్రంతా అలాగే ఉంచుకోవాలి. ఉదయాన్నే గోరువెచ్చని నీటితో తలస్నానం చేయాలి. బృంగరాజ్ పొడిలో కొబ్బరి నూనె కలిపి పేస్టులా చేయాలి. ఈ మిశ్రమాన్ని తలంతా పట్టించి అరగంట తరవాత తలస్నానం చేయాలి. ఈ చిట్కాలు పాటిస్తూ ఉంటే శరీరంలో వాత దోషం తగ్గి శిరోజాలకు పోషణ లభిస్తుంది. జుట్టు తెల్లబడడం ఆగుతుంది. మాడుకు రక్తప్రసరణ పెరిగి శిరోజాలు ఒత్తుగా పెరుగుతాయి.
- **ఉసిరి:** శిరోజాలు నెరుస్తుంటే ఉసిరి నూనెను కొద్దిగా వేడిచేసి తలంతా పట్టించాలి. వేళ్లతో గుండ్రంగా రుద్దుతూ పావుగంటసేపు తల మీద మర్దన చేయాలి. రాత్రంతా అలాగే ఉంచుకుని ఉదయాన్నే గోరువెచ్చని నీటితో తలస్నానం చేయాలి. ఉసిరి పొడిలో తగినంత పెరుగు కలిపి పేస్టులా చేసి తలకు పట్టించాలి. అరగంటసేపు ఆరనిచ్చి తలస్నానం చేయాలి. ఈ చిట్కాలు పాటించడం వల్ల శరీరంలో పిత్త దోషం తగ్గుతుంది. ఉసిరిలోని సి విటమిన్, యాంటీ ఆక్సిడెంట్లు కుదుళ్లను గట్టిపరుస్తాయి. తలలో రక్తప్రసరణ సజావుగా జరిగి శిరోజాలు ఒత్తుగా పెరిగి మెరుపును సంతరించుకుంటాయి.







- బ్రాహ్మి: దీనితో తయారుచేసిన నూనెను కొద్దిగా వేడిచేసి రాత్రి పూట తలకు పట్టిస్తే మాడు చల్లబడుతుంది. ఒత్తిడి తగ్గి మనసు ప్రశాంతంగా మారుతుంది. ఉదయాన్నే తలస్నానం చేయగానే శిరోజాలు నల్లగా మెరుస్తుంటాయి.
- వారానికి రెండుసార్లు హెర్బల్ నూనెలతో తలకు మర్దన చేయడం వల్ల జుట్టురాలే సమస్యను నివారించవచ్చు. వాతావరణం తేమగా ఉన్నప్పుడు మాత్రం ఎక్కువగా నూనె రాయడం మంచిది కాదు.
- తలస్నానానికి కీటోకొనజోల్ లాంటి మెడికేటెడ్ షాంపూలు ఉపయోగించడం మంచిది. ఇవి మాడుమీద ఏర్పడే ఫంగస్, చుండ్రు, కురుపులను నివారిస్తాయి.
- పెప్టైడ్‌లు, విటమిన్లు, బొటానికల్స్‌తో కూడిన సీరమ్‌లను వాడడం కూడా మంచిదే. ఇవి జుట్టు కుదుళ్లను బలపరచి మాడును ఆరోగ్యంగా మారుస్తాయి.
- ఆయుర్వేద ఉత్పత్తులు సురక్షితమే అయినప్పటికీ వాటిని ఉపయోగించే ముందు ప్యాచ్‌టెస్ట్ చేసుకోవడం మంచిది.



ఈ జాగ్రత్తలు తీసుకోవాలి..

- తలంతా జిడ్డుగా ఉందంటూ వేడివేడి నీళ్లతో తలస్నానం చేయకూడదు. అలా చేస్తే మాడుమీద సహజ నూనెల ఉత్పత్తి తగ్గి శిరోజాలు పొడిబారుతాయి. కాబట్టి గోరువెచ్చని నీటితో మాత్రమే తలస్నానం చేయాలి.



- తలస్నానం చేసిన ప్రతిసారీ కండిషనర్‌ను వాడితే శిరోజాలు ఆరోగ్యంగా ఉంటాయి. కండిషనర్ వల్ల వెంట్రుకల్లో తేమ నిలుస్తుంది. కుదుళ్లు బలపడతాయి.
- శిరోజాలను గట్టిగా బిగించి జడ వేసుకోవడం లేదా ముడి పెట్టుకోవడం వల్ల కుదుళ్లు బలహీనమవుతాయి. దీంతో శిరోజాలు అధికంగా రాలిపోతుంటాయి. కాబట్టి జడను తేలికగా అల్లుకోవడం మంచిది.
- శిరోజాలకు అధికంగా నూనె పట్టించి సరిగా తలస్నానం చేయకపోతే కుదుళ్లకు ఆక్సిజన్ అందదు. దీంతో కుదుళ్లు వదులుగా మారి వెంట్రుకలు రాలిపోతాయి. అలాకాకుండా జిడ్డు, మురికి పూర్తిగా వదిలేలా తేలికపాటి షాంపూతో తలస్నానం చేయాలి. సల్ఫేట్ అధికంగా ఉన్న షాంపూలను వాడకూడదు.
- తడిజుట్టును తువాలుతో ఎలా పడితే అలా రుద్దుతూ తుడవకూడదు. మెత్తటి తువాలుతో మెల్లగా అద్దుతూ తుడుచుకోవాలి. తడి జుట్టును దువ్వకూడదు. శిరోజాలు పూర్తిగా ఆరిన తరవాతనే వెడల్పాటి పళ్ల దువ్వెనతో మెల్లగా దువ్వుకోవాలి. శిరోజాలను గాలికి ఆరనివ్వాలి. హెయిర్ డ్రైయర్‌ను వాడకూడదు.
- శిరోజాలను అధిక వేడితో స్ట్రెయిటెనింగ్, ఐరనింగ్, కర్లింగ్ చేయించుకోవడం తగ్గించాలి.



సండే సెలబ్రిటీ

నటులను 'నడిచే డబ్బు'గా చూస్తారు

మీరు చాలా సెన్సిటివ్ పర్సన్ అని చాలాసార్లు చెప్పారు. మరి సినిమా ఇండస్ట్రీలో ఎలా కొనసాగుతున్నారు?

నేను ఇండస్ట్రీకి వచ్చే ముందు చాలా మంది... "నువ్వు సెన్సిటివ్. ఇంట్రావర్ట్. సినిమాల్లో ఎలా నటిస్తావు" అని అడిగారు. మొదట్లో నాకు నటనపై ఆసక్తి ఉండేది కాదు. నేను బాగుంటానని కూడా నాకు తెలియదు. సుబ్బిరామిరెడ్డిగారు, రవి కిషోర్ నన్ను హీరోగా చేయమని అడిగారు. రవి కిషోర్ అయితే... 'మహర్షి' సినిమాలో ఆఫర్ కూడా ఇచ్చాడు. "రాజేంద్ర ప్రసాద్ గారి అబ్బాయిని కాబట్టి ఆఫర్స్ వస్తున్నాయి" అనుకొనేవాడిని. ఒక్కసారి నటుడిని అయిన తర్వాత అంతా మారిపోయింది. నిజ జీవితంలో నేను ఇంట్రావర్ట్. సెన్సిటివ్. కానీ కెమెరా ముందు వేరేగా మారిపోతాను. కెమెరా నా ఫ్రెండ్. దానితో నేను కనెక్ట్ అవుతా! రెచ్చిపోతా. ఇక్కడ మీకో రహస్యం చెబుతా. సినీ కెమెరా ముందు ఎమోషనల్‌గా ఎంతైనా నటిస్తా. కానీ స్టిల్ కెమెరాకు పోజులు ఇవ్వలేను.

మీ నాన్న రాజేంద్రప్రసాద్ గారు పెద్ద నిర్మాత. ఆ వారసత్వం బాధ్యతగా అనిపించదా?

అనిపించదు. జీవితం పట్ల నాకున్న దృక్పథం వేరు. ఈ మధ్యకాలంలో చాలామంది నెపోకిడ్స్ (వారసులు) గురించి ఫిర్యాదులు చేస్తూ ఉంటారు. కానీ నా ఉద్దేశంలో వారసత్వం ఒక ఎంట్రీ పాయింట్ మాత్రమే! ఆ తర్వాత మనని మనమే నిరూపించుకోవాలి. నా రెండో సినిమాకే... మా బ్యానర్ కానీ, నాన్నగారు కానీ నాకు సాయం చేయలేరని అర్థమయిపోయింది. ఆ తర్వాత నేను ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నాను. ఇది నా ఒక్కడికే కాదు... చాలామందికి జరుగుతోంది. ఇక్కడ మనుగడ సాగించాలంటే పరిశ్రమ తీరు తెలుసుకొని మసలాలి.

సినీ పరిశ్రమను మీరు ఎలా చూస్తారు?

మా అందరికీ అన్నం పెడుతోంది. అయితే ఇక్కడ నటులను 'నడిచే డబ్బు'గా చూస్తారు. డబ్బులు కనిపిస్తేనే మాట్లాడతారు. లేకపోతే లేదు. ఎందుకంటే ఇది ఒక బిజినెస్. ఒక వ్యక్తి మంచివాడా? చెడ్డవాడా అనే విషయం కన్నా... మార్కెట్ ఉందా? లేదా? డబ్బు వస్తుందా? లేదా? మనకు ఉపయోగం ఉందా? లేదా? అనే విషయాలనే ఆలోచిస్తారు. ఒక్క మాటలో చెప్పాలంటే... 'నాకేంటి?' అనే సూత్రం ద్వారానే అన్నీ నడుస్తూ ఉంటాయి. అయితే దీనిని నేను తప్పుపట్టను. ఎందుకంటే ఈ పరిశ్రమ టర్నోవర్ వేల కోట్లకు చేరిపోయింది. అందువల్ల మంచి, చెడు కన్నా లాభం... నష్టాలకే ఎక్కువ విలువ ఉంటుంది.

స్క్రిప్ట్‌లు మీరే ఎంపిక చేసుకుంటారా?

నేనే విని, ఎంపిక చేసుకుంటా. నేను ఎంపికచేసుకొనే పాత్రలు విభిన్నంగా ఉంటాయి. స్క్రిప్ట్ బలం, డైరెక్టర్ బలం, బ్యానర్ బలం... కొన్నిసార్లు రెమ్యూనరేషన్ బలం... ఇలా రకరకాల కోణాల నుంచి వీటిని ఎంపిక చేసుకుంటా! స్క్రిప్ట్ నచ్చితే డబ్బులు లేకుండా చేసిన సినిమాలు కూడా ఉన్నాయి. డబ్బుల కోసం స్క్రిప్ట్ నచ్చకపోయినా చేసిన సినిమాలున్నాయి.

మీరు, మీ కుటుంబం చాలా ప్రైవేట్ మనుషులు. మీరు చాలా స్ట్రిక్ట్ ఫాదరా?

లేదండి. మా పిల్లలకు నేను చాలా స్వేచ్ఛ ఇచ్చాను. ఎందుకంటే చిన్నప్పటి నుంచి నేను స్వేచ్ఛా జీవిని. స్కూలు అంటే ఇష్టం ఉండేది కాదు. మా పిల్లలకు కూడా... "మీకు రెక్కలు ఇచ్చాను. స్వేచ్ఛగా ఎగరండి" అని చెప్పేవాడిని. అడిగితే తప్ప వాళ్లకు ఎప్పుడూ సలహాలు కూడా ఇచ్చేవాడినికాదు. నా అభిప్రాయాలు కూడా చెప్పేవాడిని కాదు. వాళ్లు చాలా బాగా పెరిగారు. అప్పుడప్పుడు మా పెద్దమ్మాయి... "నువ్వు మమ్మల్ని స్ట్రిక్ట్‌గా పెంచలేదు" అంటూ ఉంటుంది. "నేను వదిలేశాను. మీరు బాగా పెరిగారు. బాగుపడ్డారు" అని చెబుతూ ఉంటాను. చిన్నప్పటి నుంచి ఇప్పటి దాకా పిల్లలను నేను ఫ్రెండ్స్‌గానే చూశాను.

> **సముద్రం... నా ఆత్మకథ...**
>
> చిన్నప్పుడు మా స్కూలు... బీచ్ పక్కనే ఉండేది. అక్కడ కూర్చుని ఫిలాసఫికల్‌గా రాసుకుంటూ ఉండేవాడిని. అందుకే నేను రాస్తున్న ఆత్మకథ పేరు 'సముద్రం' అని పెట్టుకున్నా! నా ఆలోచనలు, అనుభవాలతో పన్నెండున్నర గంటల వీడియో చేశా. ఎడిటింగ్ బాగా రాలేదు. అందువల్ల విడుదల చేయలేదు. నా ఆత్మకథలో కొన్ని ఖాళీలు ఉన్నాయి. వాటిని పూరించిన తర్వాత దానిని విడుదల చేస్తా!



మీరు హీరోగా ప్రవేశించిన నాటికి... ఇప్పటికీ పరిశ్రమలో ఏవైనా మార్పులు వచ్చాయా?

ఎన్టీఆర్.. ఏఎన్నార్‌ల సమయం నుంచి మా దాకా అందరం ఫాలో అయిన రూల్ ఒకటుంది. హీరోతో పాటుగా సినిమాలోని అన్ని పాత్రలూ బాగా ఉండాలనుకొనేవాళ్లం. అందరికీ ప్రాధాన్యం ఉండేది. ఈ విషయం మాట్లాడుతుంటే... 'శుభలగ్నం' జ్ఞాపకం వస్తోంది. షూటింగ్ సమయంలో డైరెక్టర్ కృష్ణారెడ్డిగారు వచ్చి... "పాత్రపరంగా సినిమాలో ఆమని డామినేట్ చేసేస్తోందండి' అన్నారు. "వైనాట్? నేను హీరోనే. కానీ ఈ సినిమా ఆ అమ్మాయిదే" అన్నా. ఆ రోజుల్లో అలా ఉండేది. అందరూ కథ బరువు మోసేవారు. ఇప్పుడు 'వన్‌మ్యాన్ షో' అయిపోయింది. హీరో మీదే ఫోకస్ అంతా ఉంటోంది. ఒకప్పుడు హీరో లంటే గౌరవం ఉండేది. ఇప్పుడు హీరోలంటే భయం కనిపిస్తోంది. 'అమ్మో! హీరోనా' అనుకుంటున్నారు. కొన్ని పాత్రలు ఎందుకు వస్తున్నాయో... ఎందుకు పోతున్నాయో కూడా తెలియటంలేదు. అందరూ అలా ఉన్నారని అనటంలేదు. కొందరు సెన్సిబుల్ డైరెక్టర్స్ కూడా ఉన్నారు.

నిర్మాతలు ఏటీఎంలు అయిపోయారనే విమర్శ వినిపిస్తూ ఉంటుంది..!

నిర్మాతకు గౌరవం తగ్గిందనే విషయంలో సందేహం లేదు. నిర్మాతలే సినీ పరిశ్రమకు మూల స్తంభాలు. కానీ వారికి గౌరవం తగ్గింది. చాలామంది నిర్మాతలు షూటింగ్‌లకు కూడా రావటంలేదు. ఆన్‌లైన్ ప్రొడ్యూసర్ హవా పెరిగిపోయింది. ఒకప్పుడు ఇలా ఉండేది కాదు. నిర్మాతలు సినీ నిర్మాణాన్ని ఎంజాయ్ చేసేవారు. రోజూ షూటింగ్‌కు వచ్చేవారు. ఏవైనా మార్పులు ఉంటే కూడా చెప్పేవారు. ఇప్పుడు అలాంటివారు తక్కువగా ఉన్నారనే చెప్పాలి.

> **అందుకే కేసినోకు...**
>
> నాకు ప్రస్తుతం ఎలాంటి హాబీలు లేవు. ఒకప్పుడు విపరీతంగా పార్టీలు చేసేకొనేవాడిని. అప్పుడు నా రేంజే వేరు. షూటింగ్‌ల మధ్యలో ఫ్లయిట్ ఎక్కి విదేశాలకు వెళ్లి పార్టీ చేసుకొని వచ్చిన రోజులు కూడా ఉన్నాయి. కానీ హఠాత్తుగా నాకు పార్టీలు చాలు అనిపించింది. పార్టీలకు కూడా ఎజెండాలు ఉంటున్నాయి. ఇక్కడ ఒక విషయం చెప్పాలి... నాకు నా చుట్టూ ఉన్న పరిసరాలను, మనుషులను గమనించటమంటే చాలా ఇష్టం. నేను కేసినోకి వెళ్లటానికి ఇదే ప్రధాన కారణం. మిలియన్స్ పోతుంటే ఎలా ఉంటుంది? వస్తుంటే వాళ్ల ఫీలింగ్స్ ఎలా ఉంటాయి అనేవి చూసేవాడిని. నా ఉద్దేశంలో మనిషి బుద్ధి పేకాటలో తెలుస్తుంది. ఒక మనిషి గురించి తెలియాలంటే అతనిని పేకాట ఆడించాలి.

> **రమ్యకృష్ణ నాకు గాడ్‌మదర్...**
>
> ఇండస్ట్రీలో నాకు రమ్యకృష్ణ మంచి స్నేహితురాలు. గాడ్‌మదర్ కూడా. ఈ మాట అనడానికి వెనకొక కారణం ఉంది. 'శుభలగ్నం' సినిమా నాకు రావటానికి తనే కారణం. 'అల్లరి ప్రేమికుడు' సినిమా షూటింగ్ జరుగుతున్న సమయంలో దత్తు గారి దగ్గర నుంచి 'శుభలగ్నం'కు డేట్స్ కావాలని ఫోన్ వచ్చింది. 'డేట్స్ లేవు.. వద్దని చెప్పు" అని మా మేనేజర్‌కు చెప్పా. అతను చెప్పటానికి వెళ్తున్న సమయంలో మా మాటలు రమ్యకృష్ణ విన్నది. "నీకు పిచ్చా! ఆ సినిమా ఒప్పుకో! డేట్స్ మనం ఎడ్జెస్ట్ చేసుకుందాం" అని చెప్పి ఒప్పించింది. తను లేకపోతే 'శుభలగ్నం' లేదు. ఇప్పటికీ తను మా ఫ్యామిలీ ఫ్రెండ్. అప్పుడప్పుడు ఫోన్ చేస్తుంది. "ఎలా ఉన్నావు. డబ్బులు జాగ్రత్తగాపెట్టుకో!అనవసరంగా ఖర్చు చేయకు" అని చెబుతుంది.

● సీవీఎల్ఎన్ ప్రసాద్
ఫొటోలు: అశోకుడు

సెలబ్ ఫిట్

కష్టపడే తత్వం... అంకితభావం ఉంటే ఎంతటి లక్ష్యమైనా చేరుకోవచ్చని నిరూపించిన మహిళ సయామీ ఖేర్. విలక్షణమైన పాత్రలతో నటిగా అలరిస్తూనే... అలుపెరుగని కృషితో అథ్లెట్‌గానూ అదరగొడుతోంది. కఠినమైన 'ఐరన్ మ్యాన్' రేస్‌ను పూర్తి చేసిన మొట్టమొదటి భారతీయ నటిగా చరిత్ర సృష్టించిన సయామీ... నవతరానికి మార్గదర్శిగానూ నిలుస్తోంది.



సయామీ... మన ఐరన్‌మ్యాన్

'భారత మహిళలు కుటుంబం, ఉద్యోగం, పిల్లల కోసం శ్రమిస్తారు. కానీ తమ గురించి తాము మరిచిపోతారు. వ్యక్తిగత ఆరోగ్యాన్ని ఏమాత్రం పట్టించుకోరు. అత్యధిక శాతం మంది పరిస్థితి ఇదే. ఒక మహిళ తన ఆరోగ్యకర జీవన శైలిపై దృష్టి పెడితే... ఆ ప్రభావం ఆమె చుట్టూ ఉన్నవారిపై కూడా పడుతుందనేది నా నమ్మకం. నడక, నాట్యం, యోగా... ఏదైనా కావచ్చు, రోజుకు కనీసం ఓ అరగంట కేటాయిస్తే చాలు... శారీరకంగా, మానసికంగా దృఢంగా మారతారు. తత్ఫలితంగా ఎన్నో అనారోగ్య సమస్యలకు దూరంగా ఉంటారు'... అంటున్న సయామీ ఖేర్ నిత్యం తన అభిమానులను ఫిట్‌నెస్ వైపు నడిపించే ప్రయత్నం చేస్తుంటుంది. నటిగా, క్రీడాకారిణిగా... రెండిటికీ సమప్రాధాన్యం ఇస్తూ ప్రత్యేకతను చాటుకుంటోంది.

అతడి తరువాత...

ఎంతో క్లిష్టమైన 'ఐరన్‌మ్యాన్ 70.3' రేస్‌ను పూర్తి చేసిన తొలి భారత నటిగా సయామీ గత ఏడాది చరిత్ర సృష్టించింది. ఈ ఏడాది అదే ఫీట్‌ను మరోసారి సాధించి తన ఫిట్‌నెస్‌కు తిరుగులేదని నిరూపించింది. ఆమె కంటే ముందు నటుడు, మోడల్ మిలింద్ సోమన్ దీన్ని పూర్తి చేశాడు. 'ఐరన్‌మ్యాన్' రేస్‌ను 'వరల్డ్ ట్రయథ్లాన్ కార్పొరేషన్' (డబ్ల్యూటీసీ) నిర్వహిస్తుంది. ఇందులో 1.2 మైళ్ల స్విమ్మింగ్, 56 మైళ్ల సైక్లింగ్, 13.1 మైళ్ల రన్నింగ్ ఉంటాయి. మొత్తం కలిపి 70.3 మైళ్లు. 'నటులకు క్రీడల్లో పాల్గొనడం అంత సులువు కాదు. విభిన్న లొకేషన్లకు వెళుతుంటాం. షూటింగ్ సమయాలు అందుకు అనుకూలించవు. అదే ఉద్యోగం అయితే ఆఫీస్‌కు వేళలు ఉంటాయి. కానీ ఇక్కడ అలా కుదరదు. కొన్నిసార్లు విరామం లేకుండా రోజుల తరబడి వరుస షెడ్యూల్స్ చేయాల్సి వస్తుంది. నైట్ షిఫ్టు సరేసరి. ఈ పరిస్థితుల్లో క్రీడల్లో కొనసాగడం పెద్ద సవాలు. శరీరాన్ని ఎంతో కష్టపెట్టాలి. నేను షూటింగ్ నుంచి నేరుగా సాధన కోసం మైదానానికి వెళ్లిన సందర్భాలు కూడా ఉన్నాయి. చిన్నప్పటి నుంచీ ఆటలపై మక్కువ నన్ను నడిపిస్తోంది' అని ఓ ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చిన సయామీ... తనను చూసి మరింతమంది మహిళలు స్ఫూర్తి పొందుతారని ఆశిస్తోంది. ఇదొక్కటే కాదు... మారథాన్‌లోనూ ఆమె పోటీపడుతోంది.



పాత్రకు తగినట్టు తన ఆకృతిని మార్చుకోవడానికి వెనకాడని సయామీ... 2015లో విడుదలైన 'రేయ్' చిత్రంతో పరిశ్రమలోకి అడుగుపెట్టింది. ఆ తరువాత 'మిర్జ్యా, చోక్‌డ్, అన్‌పాస్‌డ్, హైవే, వైల్డ్ డాగ్, ఘూమర్, శర్మాజీ కీ బేటీ' తదితర సినిమాల్లో ప్రధాన పాత్రలు పోషించింది. ఆ మధ్య విడుదలైన 'జాట్'లో పోలీస్ అధికారిగా మెప్పించింది. మహారాష్ట్ర నాసిక్‌లో పుట్టిన ఆమె తండ్రి అద్వైత్ ఖేర్ మోడల్. తల్లి ఉత్తర 1982లో 'మిస్ ఇండియా'. అక్క సాంస్కృతి మరాఠీ నటి. ముంబయి సెయింట్ జేవియర్స్ కాలేజీ నుంచి డిగ్రీ పట్టా పొందిన సయామీ... పలు టెలివిజన్ షోలలో కూడా మెరిసింది.

శరీరం చెప్పింది వింటా...

'ఒక్కోసారి తీవ్రమైన పని ఒత్తిడిని మన శరీరం తట్టుకోలేదు. అలాంటప్పుడు వ్యాయామాలు, డైటింగ్ పేరిట దాన్ని కష్టపెట్టడం సరైంది కాదు. అందుకే నేను నా శరీరం చెప్పింది వింటాను. దానికి అనుగుణంగానే నా షెడ్యూల్స్ నిర్ణయించుకొంటాను. శరీరానికి బాగా శ్రమ ఇచ్చానని అనుకున్నప్పుడు పూర్తిగా విశ్రాంతి తీసుకొంటా. నాకు నచ్చిన ఐస్‌క్రీమ్, చాక్లెట్లు తింటా. గత నెలలో ఐరన్ మ్యాన్ రేస్ తరువాత శీతల సరస్సులో ఈత కొట్టాను. అది ఐస్‌బాత్‌లా పని చేసింది' అంటున్న సయామీ... అవసరాన్ని బట్టి జిమ్‌లో వర్కవుట్స్ చేస్తుంది.

ఇలా ఉంటే అందరినీ ఆకట్టుకుంటారు

చక్కని మాట తీరు, ఆకట్టుకునే వ్యక్తిత్వం అనేవి మనల్ని నలుగురిలో ప్రత్యేకంగా నిలబెడతాయి. అలా అందరితో ప్రశంసలు అందుకోవాలంటే ఏ చిట్కాలు పాటించాలో తెలుసుకుందాం...

- ఎవరితోనైనా మాట్లాడేటప్పుడు ముఖంపై చిరునవ్వు ఉండేలా చూసుకోవాలి. అలాగే నిటారుగా నిలబడాలి లేదా కుర్చీలో హాయిగా కూర్చోవాలి. అక్కడా ఇక్కడా కాకుండా ఎదుటివారి కళ్లలోకి చూస్తూ మాట్లాడాలి. ఇవన్నీ చక్కని ఆత్మవిశ్వాసానికి ప్రతీకలుగా నిలుస్తాయి.
- దుస్తులు మన వ్యక్తిత్వాన్ని ప్రతిబింబిస్తాయి. ఆహ్లాదకరంగా కనిపిస్తూ అభిరుచికి అద్దం పట్టేలా దుస్తులు ఉండాలి. సందర్భానుసారం దుస్తులను ఎంపిక చేసుకోవాలి. సరైన దుస్తులు ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయి.
- అనుకోని సమస్య ఎదురైనప్పుడు ఇతరులను నిందించకూడదు. దానికి బదులు సమస్య పరిష్కారానికి మనం అనుసరించే వ్యవహారశైలి అందరిలో ఉన్నతంగా నిలబెడుతుంది. అనవసరమైన వాదనలకు పోకుండా సామరస్యంగా సమస్యను తీర్చే ప్రయత్నం చేయాలి.



- సొంత ఆలోచన మాత్రమే సరైనదన్న భావనతో కాకుండా అందరి అభిప్రాయాలను తెలుసుకుంటూ స్నేహపూర్వకంగా వ్యవహరించాలి. అందరినీ కలుపుకొంటూ, ఏ ఒక్కరినీ నొప్పించకుండా చక్కని వ్యవహార దక్షతను అవలంబిస్తే నలుగురిలో ప్రత్యేకమైన ప్రశంసలు అందుకోవచ్చు.

లంక ఆల్‌రౌండ్ షో

ఆసియాకప్‌లో బంగ్లాపై ఘన విజయం

అబుధాబి: ఆసియాకప్‌లో శ్రీలంక జట్టు తమ తొలి మ్యాచ్‌లో ఆల్‌రౌండ్‌షో కనబర్చింది. తద్వారా శనివారం బంగ్లాదేశ్‌తో జరిగిన ఈ గ్రూప్ బి మ్యాచ్‌లో 6 వికెట్ల తేడాతో నెగ్గింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన బంగ్లా 20 ఓవర్లలో 139/5 స్కోరుకే పరిమితమైంది. మొదటి రెండు ఓవర్లలోనే జట్టు ఖాతా కూడా తెరువకుండా రెండు వికెట్లు కోల్పోయింది. అయితే చివర్లో షమీమ్ (42 నాటౌట్), జకెర్ అలీ (41 నాటౌట్) మెరుపు ఆటతో ఆరో వికెట్‌కు అజేయంగా 86 పరుగులు జోడించారు. హసరంగకు రెండు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో శ్రీలంక 14.4 ఓవర్లలో 4 వికెట్లకు 140 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్ నిస్సాంక (50) అర్ధసెంచరీతో రాణించాడు. కమిల్ మిషారా (46 నాటౌట్) అజేయంగా నిలిచాడు. మెహెదీ హసన్ రెండు వికెట్లు తీశాడు. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ కమిల్ మిషారాకు లభించింది.

జోష్ మైదానంలో సమరం



నేడు పాకిస్థాన్‌తో భారత్ పోరు

రాత్రి 8 నుంచి సోనీ నెట్‌వర్క్‌లో

ఆసియాకప్ మొదలై వారం కావొస్తున్నా జోష్ ఎక్కడ? పైగా అన్నీ ఏకపక్ష మ్యాచ్‌లే.. అంటూ అభిమానులు పెదవి విరుస్తున్న వేళ, ఈ టోర్నీలో అసలు సిసలైన మ్యాచ్‌కు నేడు తెర లేవనుంది. సండే బ్లాక్‌బస్టర్‌గా అలరించనున్న ఈ సమరంలో దాయాదులు భారత్-పాకిస్థాన్ జట్లు ఢీకొనబోతున్నాయి. 'ఆపరేషన్ సిందూర్' తర్వాత పాక్‌తో మ్యాచ్‌లను బాయ్‌కాట్ చేయాలనే డిమాండ్ గట్టిగా వినిపిస్తున్న వేళ.. ఇరు దేశస్థుల భావోద్వేగాలు తీవ్ర స్థాయిలో ఉన్న తరుణాన.. ఎడారి దేశంలో ఎవరిది పైచేయి కానుందో చూడాల్సిందే!

దుబాయ్: అంతర్జాతీయ టోర్నీల్లో భారత్-పాకిస్థాన్ జట్లు తలపడడం చూస్తూనే ఉంటాం. కానీ ఈసారి ఇరు జట్ల మధ్య మ్యాచ్ ప్రత్యేక పరిస్థితుల్లో జరుగబోతోంది. పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో ఇరు దేశాల మధ్య యుద్ధ వాతావరణమే నెలకొంది. అందుకే పాక్‌తో క్రికెట్ ఆడడం అవసరమా? అని ఇప్పటికే భారత్‌లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. పలు రాజకీయ పార్టీలు కూడా దీనిపై గళమెత్తుతున్నాయి. ఇలాంటి తరుణంలో పాక్‌తో పోరుకు టీమిండియా సిద్ధమైంది. యుద్ధభూమిలోనే కాదు మైదానంలోనూ పాక్ భరతం పట్టేందుకు సూర్యకుమార్ నేతృత్వంలోని భారత యువ ఆటగాళ్లు ఎదురు చూస్తున్నారు. మరోవైపు సీనియర్ ఆటగాళ్లు లేకపోవడంతో పాక్ జట్టు కాస్త బలహీనంగా కనిపిస్తోంది. అయితే జట్టులో స్పిన్నర్లు రాణిస్తుండడం వాళ్లకు సానుకూలాంశం. కాగా.. 2023 తర్వాత భారత్ ఆడిన మొత్తం 39 టీ20ల్లో 27 మ్యాచ్‌లు గెలవడం పొట్టి ఫార్మాట్‌లో మన ఆధిపత్యాన్ని చాటి చెబుతోంది. ఇక, ఇరు జట్ల మధ్య ఓవరాల్‌గా 13 టీ20లు జరిగితే.. భారత్ తొమ్మిది మ్యాచుల్లో, పాక్ మూడింటిలో నెగ్గింది. ఓ మ్యాచ్ డ్రాగా ముగిసింది.

ఫేవరెట్‌గా బరిలోకి..

పాక్‌తో పోల్చుకుంటే ప్రపంచ అగ్రశ్రేణి బ్యాటర్లతో కూడిన భారత జట్టు అత్యంత పటిష్ఠంగా కనిపిస్తోంది. వరల్డ్ నెంబర్‌వన్ అభిషేక్, గిల్ తొలిసారి దాయాదితో టీ20 ఆడబోతున్నారు. ఈ జోడీ దూకుడుకు మిడిలార్డర్‌లో సూర్యకుమార్, తిలక్, హార్దిక్, దూబేల హిట్టింగ్ తోడైతే పాక్ బౌలర్లకు కష్టాలు తప్పవు. బౌలింగ్‌లో స్టార్ పేసర్ బుమ్రా పదునైన బంతులకు స్పిన్నర్లు కుల్దీప్, అక్షర్, వరుణ్ చక్రవర్తిల మ్యాజిక్ స్పెల్ తోడైతే ప్రత్యర్థి బ్యాటర్లు ఉక్కిరిబిక్కిరి కావాల్సిందే. అయితే పొట్టి ఫార్మాట్ అంటే అనిశ్చితికి మారుపేరు కాబట్టి అవతలి జట్టు ఎంత బలహీనంగా కనిపించినా.. దాడి మాత్రం గట్టిగానే ఉండాలనే ఆలోచనలో టీమ్ మేనేజ్‌మెంట్ ఉంది. కెప్టెన్ సూర్య కూడా తమలో దూకుడు ఏమాత్రం తగ్గదని టోర్నీ ఆరంభంలోనే స్పష్టంగా చెప్పాడు. అయితే పాక్‌పై ఆడిన ఐదు మ్యాచ్‌ల్లో సూర్య 64 పరుగులే సాధించడం గమనార్హం.

తుది జట్లు (అంచనా)

భారత్: అభిషేక్, గిల్, తిలక్, సూర్యకుమార్ (కెప్టెన్), శాంసన్, దూబే, హార్దిక్, అక్షర్, కుల్దీప్, బుమ్రా, వరుణ్.

పాకిస్థాన్: ఫర్హాన్, సయీమ్ అయూబ్, ఫఖర్ జమాన్, సల్మాన్ ఆఘా (కెప్టెన్), హసన్ నవాజ్, మహ్మద్ హారీస్, మహ్మద్ నవాజ్, ఫహీమ్ అష్రాఫ్, షహీన్ అఫ్రీది, అబ్రార్ అహ్మద్, సుఫియాన్.

పిచ్: ఆరంభంలో కొత్త బంతి స్వింగ్ అయ్యే చాన్సుంది. అయితే మ్యాచ్ సాగుతున్న కొద్దీ స్పిన్నర్లు ప్రభావం చూపగలరు. టాస్ గెలిచిన కెప్టెన్ బౌలింగ్ ఎంచుకోవచ్చు.



పాక్ కెప్టెన్ సల్మాన్ ఆఘా

పోటీ ఏమేరకు?

తాజా పాక్ జట్టు లైనప్‌ను గమనిస్తే బహుశా ఇద్దరు, ముగ్గురు ఆటగాళ్ల పేర్లు తప్ప ఇతరుల గురించి క్రికెట్ అభిమానులకు అంతగా తెలిసి ఉండకపోవచ్చు. స్టార్ ఆటగాళ్లు బాబర్ ఆజమ్, మహ్మద్ రిజ్వాన్‌లపై వేటు వేసి ఎక్కువ మంది కొత్తవారితో జట్టును ఎంపిక చేశారు. కొత్త కెప్టెన్ సల్మాన్ ఆఘా నేతృత్వంలోని ఈ జట్టు.. ఓపెనర్ సయీమ్ అయూబ్, ఫఖర్ జమాన్, మహ్మద్ హారీస్‌ల బ్యాటింగ్‌పై ఎక్కువగా ఆధారపడి ఉంది. బౌలింగ్‌లో పేసర్ షహీన్ అఫ్రీదితో పాటు స్పిన్‌లో మహ్మద్ నవాజ్, అబ్రార్ అహ్మద్, సుఫియాన్ కీలకం కానున్నారు. అన్ని విభాగాల్లో భారత్‌కన్నా కాస్త బలహీనంగా కనిపిస్తున్న పాక్ జట్టు ఆదివారం జరిగే మ్యాచ్‌లో ఏమేరకు పోటీనివ్వగలదో చూడాలి.

ఇషా గోల్డెన్ షూట్

ప్రపంచ కప్‌లో స్వర్ణం కైవసం

నింగ్బో (చైనా): తెలుగు షూటర్ ఇషా సింగ్ అంతర్జాతీయ వేదికపై అదరగొట్టింది. హైదరాబాద్‌కు చెందిన 20 ఏళ్ల ఇషా.. ఐఎస్‌ఎస్‌ఎఫ్ ప్రపంచ కప్‌లో పసిడి మోత మోగించింది. మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత ఈవెంట్‌లో చాంపియన్‌గా నిలిచింది. శనివారం ఇక్కడ ఉత్కంఠభరిత ఫైనల్స్‌లో ఇషా.. 0.1 పాయింట్ తేడాతో స్థానిక ఫేవరెట్ షూటర్ యావో కియాన్‌గ్జున్‌ను ఓడించి స్వర్ణ పతకం పట్టేసింది. ఇషా మొత్తం 242.6 పాయింట్లతో అగ్ర స్థానం దక్కించుకోగా.. కియాన్‌గ్జున్ 242.5 స్కోరుతో రజతంతో సరిపెట్టుకుంది. దక్షిణ కొరియాకు చెందిన ఒలింపిక్ చాంపియన్ వో యెజిన్ 220.7 స్కోరుతో కాంస్య పతకానికి పరిమితమైంది. ప్రపంచ కప్‌లో ఇషాకు ఇదే తొలి స్వర్ణం కావడం విశేషం. ఇక పురుషుల 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్ ఈవెంట్‌లో భారత షూటర్లు భవేశ్ షెఖావత్ 22వ, ప్రదీప్‌సింగ్ షెఖావత్ 23వ, మన్‌దీప్ సింగ్ 39వ స్థానాల్లో నిలిచి నిరాశపరిచారు.



ఫైనల్లో భారత్

చైనాతో ఢీ నేడు మహిళల ఆసియా కప్ హాకీ

హాంగ్జౌ (చైనా): భారత మహిళల జట్టు ఆసియా కప్ ఫైనల్‌కు అర్హత సాధించింది. శనివారం జరిగిన సూపర్-4 మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ జపాన్‌తో పోరును మన మహిళలు 1-1తో డ్రా చేశారు. అయితే సూపర్-4 చివరి మ్యాచ్‌లో ఆతిథ్య చైనా 1-0తో కొరియాను ఓడించడంతో..భారత జట్టు తుదిపోరుకు క్వాలిఫై అయ్యింది. ఆదివారం జరిగే టైటిల్ ఫైట్‌లో చైనాతో భారత మహిళలు అమీతుమీ తేల్చుకుంటారు.

ఆంధ్ర జట్టు కోచ్‌గా గ్యారీ స్టెడ్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): దేశవాళీ క్రికెట్‌లోనే తొలిసారిగా ఒక విదేశీ కోచ్‌ను రాష్ట్ర జట్టుకు చీఫ్ కోచ్‌గా నియమిస్తూ ఆంధ్ర క్రికెట్ సంఘం (ఏసీఏ) విప్లవాత్మక నిర్ణయం తీసుకుంది. వచ్చే దేశవాళీ సీజన్‌కు న్యూజిలాండ్ మాజీ కోచ్ గ్యారీ స్టెడ్‌ను ఆంధ్ర జట్టుకు కోచ్‌గా నియమించినట్టు ఏసీఏ కార్యదర్శి సానా సతీష్ తెలిపారు.


హీలీ హర్మన్

ప్రతీకారం తీరేనా?

నేడు ఆసీస్‌తో భారత మహిళల వన్డే

మధ్యాహ్నం 1.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..

ముల్లన్‌పూర్ (చండీగఢ్): గతేడాది ఆస్ట్రేలియా పర్యటనలో భారత మహిళల జట్టుకు వన్డేల్లో 0-3తో ఘోర పరాభవం ఎదురైంది. ఇప్పుడు ఆ ఓటమికి హర్మన్‌ప్రీత్ సేన స్వదేశంలో బదులు తీర్చుకోవాలనుకుంటోంది. ఆదివారం నుంచి ఇరుజట్ల మధ్య మూడు వన్డేల సిరీస్ జరగనుంది. ఈ మ్యాచ్‌లను రానున్న వన్డే వరల్డ్‌కప్ సన్నాహకంగానూ ఉపయోగించుకోవాలని భారత్ భావిస్తోంది. ఇటీవలి కాలంలో భారత మహిళలు ఐర్లాండ్, శ్రీలంకలో ముక్కోణపు సిరీస్, ఇంగ్లండ్‌తో వన్డే, టీ20ల్లో సిరీస్‌లను గెలిచి ఆత్మవిశ్వాసంతో ఉన్నారు. ఇదే ఊపులో అలీసా హీలీ సారథ్యంలోని ఆసీస్‌పై పైచేయి సాధించాలనుకుంటున్నారు. ఇక, 9 నెలల విరామం తర్వాత భారత పేసర్ రేణుకా సింగ్ బరిలోకి దిగబోతోంది.

సెంట్రల్ 511

● యశ్ 194

● దులీప్ ట్రోఫీ ఫైనల్

బెంగళూరు: సౌత్ జోన్‌తో జరుగుతున్న దులీప్ ట్రోఫీ ఫైనల్లో సెంట్రల్ జోన్‌కు 362 పరుగుల భారీ ఆధిక్యం దక్కింది. యష్ రాథోడ్ (194) తృటిలో డబుల్ సెంచరీ కోల్పోగా, సారాంశ్ (69) అర్ధసెంచరీ సహాయంతో సెంట్రల్ తొలి ఇన్నింగ్స్‌లో 511 పరుగులు సాధించింది. గుర్జపనీత్, అంకిత్‌లకు నాలుగేసి వికెట్లు లభించాయి. ఆ తర్వాత రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన సౌత్ జోన్ శనివారం మూడో రోజు ఆట ముగిసే సమయానికి 33 ఓవర్లలో 129/2 స్కోరుతో నిలిచింది. క్రీజులో స్మరణ్ (37 బ్యాటింగ్), రికీ భుయ్ (26 బ్యాటింగ్) ఉండగా, ఇంకా 233 పరుగులు వెనుకంజలో ఉంది.

మ్యాచ్ బహిష్కరణ డిమాండ్‌కు పంజాబ్ కింగ్స్ వినూత్న ట్విస్ట్!



న్యూఢిల్లీ: పహల్గావ్ ఉగ్రదాడి తర్వాత భారత్-పాకిస్థాన్ సంబంధాలు మరింత దెబ్బతిన్నాయి. ఈ నేపథ్యంలో ఆసియా కప్‌లో పాకిస్థాన్‌తో ఆదివారం జరిగే మ్యాచ్‌ను టీమిండియా బహిష్కరించాలనే డిమాండ్ భారత్‌లో పెద్దఎత్తున వినిపిస్తోంది. చాలామంది క్రికెట్ ఫ్యాన్స్ ఆ మ్యాచ్‌ను తాము తిలకించబోమని సోషల్ మీడియా ద్వారా ప్రకటిస్తున్నారు. పలువురు సెలబ్రిటీలు కూడా వారి బాటలో నడిచారు. తామూ ఇండో-పాక్ పోరును చూడబోమని స్పష్టంజేశారు. ఈక్రమంలో ఐపీఎల్ ఫ్రాంచైజీ పంజాబ్ కింగ్స్ 'మ్యాచ్ బాయ్‌కాట్'ను వినూత్నంగా ప్రదర్శించింది. కెప్టెన్ సూర్యకుమార్ ఫొటోతో 'డిఫెండింగ్ చాంపియన్ ఇండియా మ్యాచ్' అంటూ ప్రత్యర్థి స్థానాన్ని 'ఖాళీ'గా చూపుతూ సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. దీనికి పాకిస్థాన్ సూపర్ లీగ్ జట్టు కరాచీ కింగ్స్ చెస్ ఆట నేపథ్యంగా స్పందించింది. చెస్ బోర్డుకు ఓవైపు పాకిస్థాన్ క్రికెట్ జట్టు కెప్టెన్ సల్మాన్ ఆఘా ఫొటోను గ్రాఫిక్ డిజైన్ చేసి..భారత్ స్థానాన్ని ఖాళీగా ఉంచింది.

యోధాస్‌పై జైపూర్ విజయం

జైపూర్: సొంత గడ్డపై ప్రొ. కబడ్డీ లీగ్‌లో జైపూర్ పింక్ పాంథర్స్ తొలి విజయం అందుకుంది. శనివారం జరిగిన మ్యాచ్‌లో 41-29తో యూపీ యోధాస్‌ను ఓడించింది. నితిన్ కుమార్ సూపర్ 10 సాధించాడు. రైడర్ అలీ 9 పాయింట్లు రాబట్టాడు. మరో మ్యాచ్‌లో పుణెరి పల్టన్ 39-33తో తెలుగు టైటాన్స్‌పై నెగ్గింది.

టైటిల్‌కు అడుగు దూరంలో..

ఫైనల్లో సాత్విక్ జోడీ, లక్ష్య

హాంకాంగ్ ఓపెన్



సాత్విక్ చిరాగ్

హాంకాంగ్: కొన్నాళ్లుగా టైటిల్ వేటలో వెనుకంజలో నిలిచిన భారత షట్లర్లు హాంకాంగ్ ఓపెన్‌లో డబుల్ ధమాకా సృష్టించేందుకు అడుగు దూరంలో నిలిచారు. పురుషుల సింగిల్స్‌లో లక్ష్యసేన్.. డబుల్స్‌లో స్టార్ జోడీ సాత్విక్ సాయిరాజ్/చిరాగ్ షెట్టి ఫైనల్స్‌కు దూసుకెళ్లారు. శనివారం హోరాహోరీగా జరిగిన సెమీఫైనల్లో లక్ష్య 23-21, 22-20 చైనీస్ తైపీకి చెందిన ప్రపంచ 9వ ర్యాంకర్ చో తిన్ చెన్‌ను ఓడించాడు. దాదాపు గంటసేపు సాగిన ఉత్కంఠపోరులో మూడో సీడ్ చో తిన్ నుంచి గట్టి పోటీ ఎదురైనా.. లక్ష్య దీటుగా విజృంభించి విజయం సాధించాడు. సూపర్ 500 టోర్నీలో ఫైనల్ చేరడం 23 ఏళ్ల లక్ష్య సేన్‌కు ఇది గత రెండేళ్లలో తొలిసారి కావడం గమనార్హం. అతను చివరిగా 2023 జులైలో కెనడా ఓపెన్‌లో టైటిల్ పోరుకు చేరాడు. 20వ ర్యాంకరైన లక్ష్య.. ఆదివారం జరిగే ఫైనల్లో రెండో సీడ్ లి షి ఫెంగ్ (చైనా)తో తలపడనున్నాడు. ఇక, పురుషుల డబుల్స్ సెమీఫైనల్లో ప్రపంచ 9వ ర్యాంక్ జోడీ సాత్విక్/చిరాగ్ 21-17, 21-15తో చైనీస్ తైపీ జంట బింగ్ వీ లిన్/చెన్ చెంగ్ కువాన్‌పై గెలిచింది. ఇటీవల ప్రపంచ చాంపియన్‌షిప్‌లో కాంస్యం నెగ్గిన సాత్విక్ ద్వయం ఈ సీజన్‌లో ఓ టోర్నీ ఫైనల్ చేరడం ఇదే మొదటిసారి. టైటిల్ పోరులో ఒలింపిక్స్ రజత పతక విజేత, చైనా జంట లియాంగ్ వీ కెంగ్/వాంగ్ చాంగ్‌తో సాత్విక్ జోడీ అమీతుమీ తేల్చుకోనుంది.


లక్ష్యసేన్

పసిడి పోరుకు మీనాక్షి

ప్రపంచ బాక్సింగ్



లివర్‌పూల్ (ఇంగ్లండ్): ప్రతిష్ఠాత్మక వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో మరో భారత బాక్సర్ స్వర్ణ పతక పోరులో అడుగుపెట్టింది. మహిళల 48 కిలోల విభాగంలో మీనాక్షి హుడా ఫైనల్‌కు దూసుకు పోయింది. శనివారం జరిగిన సెమీఫైనల్లో మీనాక్షి 5-0తో మంగోలియాకు చెందిన లుట్సైఖనీ అల్టాన్‌సెట్సెగెని చిత్తు చేసింది. ఈ పోటీలలో ఫైనల్‌కు చేరిన మూడో భారత్ బాక్సర్ మీనాక్షి. ఇంతకుముందు..జైస్మిన్ లంబోరియా (57 కి.), నూపుర్ షెరాన్ (80+కి.) టైటిల్ ఫైట్‌కు చేరిన సంగతి తెలిసిందే. 80+కి. కేటగిరీ సెమీఫైనల్లో షెరాన్ 5-0తో సెమా డుజ్టస్ (టర్కీ)పై గెలిచింది. దాంతో మీనాక్షి, జైస్మిన్, నూపుర్ కనీసం రజత పతకం ఖాయం చేసుకున్నారు. ఇక మహిళల 80 కిలోల విభాగంలో పూజారాణి సెమీఫైనల్లో ప్రవేశించింది. దాంతో ఆమెకు కనీసం కాంస్య పతకం లభించనుంది. మొత్తంగా..ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో భారత్‌కు నాలుగు పతకాలు ఖాయమయ్యాయి.

సందీప్, ప్రియాంక విఫలం

వరల్డ్ అథ్లెటిక్స్

టోక్యో: ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్‌లో తొలిరోజు భారత్‌కు నిరాశజనక ఫలితాలు ఎదురయ్యాయి. శనివారం జరిగిన 35 కిలో మీటర్ల రేస్‌వాక్‌లో సందీప్ కుమార్, ప్రియాంక గోస్వామి విఫలమయ్యారు. పురుషుల 35 కిలో మీటర్ల రేస్‌వాక్‌లో సందీప్ కుమార్ 23వ స్థానంలో నిలిచాడు. మహిళల 35 కి.మీ. విభాగంలో ప్రియాంక 24వ స్థానంతో సరిపెట్టుకుంది. మరో భారత రేస్ వాకర్ రాంబాబు డిస్‌క్వాలిఫై అయ్యాడు. పురుషుల విభాగంలో కెనడా, బ్రెజిల్, జపాన్, మహిళల కేటగిరీలో స్పెయిన్, ఇటలీ, ఈక్వెడార్ స్వర్ణ, రజత, కాంస్య పతకాలు దక్కించుకున్నాయి. మహిళల 1500 మీటర్ల పరుగులో పూజ 11వ స్థానంలో నిలిచి సెమీస్ చేరడంలో విఫలమైంది. ఇక..మహిళల 100 మీటర్ల స్ప్రింట్‌లో అంతర్జాతీయ స్టార్లు షకారి రిచర్డ్‌సన్, షేరికా జాక్సన్ సెమీస్‌కు చేరారు. పురుషుల 100 మీ.లలో నోవా లైల్స్, కిషానె థాంప్సన్ సెమీఫైనల్లో అడుగుపెట్టారు.

నేటి భారత్ షెడ్యూల్
మ. 3.10: పురుషుల హైజంప్ క్వాలిఫికేషన్స్ - సర్వేశ్,
సా. 6: పురుషుల 10వేల మీటర్ల రేసు - గుల్వీర్ సింగ్.

వారసత్వంగా వచ్చిన ఆభరణాలపై పన్ను పోటు ఉంటుందా?



మన దేశంలోని సంపన్నులు, మధ్య తరగతి వర్గాలకు బంగారు ఆభరణాలు కూడా ప్రధాన ఆస్తే. వీరిలో చాలా మంది తమ తర్వాత లేదా తమ జీవిత కాలంలో తమ ఆభరణాలను వారి కుటుంబ సభ్యులకు బదిలీ చేస్తుంటారు. సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే వారసత్వ ఆభరణాలపైనా పన్ను పోటు తప్పదు. కొద్దిగా జాగ్రత్త పడితే ఈ పన్ను పోటు నుంచి తప్పించుకోవచ్చు. అదెలాగో తెలుసుకుందాం.

మన సంస్కృతి, సంప్రదాయాల్లో బంగారం, బంగారు ఆభరణాలు ఒక భాగం. పిల్లల పెళ్లిళ్ల ఆ మాటకొస్తే మన దేశంలో జరిగే ప్రతి శుభకార్యమూ వీసమెత్తు బంగారమైనా లేకుండా పూర్తి కాదు. చాలా కుటుంబాల్లో బంగారం, వెండి లేదా వాటితో చేసిన ఆభరణాలు ఒక తరం నుంచి మరో తరానికి బదిలీ అవుతుంటాయి. ఇలా వారసత్వంగా వచ్చిన ఆభరణాలను ఎప్పుడో ఒకప్పుడు ఏదో ఒక అవసరం కోసం అమ్మాల్సి రావచ్చు. అప్పుడు ఈ అమ్మకాలపై పన్ను పోటు తప్పదు. అయితే కొన్ని జాగ్రత్తల ద్వారా ఈ పోటు నుంచి బయటపడవచ్చు.

పన్ను ప్రభావం

ఆదాయ పన్ను (ఐటీ) శాఖ వారసత్వంగా సంక్రమించిన బంగారం, వెండి లేదా వాటితో చేసిన ఆభరణాలను 'ఆదాయం'గా పరిగణించదు. కాబట్టి వారసత్వంగా వాటిని అందుకున్న వ్యక్తులపై వెంటనే ఎలాంటి పన్ను పోటు ఉండదు. ఐటీ చట్టంలోని సెక్షన్ 47 (ఐఐఐ), సెక్షన్ 56 (2) (ఎక్స్) ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి.

పన్ను ఎప్పుడు?

వారసత్వంగా వచ్చిన ఆభరణాలను అమ్మినప్పుడు మాత్రమే పన్ను వర్తిస్తుంది. అది కూడా ఆ అమ్మకంపై వచ్చిన మూలధన లాభాల (సీజీటీ) ఆధారంగా నిర్ణయిస్తారు.

పన్ను లెక్కింపు ఇలా

ఎవరి నుంచి ఈ ఆభరణాలు సంక్రమించాయో వారు కొనుగోలు చేసిన ధర లేదా 2001 ఏప్రిల్ 1 కంటే ముందు కొనుగోలు చేసి ఉంటే 2001 ఏప్రిల్ 1 నాటికి ఉన్న సముచిత మార్కెట్ ధర (ఎఫ్‌ఎంవీ), ఆ ఆభరణాలు ఎంత కాలంగా (హోల్డింగ్ పీరియడ్) వాటిని కొన్న వ్యక్తి, వారసుల వద్ద ఉన్నాయనే అంశాల ఆధారంగా ఈ మూలధన లాభాలను స్వల్ప (ఎస్‌టీసీజీ) లేదా దీర్ఘకాలిక మూలధన లాభాలు (ఎల్‌టీసీజీ)గా లెక్కిస్తారు.

పరిగణనలోకి తీసుకునే అంశాలు

● ద్రవ్యోల్బణ వ్యయ సూచీ (సీఐఐ) ఆధారిత ఇండెక్సెడ్ కాస్ట్ ఆఫ్ అక్విజిషన్ (ఐసీఏ)
● 20 శాతం ఎల్‌టీసీజీ+సర్‌చార్జీ+హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ సెస్

ఉదాహరణ: ఆభరణాల అమ్మకం ధర - ఐసీఏ=ఎల్‌టీసీజీ

ఎల్‌టీసీజీ x 20 శాతం (+సర్‌చార్జి) = చెల్లించాల్సిన పన్ను

మూలధన ఆస్తులు అంటే?

మూలధన ఆస్తులు అంటే ఏంటో ఐటీ చట్టంలోని సెక్షన్2 (14) స్పష్టంగా నిర్వచించింది. ఇళ్లు, భూములతో పాటు బంగారం, వెండి, ప్లాటినం లేదా ఏ ఇతర విలువైన లోహాలతో చేసిన ఆభరణాలను కూడా మూలధన ఆస్తులుగానే పరిగణిస్తారు. వీటి అమ్మకాలపై వచ్చే లాభాలనూ మూలధన లాభాలుగానే చూస్తారు. ఏదైనా మిశ్రమ లోహాల్లో బంగారం, వెండి, ప్లాటినం లేదా విలువైన రాళ్లు పొదిగి చేసినా, అవి కూడా ఆభరణాల పరిధిలోకే వస్తాయి.

పన్ను రేటు

గత ఏడాది.. జూలై 2023 కంటే ముందు వారసత్వ ఆభరణాలను మూడేళ్లలోపు అమ్మితే వచ్చిన లాభాలను స్వల్పకాలిక మూలధన లాభాలు (ఎస్‌టీసీజీ)గా పరిగణించి, ఆయా వ్యక్తుల ఆదాయ శ్లాబుల ప్రకారం పన్ను విధించే వారు. మూడేళ్ల కంటే ఎక్కువ కాలం ఉంచుకుని అమ్మితే వచ్చిన లాభాలను ఇండెక్సేషన్ ప్రయోజనంతో కలిపి 20 శాతం చొప్పున దీర్ఘకాలిక మూలధన లాభాల (ఎల్‌టీసీజీ) పన్ను విధించేవారు. అయితే గత ఏడాది జూలై 23 నుంచి ఎల్‌టీసీజీ గడువును రెండేళ్లకు కుదించారు. పన్ను పోటును ఇండెక్సేషన్ బెనిఫిట్ లేకుండా 12.5 శాతానికి తగ్గించారు. వారసత్వంగా వచ్చిన ఆభరణాలను రెండేళ్ల లోపు అమ్మితే వచ్చే స్వల్పకాలిక మూలధన లాభాలపై మాత్రం ఆయా వ్యక్తుల ఆదాయ శ్లాబుల ప్రకారం పన్ను విధిస్తారు.

మినహాయింపులు, పొదుపు ఆప్షన్లు

● ఈ ఆభరణాలను విక్రయించగా వచ్చిన మూలధన లాభాలను ఏడాదిలోగా లేదా బదిలీ జరిగిన రెండేళ్లలోగా నివాస గృహ ఆస్తుల కొనుగోలుకు ఉపయోగిస్తే ఐటీ చట్టంలోని సెక్షన్ 54 ఎఫ్ కింద పూర్తి పన్ను మినహాయింపు పొందవచ్చు. అయితే మన దేశంలోని ఆస్తుల కొనుగోళ్లకు మాత్రమే ఇది వర్తిస్తుంది.
● ఆభరణాలు అమ్మగా వచ్చిన మూలధన లాభాలను మూడేళ్ల లోపు సొంతింటి నిర్మాణానికి వినియోగించినా రూ.10 కోట్ల వరకు ఈ మినహాయింపు లభిస్తుంది.
● ఆభరణాలను అమ్మగా వచ్చిన లాభాల్లో రూ.30 లక్షల వరకు భారత జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) లేదా గ్రామీణ విద్యుదీకరణ సంస్థ (ఆర్ఈసీ) జారీ చేసే క్యాపిటల్ బాండ్స్‌లో మదుపు చేసినా సెక్షన్ 54 ఈసీ కింద పన్ను మినహాయింపు లభిస్తుంది. కాకపోతే ఈ పెట్టుబడిని ఆభరణాలు అమ్మిన ఆరు నెలల్లోగా పూర్తి చేయాలి.

జోరుగా ఐటీ రిటర్న్‌ల ఫైలింగ్

● ఇప్పటి వరకు ఆరు కోట్లకు పైగా రిటర్న్‌లు
● సోమవారమే ఆఖరి రోజు

ఐటీ రిటర్న్‌ల ఫైలింగ్ ప్రక్రియ జోరందుకుంది. 2025-26 అసెస్‌మెంట్ ఇయర్ (ఏవై)కు సంబంధించి ఇప్పటి వరకు ఆరు కోట్లకు పైగా ఐటీ రిటర్న్‌లు దాఖలైనట్టు ఆదాయ పన్ను (ఐటీ) శాఖ శనివారం ప్రకటించింది. వ్యక్తులు, హిందూ అవిభక్త కుటుంబాలు (హెచ్‌యూఎఫ్), ఆడిట్ అవసరం లేని సంస్థలు సోమవారంలోగా పెనాల్టీ లేకుండా తమ ఐటీ రిటర్న్‌లు ఫైల్ చేయవచ్చు. 'ఇప్పటి వరకు ఆరు కోట్లకుపైగా ఐటీ రిటర్న్‌లు ఫైల్ అయ్యాయి. ఫైల్ అయినా రిటర్న్‌లను ఇంకా లెక్కిస్తున్నాం. ఈ మైలురాయిని అందుకునేందుకు సహకరించిన పన్ను చెల్లింపుదారులు, వృత్తి నిపుణులకు కృతజ్ఞతలు' అని ఐటీ శాఖ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్టు చేసింది. రిటర్న్‌ల ఫైలింగ్, పన్ను చెల్లింపులు, ఇతర విషయాల్లో పన్ను చెల్లింపుదారులకు అవసరమైన సాయం అందించేందుకు తమ 'హెల్ప్ డెస్క్' 24 గంటలూ పని చేస్తున్నట్టు ఐటీ శాఖ తెలిపింది. ఇంకా తమ రిటర్న్‌లు ఫైల్ చేయని వ్యక్తులు, సంస్థలు సోమవారం వరకు వేచి చూడకుండా వెంటనే తమ రిటర్న్‌లు ఫైల్ చేయాలని ఐటీ శాఖ కోరింది.

న్యూమోనియా కోసం దేశీయ ఔషధం

ఓర్ఛ్ లైఫ్‌సైన్సెస్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : హైదరాబాద్ కేంద్రంగా ఉన్న ఓర్ఛ్ లైఫ్‌సైన్సెస్ పిల్లల్లో వచ్చే న్యూమోనియా వ్యాధి చికిత్స కోసం దేశీయ పరిజ్ఞానంతో ప్రత్యేక ఔషధాన్ని అభివృద్ధి చేస్తోంది. ఎవోనెమ్-04 పేరుతో అభివృద్ధి చేస్తున్న ఈ ఔషధానికి కేంద్ర ప్రభుత్వ నిర్వహణలోని సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖకు చెందిన టెక్నాలజీ డెవలప్‌మెంట్ బోర్డు (టీడీబీ) రూ.19.5 కోట్లు మంజూరు చేసింది. ప్రీ క్లినికల్ పరీక్షలు పూర్తయిన ఈ ఔషధాన్ని త్వరలోనే మనుషులపై పరీక్షిస్తామని కంపెనీ తెలిపింది. ఎవోనెమ్-04 అనే ఈ యాంటీబయోటిక్ నెబ్యులైజేషన్ సస్పెన్షన్ ఔషధం పిల్లల్లో వచ్చే న్యూమోనియాను తగ్గించడంలో సమర్థవంతంగా పనిచేయడంతో పాటు యాంటీమైక్రోబియల్ రెసిస్టెంట్‌గానూ పని చేస్తుందని కంపెనీ తెలిపింది. మన దేశంతో పాటు అనేక దేశాల్లో పిల్లలను కబళిస్తున్న అనారోగ్య సమస్యల్లో న్యూమోనియా ఒకటి. అందుబాటు ధరలో లభించే తమ ఎవోనెమ్-04 ఔషధం ఈ సమస్యను అధిగమించడంలో సమర్థవంతంగా ఉపయోగపడుతుందని కంపెనీ పేర్కొంది.

బిజినెస్ ప్లస్

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

14వ తేదీ			
హైదరాబాద్	535	విజయవాడ	550
వరంగల్	537	గోదావరి	535
చిత్తూరు	563	విశాఖపట్నం	555
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	121	విజయవాడ	140
వరంగల్	121	గుంటూరు	135
కరీంనగర్	121	ఒంగోలు	135
మహబూబ్‌నగర్	121	చిత్తూరు	125
కర్నూలు	121	నెల్లూరు	130
విశాఖపట్నం	144	అనంతపురం	130
గోదావరి	140		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,11,170 ▼	1,01,900 ▼	1,42,000 ▲
విజయవాడ	1,13,500 ▲	1,07,000 ▲	1,32,800 ▲
విశాఖపట్నం	1,10,510 ▲	1,01,300 ▲	1,43,000 ▲
రాజమండ్రి	1,11,160 ▼	1,01,900 ▼	1,31,600 ▲
ప్రొద్దుటూరు	1,13,300 ▲	1,04,240 ▲	1,32,000 ▲
ముంబై	1,09,707 ▲	1,00,492 ▲	1,28,008 ▲



ఇళయరాజాకు 'భారతరత్న' ఇవ్వాలి

● తమిళనాడు సీఎం స్టాలిన్

'ఇసైజ్ఞాని' ఇళయరాజాకు దేశ అత్యున్నత పురస్కారమైన 'భారతరత్న' అవార్డును ఇవ్వాలని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ కోరారు. ఈ కోరికను ఒక్క తమిళనాడు రాష్ట్ర ప్రజల తరపున కోరడం లేదని, ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఇళయరాజా సంగీత అభిమానుల తరపున కేంద్రాన్ని కోరుతున్నట్టు వెల్లడించారు. ఇళయరాజా చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టి 50 యేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంలో రాష్ట్రప్రభుత్వం తరపున శనివారం రాత్రి చెన్నైలోని నెహ్రూ ఇండోర్ స్టేడియంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సన్మాన గ్రహీత ఇళయరాజా, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్, అగ్ర నటులు కమలహాసన్, రజనీకాంత్, శివకుమార్, ప్రభు, కార్తీ తదితరులు హాజరయ్యారు. ఇళయరాజాను ఘనంగా సన్మానించి, జ్ఞాపికను బహూకరించిన తర్వాత సీఎం స్టాలిన్ ప్రసంగిస్తూ ఒక గొప్ప సంగీత విద్వాంసుడుకి ఈ సన్మానం నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరి జీవితాల్లోని కష్టనష్టాలు, సాధక బాధకాలకు, ప్రేమకు, విరహానికి, లాలించేందుకు, జయాపజయాలకు ఆయన పాటలు అమృతంగా ఉన్నాయన్నారు. ఇళయరాజా కెరీర్‌లో అత్యున్నత పౌర పురస్కారాలు, అవార్డులు, రివార్డులు వచ్చినప్పటికీ తన తండ్రి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఇచ్చిన 'ఇసైజ్ఞాని' బిరుదు చిరస్థాయిగా నిలిచిపోవడమే కాదు అదే ఒక పేరుగా మారిపోయిందన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరపున వర్ధమాన సంగీత కళాకారుల కోసం యేటా 'ఇళయరాజా' పేరున అవార్డులను ప్రభుత్వం ఇస్తుందన్నారు. సూపర్‌స్టార్ రజనీకాంత్ మాట్లాడుతూ... ఇళయరాజా స్నేహానికి అమితమైన విలువ ఇస్తారన్నారు. తన సోదరుడు, భార్య, కుమార్తె చనిపోతే చలించని, కన్నీరు కార్చని ఇళయరాజా... తన స్నేహితుడు ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం చనిపోతే దుఃఖించారని గుర్తు చేశారు.

చెన్నై(ఆంధ్రజ్యోతి)

ఘనవిజయం సాధిస్తుంది

మంచు మనోజ్



మంచు లక్ష్మి ప్రధాన పాత్రధారిగా వంశీకృష్ణ మల్లా తెరకెక్కించిన చిత్రం 'దక్ష'. 'ద డెడ్లీ కాన్సిరసీ' ఉపశీర్షిక. శ్రీలక్ష్మి ప్రసన్న పిక్చర్స్, మంచు ఎంటర్టైన్‌మెంట్స్ సంయుక్తంగా నిర్మించాయి. మోహన్‌బాబు కీలక పాత్రను పోషించారు. ఈనెల 19న సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన రిలీజ్ ప్రెస్‌మీట్‌కు ముఖ్యఅతిథిగా విచ్చేసిన మంచు మనోజ్ మాట్లాడుతూ 'నాన్న మోహన్‌బాబు, అక్క లక్ష్మీ నటించిన ఈ సినిమా మీ అందర్నీ ఆకట్టుకుంటుంది. సినిమా ఘనవిజయం సాధిస్తుంది అనే నమ్మకం ఉంది. ఈ నెలలో విడుదలైన కొన్ని చిత్రాలు విజయపథంలో దూసుకుపోవడం తెలుగు చిత్రసీమ సంతోషించే విషయం' అని అన్నారు. మంచు లక్ష్మి మాట్లాడుతూ 'ఇందులో నాన్న మోహన్‌బాబు పోషించిన పాత్ర సినిమాకే హైలైట్' అని తెలిపారు. వంశీకృష్ణ మల్లా మాట్లాడుతూ 'ఇదో డిఫరెంట్ థ్రిల్లర్. అందరికీ నచ్చుతుంది' అని చెప్పారు.

ప్రేక్షకులు గుండెల్లో పెట్టుకున్నారు



తేజ సజ్జ

'ప్రేక్షకులు 'మిరాయ్' సినిమాను తమ గుండెల్లో పెట్టుకున్నారు. వారు సోషల్ మీడియాలో రీల్స్ చేస్తూ ప్రోత్సహించడం చూస్తుంటే ఆనందంగా ఉంది. దర్శకుడు కార్తీక్ కష్టం, నిర్మాత టీజీ విశ్వప్రసాద్ విజన్ వల్లే ఇంత పెద్ద విజయం సాధ్యమైంది. మనోజ్ నటన సినిమాను మరో మెట్టు పైన నిలబెట్టింది. వీఎఫ్‌ఎక్స్‌కు కూడా మంచి ప్రశంసలు దక్కుతున్నాయి. సినిమా ఆరంభంలో ప్రభాస్ తన గొంతుతో కథను పరిచయం చేసిన తీరు ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంది' అని తేజ సజ్జ అన్నారు. ఆయన కథానాయకుడిగా నటించిన 'మిరాయ్' చిత్రం ఇటీవలే విడుదలైంది. పాన్ ఇండియా స్థాయిలో ఈ చిత్రానికి చక్కని ఆదరణ లభిస్తోందని యూనిట్ తెలిపింది. చిత్రబృందం శనివారం సక్సెస్‌మీట్‌ను నిర్వహించింది. ఈ సందర్భంగా మంచు మనోజ్ మాట్లాడుతూ 'ఇది నాకు దాదాపు 12 ఏళ్ల తర్వాత వచ్చిన సక్సెస్. అభినందిస్తూ వచ్చే కాల్స్‌తో నా ఫోన్ నిరంతరం మోగుతూనే ఉంది. ఈ కథలో భాగం చేసినందుకు కార్తీక్‌కు రుణపడి ఉంటాను' అని చెప్పారు. కార్తీక్ మాట్లాడుతూ 'ఈ సినిమా కోసం టీమ్ అంతా నాలుగేళ్లు కష్టపడ్డాం. నాపైన నమ్మకం ఉంచిన విశ్వప్రసాద్‌కి ధన్యవాదాలు' అని అన్నారు. టీజీ విశ్వప్రసాద్ మాట్లాడుతూ 'గతేడాది మాకు అంతగా కలసిరాలేదు. 'మిరాయ్' సక్సెస్ మరెన్నో మంచి చిత్రాలు చేసేందుకు ఎనర్జీ ఇచ్చింది. కార్తీక్, తేజ కమిట్మెంట్‌తో పనిచేశారు. మా అమ్మాయి కృతి ప్రసాద్ ఈ సినిమాతో నిర్మాతగా మారారు. తను మా అదృష్ట దేవత' అని ప్రశంసించారు.












PARAS







సమావేశంలో పాల్గొన్న సీఎస్ విజయానంద్, మంత్రులు, బీసీ జనార్దన్ రెడ్డి, అనగాని, సవిత, టీజీ భరత్, సంధ్యారాణి, దుర్గేష్, గొట్టిపాటి

"గత ఐదేళ్ల వైసీపీ పాలనలో గాడి తప్పిన వ్యవస్థలను, ఆర్థికరంగాన్ని ఇప్పుడిప్పుడే పట్టాలు ఎక్కిస్తున్నాం. ఇక పాలనలో వేగం పెంచాల్సిన అవసరం ఉంది. దీనికోసం జిల్లాలకు కొత్త టీమ్‌లను ఏర్పాటు చేశాం. మంత్రులు మరింత సమర్థవంతంగా, ప్రభావవంతంగా పనిచేయాలి. ప్రభుత్వ ప్రాధాన్యాల గురించి కలెక్టర్లు, ఎస్పీలతో ముఖాముఖి మాట్లాడుతున్నాను. అందరం టీమ్‌గా రాష్ట్రాభివృద్ధిపై దృష్టి సారిద్దాం" - చంద్రబాబు

వేగం పెంచుదాం!

(మొదటి పేజీ తరువాయి)

చంద్రబాబు సమావేశమయ్యారు. మంత్రులు తమ శాఖలపై పూర్తి అవగాహనతో ఈ సమావేశాలకు రావాలని ఈ సందర్భంగా సీఎం నిర్దేశించారు. "జీఎస్‌డీపీ (రాష్ట్ర స్థూల ఉత్పత్తి) కొన్ని జిల్లాల్లో పెరుగుతోంది. కొన్ని జిల్లాల్లో తగ్గుతోంది. ఈ హెచ్చుతగ్గులను సరిచేయాల్సిన బాధ్యత అందరిపై ఉంది. ఆయా శాఖలు చూసే మంత్రులు, కార్యదర్శులు కలిసి పనిచేస్తే మంచి ఫలితాలు వస్తాయి." అని ఆయన అన్నారు. రాష్ట్ర ఆదాయాన్ని పెంచేందుకు మూడో తరం సంస్కరణలపై దృష్టి పెట్టాలని సూచించారు. "రాష్ట్రంలో విప్లవాత్మకమైన పాలనను అందిద్దాం. ఇందుకోసం ఏడు పరిపాలనా గ్రూపులను ఏర్పాటు చేయాలి. ఇందులో వ్యవసాయం తదితర మౌలిక విభాగాలు, పరిశ్రమలు, సేవలు, యువజన వ్యవహారాలు-పర్యాటకం, రెవెన్యూ, శాంతిభద్రతలు, ఐటీ ఉంటాయి." అని వివరించారు.

చెప్పిందే చెప్పడం వద్దు.. క్లుప్తత పాటించాలి..

కలెక్టర్ల సదస్సులో చెప్పిందే చెప్పడం కాకుండా.. క్లుప్తంగా అవసరమైన సమాచారం అందించడానికి పరిమితం కావాలని మంత్రులు, శాఖల కార్యదర్శులను సీఎం కోరారు. "సంక్షేమ రంగాన్ని విద్యారంగంతో కలపవద్దు. మంత్రులు తమ శాఖలపై పూర్తి అవగాహనతో రావాలి.. శాఖలకు సంబంధించిన సమాచారంపై పూర్తి పట్టు కలిగి సదస్సులో మాట్లాడాలి. కలెక్టర్ల ద్వారా ప్రభుత్వ విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్లేలా మంత్రులు ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ఉండాలని సూచించారు.

మరీ అంత ప్రజంటేషన్ అక్కర్లేదు..

శాఖలవారీ సమాచారాన్నంతటినీ రెండురోజుల్లోనే చెప్పేయాలన్న ఆత్రుత అవసరం లేదని కార్యదర్శులకు సీఎం సూచించారు. "పవర్ పాయింట్ ప్రజెంటేషన్లలో ఆరు నుంచి పది దాకా స్లయిడ్లు ఇస్తున్నారు. ఈ ఆలోచనా విధానం వదిలేయాలి. ఒకటి లేదా రెండు స్లయిడ్లలోనే క్లుప్తంగా తమ శాఖకు సంబంధించిన వివరాలు అందించాలి. ప్రధానంగా సంక్షేమ రంగానికి ప్రాధాన్యం ఇవ్వాలి. సాంఘిక, గిరిజన సంక్షేమ రంగాలకు ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యాలు, కార్యక్రమాలను గురించి వివరించేలా పవర్ పాయింట్ ప్రజెంటేషన్లు ఉండాలి. ఒక రంగాన్ని మరో రంగంతో ముడిపెట్టవద్దు." అని తెలిపారు. ఈమేరకు కలెక్టర్ల సదస్సు ఎజెండాలో మార్పులూచేర్పులూ చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్‌ను ముఖ్యమంత్రి ఆదేశించారు. అన్ని స్థాయిల్లో అధికారులకు ఎప్పటికప్పుడు కొత్త విషయాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని, వారికి శిక్షణ తరగతులు నిర్వహించాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. దీనికోసం హెచ్‌ఆర్‌డీని (మానవ వనరుల అభివృద్ధి విభాగం) తాత్కాలికంగా అమరావతిలో సిద్ధమవుతున్న సీఆర్డీయే భవనంలోని ఒక అంతస్తులో ఏర్పాటు చేయాలని తీర్మానించారు. వచ్చే నెల రెండోతేదీన ఈ భవనం అందుబాటులోకి వస్తుందని, అదే రోజు హెచ్‌ఆర్‌డీ కేంద్రాన్ని కూడా ప్రారంభించాలని నిర్ణయించారు.

పాలనలో ప్రజా సంతృప్తే కీలకం

ప్రభుత్వం అందిస్తున్న పౌరసేవలతోపాటు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజల్లో సంతృప్తే ముఖ్యమని సీఎం పేర్కొన్నారు. దానికి అనుగుణంగానే మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పనిచేయాలని ఆదేశించారు. "ఈ ఏడాది మొదటి త్రైమాసికంలో 10.5 శాతం వృద్ధిరేటు సాధించాం. 2029 నాటికి జీఎస్డీపీ రూ.29 లక్షల కోట్లకు చేరాలని లక్ష్యంగా పెట్టుకుని పనిచేయాలి. గత ప్రభుత్వం హయాంలో 3 శాతం వృద్ధి తగ్గిన కారణంగా రాష్ట్రం సుమారుగా రూ.6 లక్షల కోట్ల సంపద కోల్పోయింది." అని తెలిపారు. ప్రతి త్రైమాసికానికి ఒకసారి చొప్పున ఐదేళ్లలో 25 కలెక్టర్ల సదస్సులు నిర్వహిస్తామని చెప్పారు.

విభిన్నంగా నిర్వహిద్దాం..

ఈసారి జిల్లా కలెక్టర్ల సదస్సును విభిన్నంగా నిర్వహించాలని సీఎం ఆదేశించారు. పౌరసేవలు, పథకాల అమలుపై జిల్లాలవారీగా జవాబుదారీతనం ఉండేలా సదస్సు నిర్వహించనున్నామని, ఎనిమిది అంశాలపై సమీక్షిస్తామని తెలిపారు. నేపాల్‌లో చిక్కుకుపోయిన తెలుగువారిని ఆర్టీజీఎస్ ద్వారా వెనక్కి తీసుకొచ్చే ఆపరేషన్ విజయవంతమైందన్న సీఎం...మంత్రి లోకేశ్‌సహా అధికారుల కృషిని అభినందించారు. ఆర్బిట్రేషన్ (మధ్యవర్తిత్వం) ద్వారా వివాదాలను పరిష్కరించుకోవడంపై దృష్టి సారించాలని సూచించారు. మూడో తరం సంస్కరణలపై మరింత అధ్యయనం చేసేందుకు మంత్రులు, అధికారులతో కమిటీవేయాలని సీఎం ఆదేశించారు.

కలెక్టర్ల సదస్సు షెడ్యూల్..

కలెక్టర్ల సదస్సు మొదటి రోజు జీఎస్డీపీ, సంక్షేమం, సూపర్ సిక్స్ అన్న క్యాంటీన్లు, పీ4 అంశాలతోపాటు లాజిస్టిక్స్, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు సంబంధించిన ప్రజంటేషన్; స్వచ్ఛాంధ్ర, సర్క్యులర్ ఎకానమి, పంచాయతీరాజ్, మున్సిపల్ తదితర అంశాలు ఉంటాయి. రెండో రోజు... మానవ వనరుల అభివృద్ధి, వైద్యఆరోగ్యం, విద్య, స్కిల్ డెవలప్‌మెంట్, ఐటీ, క్వాంటమ్ వ్యాలీ, వాట్సాప్ గవర్నెన్స్, డేటాలేక్, ఏఐ తదితర అంశాలతోపాటు, రెవెన్యూ విభాగంలో భూములు, ఎక్సైజ్, వాణిజ్య పన్నులు, మైనింగ్, ట్రాన్స్‌పోర్టు తదితర అంశాలు ఉంటాయి. రాష్ట్రంలో శాంతిభద్రతలపై ఎస్పీలు, కలెక్టర్లతో సమీక్షిస్తామని ముఖ్యమంత్రి తెలిపారు.

పీయూశ్ కుమార్‌కు అభినందన..

రాష్ట్రంలో జీఎస్టీ వసూళ్లు పెరగడంపై ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి (ఫైనాన్స్) పీయూశ్‌కుమార్‌ను సీఎం చంద్రబాబు అభినందించారు. రాష్ట్రంలో ప్రజలకు సులభతరమైన పాలనా విధానాన్ని అందుబాటులోకి తెద్దామని నిర్దేశించారు. ఇప్పటికే ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే పని లేకుండా వాట్సాప్ గవర్నెన్స్‌ను అందరికీ అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. దీనిపై ప్రజల్లో మరింత అవగాహన పెంచాలని కోరారు.

ఆటో డ్రైవర్లకు దసరా కానుక

15 వేలు చొప్పున ఆర్థిక సాయం

- 17 నుంచి దరఖాస్తుల స్వీకరణ
- 24న తుది జాబితా సిద్ధం
- 1న అర్హుల ఖాతాల్లో నగదు జమ
- ఉత్తర్వులు విడుదల చేసిన ప్రభుత్వం

అమరావతి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఆటో డ్రైవర్లకు దసరా కానుక అందించడానికి రంగం సిద్ధమైంది. వీరికి ఒక్కొక్కరికి ఏటా రూ.15వేలు చొప్పున ఆర్థిక సాయాన్ని ప్రకటించిన ప్రభుత్వం అందుకు అనుగుణంగా శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆటో, క్యాబ్ యజమానులకు, డ్రైవర్‌గా స్వయం ఉపాధి పొందుతున్నవారు అందరికీ ఈ పథకాన్ని వర్తింపజేయనున్నట్లు రవాణా శాఖ విడుదల చేసిన జీవోలో పేర్కొంది. ఈ నెల 13 నాటికి ఉన్న పాత లబ్ధిదారుల జాబితాను పరిగణించడంతో పాటు కొత్త దరఖాస్తులకు 17 నుంచి 19వ తేదీ వరకూ అవకాశం కల్పించింది. క్షేత్ర పరిశీలన 22లోపు పూర్తిచేసి 24న తుది జాబితా సిద్ధం చేస్తారు. అర్హులైన లబ్ధిదారులకు అక్టోబరు 1న సీఎం చంద్రబాబు ఖాతాల్లోకి నేరుగా డబ్బులు జమ చేస్తారని ఉత్తర్వుల్లో తెలిపారు. బ్రాహ్మణ, కాపు, కమ్మ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, క్రైస్తవ, ఈబీసీ, క్షత్రియ కార్పొరేషన్ల నుంచి ఆటో, క్యాబ్ డ్రైవర్లకు డబ్బులు చెల్లిస్తారు. ఆగస్టు 15 నుంచి మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే స్త్రీ శక్తి పథకాన్ని అమలు చేశారు. దీనివల్ల తమ జీవనోపాధికి ఇబ్బంది కలుగుతోందంటూ ఆటో, క్యాబ్ డ్రైవర్లు ప్రభుత్వానికి విన్నవించడంతో వారికి ఆర్థిక సాయం అందిస్తామని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. ఇప్పటి వరకూ ఉన్న లెక్కల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2.90 లక్షల మంది ఆటో, క్యాబ్ డ్రైవర్లు ఈ పథకానికి అర్హులని రవాణా శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. వీరికి ఒక్కొక్కరికి రూ.15 వేలు చొప్పున మొత్తం రూ.435 కోట్ల మేర లబ్ధి చేకూరనుంది.



ఎవరికి వర్తిస్తుందంటే..

ఆటో, క్యాబ్ యజమానే డ్రైవర్‌గా ఉండాలి. ఇతర గూడ్స్ వాహనాలకు ఈ పథకం వర్తించదు. ఆధార్, తెల్లరేషన్ కార్డు కలిగి ఉన్న కుటుంబంలో ఒక్క వాహనానికి మాత్రమే నగదు జమ చేస్తారు. కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగులున్నా, ఆదాయపు పన్ను చెల్లించేవారున్నా, నెలవారీ విద్యుత్తు వినియోగం 300 యూనిట్లు దాటినా, పట్టణ ప్రాంతాల్లో వెయ్యి చదరపు అడుగులకు మించి స్థిరాస్తి ఉన్నా పథకానికి అర్హులు కాబోరని ప్రభుత్వం స్పష్టం చేసింది.

కొండలా ఫీజు బకాయిలు!

- ఆరు క్వార్టర్ల ఫీజుల చెల్లింపు పెండింగ్
- వైసీపీ హయాంలో 3... ఇప్పుడు మూడు
- 4,200 కోట్ల మేర పేరుకుపోయిన వైనం
- సర్టిఫికెట్ల జారీలో విద్యార్థులకు తిప్పలు
- ఫీజులు కడితేనే ఇస్తామంటున్న కాలేజీలు
- వర్సిటీలూ అంతే.. పట్టించుకోని ఉన్నతాధికారులు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఉన్నత విద్యాశాఖలో ఫీజుల బకాయిలు అంతకంతకూ పెరిగిపోతున్నాయి. రాష్ట్రంలో ప్రభుత్వం మారినప్పుడు రూ.2 వేల కోట్లకు పైగా ఉన్న బకాయిలు.. ఇప్పుడు రూ.4 వేల కోట్లు దాటాయి. గత వైసీపీ సర్కార్ మూడు క్వార్టర్ల ఫీజులు పెండింగ్ పెట్టగా, కూటమి ప్రభుత్వం మరో మూడింటికి బకాయి పెట్టింది. దీంతో మొత్తం ఆరు క్వార్టర్లతో బకాయిలు గతంలో ఎన్నడూ లేని స్థాయిలో కొండలా పెరిగాయి. ఫలితంగా విద్యార్థులకు ఫీజుల కష్టాలు పెరిగాయి.

క్వార్టర్‌కు రూ.700 కోట్లు

ప్రభుత్వం ప్రతి సంవత్సరం నాలుగు విడతల్లో ఫీజులు విడుదల చేస్తుంది. ఒక్కో క్వార్టర్‌కు సుమారు రూ.700 కోట్లు చొప్పున చెల్లించాలి. ఆరు క్వార్టర్లకు రూ.4,200 కోట్ల మేర బకాయిలు పేరుకుపోయాయి. వైసీపీ ప్రభుత్వంలో ఎప్పుడూ సకాలంలో ఫీజులు చెల్లించలేదు. ప్రతిసారీ కనీసం మూడు క్వార్టర్లు పెండింగ్ పెట్టేది. ప్రభుత్వం మారే నాటికి 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి మూడు క్వార్టర్లు పెండింగ్‌లో ఉన్నాయి. వైసీపీ హయాంలో విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ చేసేవారు. దీనివల్ల ముందే తమకు ఫీజులు కట్టాలని కాలేజీలు ఒత్తిడి చేసి మరీ విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేసేవి. దీంతో విద్యార్థుల ఇబ్బందులను గుర్తించిన కూటమి ప్రభుత్వం పాత విధానాన్ని పునరుద్ధరించింది. విద్యార్థులకు సంబంధం లేకుండా నేరుగా కాలేజీలకు ఫీజులు ఇచ్చే విధానం తీసుకొచ్చింది. అయితే 2024-25 విద్యా సంవత్సరంలో కాలేజీలకు మొదటి క్వార్టర్ ఫీజులు మాత్రమే విడుదల చేశారు.

ఆ ఫీజులు ఎవరి ఖాతాలోకి?

2024-25 నుంచి ఫీజులు నేరుగా కాలేజీలకే విడుదల చేస్తున్నా.. అంతకుముందటి మూడు క్వార్టర్ల ఫీజులు విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ చేయాల్సి ఉంది. అనేక మంది విద్యార్థులు అప్పట్లోనే సొంత డబ్బు చెల్లించగా.. కొందరు విద్యార్థులు ఇంకా కట్టాల్సి ఉంది. దీంతో ఇప్పుడు ఆ ఫీజులను తల్లుల ఖాతాల్లోనే వేయాలా? కాలేజీలకు విడుదల చేయాలా? అనేది అయోమయంగా మారింది. కాలేజీలకు విడుదల చేస్తే ఇప్పటికే కొందరు విద్యార్థులు చెల్లించినందున, యాజమాన్యాలు వారికి తిరిగిస్తాయా అనే అనుమానం ఉంది. ఒకవేళ తల్లుల ఖాతాల్లో జమ చేస్తే కోర్సు పూర్తి చేసుకుని బయటకు వెళ్లిపోయిన విద్యార్థులు కాలేజీలకు చెల్లిస్తారా? అనేది మరో సందేహం. దీనిపై ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టత రాలేదు.

సర్టిఫికెట్ల కోసం అప్పులు

ప్రభుత్వాలు సకాలంలో ఫీజులు ఇవ్వకపోవడం విద్యార్థులకు శాపంగా మారింది. ఫీజుల పెండింగ్‌తో ఆయా కుటుంబాలపై భారం పెరిగింది. ఫీజు కడితేనే సర్టిఫికెట్లు ఇస్తామని ప్రైవేటు కాలేజీలు తెగేసి చెబుతున్నాయి. సర్టిఫికెట్ల జారీ ఆపకూడదని ఉన్నత విద్యాశాఖ ఆదేశాలు జారీచేసినా యాజమాన్యాలు బేఖాతరు చేస్తున్నాయి. అధికార పార్టీ నేతలకు చెందిన కాలేజీల్లోనూ ఇదే పరిస్థితి. దీంతో అప్పులు చేసి మరీ విద్యార్థులు ఫీజులు కట్టి సర్టిఫికెట్లు తీసుకుంటున్నారు. ఆ స్తోమత లేని వారు సర్టిఫికెట్లు తీసుకోకుండా అక్కడే వదిలేశారు.

పీజీ కోర్సుల్లో చేరేందుకు పాట్లు

ఓవైపు ప్రైవేటు కాలేజీలు ఫీజులు కట్టాలని విద్యార్థులను ఒత్తిడి చేస్తుంటే ప్రభుత్వ అధీనంలోని యూనివర్సిటీ కాలేజీలు కూడా ప్రభుత్వ ఆదేశాలను పట్టించుకోవట్లేదు. ప్రభుత్వం ఇవ్వకపోయినా తమకు ఫీజులు కడితేనే సర్టిఫికెట్లు ఇస్తామని వర్సిటీల అధికారులు విద్యార్థులకు స్పష్టం చేశారు. పీజీ కోర్సుల్లో చేరేందుకు డిగ్రీ, బీటెక్ పూర్తిచేసిన విద్యార్థులు వర్సిటీల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేదు. ఈ విషయం ప్రభుత్వం దృష్టికి వెళ్లినా ఉన్నతాధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. ఓ విద్యార్థికి సర్టిఫికెట్ ఇవ్వాలని స్వయంగా మంత్రి లోకేశ్ పేషీ అధికారులు చెప్పినా నాగార్జున యూనివర్సిటీ అధికారులు లెక్క చేయలేదు. చివరికి ఆ విద్యార్థి అప్పుచేసి ఫీజు చెల్లించి సర్టిఫికెట్ తీసుకోవాల్సి వచ్చింది.



ఫ్యాక్టరీ పెట్టనున్న ప్రాంతానికి సమీపంలోని హౌసింగ్ బోర్డు కాలనీ



విశాఖ పరిధిలో సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేసే భూములు

ఇళ్ల మధ్య సిమెంట్ ఫ్యాక్టరీ!

విశాఖలో 1,000 కోట్లతో అదానీ ప్లాంటు.. 20 వేల మందిపై కాలుష్య ప్రభావం

- దూరంగా పారిశ్రామిక ప్రాంతానికి తరలించాలని స్థానికుల వినతి

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి విశాఖ జిల్లాలో సిమెంట్ ఫ్యాక్టరీలు అనేకం ఉన్నాయి. అనకాపల్లి జిల్లా బయ్యవరం సమీపాన రామ్ కో, సాగర్ సిమెంట్స్ ఎలమంచిలి వద్ద షై హోమ్ తదితర కంపెనీలు సిమెంట్‌ను ఉత్పత్తి చేస్తున్నాయి. ఇవి నివాస ప్రాంతాలకు దూరంగా పారిశ్రామిక ప్రాంతంలో ఉన్నాయి. సిమెంట్ ఫ్యాక్టరీలను జనావాసాలకు దూరంగా ఏర్పాటు చేయాలి. కానీ అదానీ సంస్థ పెదగంట్యాడలో నివాసాలకు దగ్గరగా ఏర్పాటు చేయాలని నిశ్చయించింది. గాజువాక, పెదగంట్యాడ ప్రాంతాలను మరింత కాలుష్యంతో ముంచెత్తడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. ఇది అక్కడ అందరిలోనూ ఆందోళన కలిగిస్తోంది. గంగవరం పోర్టును హస్తగతం చేసుకున్న అదానీ కంపెనీ ఇక్కడ కాలుష్యం పెంచి, ఉత్పత్తిని ఇతర రాష్ట్రాలకు తన పోర్టు ద్వారా ఎగుమతి చేసుకోవడానికి ప్రణాళిక సిద్ధం చేసింది. దీనిపై వచ్చే నెల 8వ తేదీన ప్రజాభిప్రాయ సేకరణ చేయాలని ఏపీ కాలుష్య నియంత్రణ మండలి నిర్ణయించింది. పెదగంట్యాడ గ్రామం సర్వే నంబర్లు 97పీ, 98, 99పీ, 101పీలలో సుమారు 20 ఎకరాల్లో సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు జిల్లా అధికార యంత్రాంగానికి ప్రతిపాదనలు వచ్చాయి. గుజరాత్‌లో అదానీకి అనుబంధ సంస్థ అయిన అంబుజా సిమెంట్స్ లిమిటెడ్ పేరుతో దీనిని పెడుతున్నారు. దీనిని వారు 'గంగవరం సిమెంట్ గ్రైండింగ్ యూనిట్'గా వ్యవహరిస్తున్నారు. వేయి కోట్ల రూపాయల పెట్టుబడి పెడుతున్నట్టు నివేదించారు. ఏడాదికి రెండు యూనిట్ల ద్వారా 40 లక్షల టన్నుల సిమెంట్ ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇది స్లాగ్ సిమెంట్ అని, ఎన్‌టీపీసీ, హిందూజా పవర్ ప్లాంట్ల నుంచి ఫ్లైయాష్ తీసుకొని దాంతో సిమెంట్ ఉత్పత్తి చేస్తారని అధికార వర్గాల సమాచారం. ఎన్‌టీపీసీ, హిందూజా థర్మల్ విద్యుత్ కేంద్రాల వల్ల, వాటి నుంచి వచ్చే ఫ్లైయాష్‌తో పాలవలస, దాసరిమెట్ట, పిట్టవానిపాలెం, చేపలపాలెం తదితర గ్రామాల ప్రజలు ఇప్పటికే కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఇప్పుడు అక్కడి నుంచి ఆ ఫ్లైయాష్‌ను నిత్యం లారీలతో తీసుకువచ్చి పెదగంట్యాడలో నిల్వ చేసి, గ్రైండింగ్ యూనిట్ల ద్వారా సిమెంట్ తయారు చేస్తారు. దీంతో కాలుష్యం మరింత పెరుగుతుంది. ఏడాదికి 40 లక్షల టన్నుల సిమెంట్‌ను లారీల ద్వారా తరలిస్తారు. దీనివల్ల విపరీతమైన ధూళి రేగుతుంది.

పరిసరాల్లో అన్నీ కాలనీలే

అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ పెట్టే స్థలానికి దగ్గరగా అనేక కాలనీలు ఉన్నాయి. అందులో ప్రధానమైనది హౌసింగ్ బోర్డు కాలనీ. అందులో 1,500 కుటుంబాలు ఉన్నాయి. అలాగే దాని పరిసరాల్లో ఉప్పర కాలనీ, వడ్లపూడి, అగనంపూడి, దువ్వాడ, గంగవరం ఆర్‌హెచ్ కాలనీలు ఉన్నాయి. మొత్తంగా సుమారుగా 20 వేల మంది జనాభా ఈ పరిశ్రమ కాలుష్య ప్రభావానికి గురవుతారు. ఇలాంటి ఫ్యాక్టరీలు పారిశ్రామిక ప్రాంతాల్లో పెట్టాలి. కానీ నివాసాలకు దగ్గరగా పెడుతున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని, మనుగడను దృష్టిలో ఉంచుకొని ఈ కంపెనీని దూరంగా పారిశ్రామిక ప్రాంతానికి తరలించాలని పెదగంట్యాడ ప్రాంత ప్రజలు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో
జూడాలపై విద్యార్థుల దాడి

- ముగ్గురు వైద్యులకు గాయాలు
- మద్యం మత్తులో ఇంజనీరింగ్ స్టూడెంట్లు
- ఆరుగురిపై కేసు నమోదు

చిత్తూరు రూరల్, అమరావతి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో విధుల్లో ఉన్న జూనియర్ డాక్టర్ల (జూడాల)పై నగరంలోని ఓ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు దాడికి పాల్పడ్డారు. శుక్రవారం అర్ధరాత్రి దాటిన తరువాత సుమారు 15 మంది విద్యార్థులు చిత్తూరు ఆసుపత్రి అత్యవసర విభాగానికి వచ్చారు. అంతా మద్యం మత్తులో ఉన్నారు. తమ స్నేహితుడి చేతికి దెబ్బ తగిలింద చూడాలంటూ కోరారు. డ్యూటీలోని వైద్యుడు పరిశీలించి స్కానింగ్ చేయించాలని చెప్పాడు. స్కానింగ్ కేంద్రం వద్దకెళ్లిన వారు అక్కడ డ్యూటీలో ఉన్న రేడియాలజిస్ట్‌తో అసభ్యకరంగా ప్రవర్తించారు. రిపోర్టు తీసుకుని అత్యవసర విభాగానికి వచ్చిన విద్యార్థులు అక్కడి వైద్యులపై అసభ్యంగా వ్యాఖ్యానిస్తూ, అరుస్తూ గొడవ చేశారు. మిగిలిన రోగులకు అసౌకర్యమంటూ దెబ్బ తగిలిన వ్యక్తి వద్ద ఒక్కరుండి మిగిలినవారు బయట వేచి ఉండాలని వైద్యుడు సూచించారు. దీంతో మత్తులో ఉన్న విద్యార్థులు తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. మమ్మల్నే బయట ఉండాలంటావా? అంటూ ఆ వైద్యుడిపై వారు దాడి చేసి గాయపరిచారు. అంతటితో ఆగకుండా మరో ఇద్దరు డాక్టర్లపైనా దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనతో చికిత్స పొందుతున్న రోగులు భయాందోళనతో పరుగులు తీశారు. ఈ ఘటనపై జూడాలు శనివారం ఆందోళనకు దిగారు. విధులను బహిష్కరించారు. పోలీసులు దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేస్తామంటూ సర్ది చెప్పడంతో జూడాలు శాంతించారు. ఆమేరకు రెండో పట్టణ పోలీసులు ఆరుగురిపై కేసు నమోదు చేశారు.

వైద్యులపై దాడిని ఖండించిన మంత్రి సత్య

చిత్తూరు ప్రభుత్వాసుపత్రిలో వైద్యులు, సిబ్బందిపై దాడికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మంత్రి సత్యకుమార్ స్పష్టం చేశారు. శుక్రవారం అర్ధరాత్రి విధులు నిర్వహిస్తున్న వారిపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. సిబ్బంది వ్యవహారశైలిలో లోపాలేమైనా ఉంటే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని, భౌతిక దాడులకు పాల్పడడం తగదని మంత్రి పేర్కొన్నారు.

జనావాసాల్లో ఏనుగు హల్‌చల్

- అటవీ సిబ్బందిపై దాడి.. ఇద్దరికి గాయాలు!
- చిత్తూరు జిల్లా గంగవరంలో ఘటన
- క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశాలు



అటవీ శాఖ అధికారిపై దాడి చేస్తున్న ఏనుగు

గంగవరం/అమరావతి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా పలమనేరు పట్టణ పరిసరాల్లోని గంగవరంలో శనివారం ఓ ఏనుగు హడలెత్తించింది. చిరుతపల్లి అటవీ ప్రాంతం నుంచి జనావాసాల్లోకి వచ్చిన ఆ ఏనుగు ఓ అటవీశాఖ అధికారిపై దాడి చేసి గాయపరిచింది. మరో ఏనుగుల ట్రాకర్‌కు కూడా గాయాలైనట్లు సమాచారం. మంద నుంచి విడిపోయిన ఏనుగు.. తెల్లవారుజాము 4 గంటలకు గంగవరం పోలీస్‌స్టేషన్ వద్ద ప్రత్యక్షమైంది. గంటసేపు అక్కడే తిరుగుతూ జనావాసాల మధ్యకు చేరుకుంది. సమాచారం అందుకొన్న అటవీ అధికారులు ట్రాకర్లతో కలిసి అక్కడకు చేరుకున్నారు. టపాకాయలు పేల్చుతూ ఏనుగును అడవి వైపు మళ్లించే ప్రయత్నం చేశారు. దీంతో పరుగులు తీసిన ఏనుగు.. చుట్టూ నివాసాలుండడంతో అడవిలోకి వెళ్లలేక, రోడ్డు పక్కన ఆపి ఉన్న కారును ధ్వంసం చేసి డ్రైవర్స్ కాలనీ వైపు వెళ్లింది. పాత కీలపట్ల రోడ్డులో ముందుకెళ్తూ జన సందోహాన్ని గమనించి ట్రాకర్లు, అటవీ అధికారులపైకి దూసుకొచ్చింది. దీంతో వారంతా పరుగులు తీస్తుండగా.. ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ సుకుమార్ కాలుజారి కింద పడి ఏనుగుకు చిక్కాడు. సుకుమార్‌పై దాడికి దిగిన ఏనుగును ట్రాకర్లు పెద్దగా కేకలు వేసి తరిమేశారు. తీవ్రంగా గాయపడిన సుకుమార్‌ను ఆస్పత్రికి తరలించారు. గంటావూరు వద్ద ఓ లేగదూడపై కూడా ఏనుగు దాడి చేసి గాయపరిచింది. అటవీశాఖ అధికారులు, ట్రాకర్లు, పోలీసులు 7 గంటల పాటు శ్రమించి.. ఏనుగును అడవిలోకి మళ్లించారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు.. ఒకవేళ ఏనుగు మళ్లీ వస్తే, దాన్ని అదుపు చేసేందుకు రెండు కుంకీలను పలమనేరు సమీపానికి తరలించారు.

ఏనుగుల కదలికలను పర్యవేక్షించాలి: పవన్

ఏనుగు దాడిలో గాయపడిన అటవీ సిబ్బందికి మెరుగైన వైద్యం అందించాలని డిప్యూటీ సీఎం, అటవీశాఖ మంత్రి పవన్ కల్యాణ్ ఆదేశించారు. అటవీశాఖ ఎఫ్ఎస్‌వో సుకుమార్, ఏనుగుల ట్రాకర్ హరిబాబుకు తక్షణం మెరుగైన చికిత్స అందేలా చూడాలని ఆ శాఖ ఉన్నతాధికారులకు స్పష్టం చేశారు. దాడిపై సమాచారం అందుకున్న పవన్ ఏనుగుల సంచారంపై సమీక్షించారు. ఏనుగుల సంచారం పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఏనుగుల కదలికలను కొన్నిరోజుల పాటు నిశితంగా పర్యవేక్షించాలని సూచించారు. అవసరమైతే కుంకీ ఏనుగులతో గస్తీ నిర్వహించాలన్నారు.

ఉద్యోగులనూ పిండేసిన సబ్బవరపు!

పదోన్నతుల పేరిట రూ.లక్షల వసూళ్లు

- కాంట్రాక్టర్లకే కాదు ఉద్యోగులకూ టార్గెట్లు
- పదోన్నతి కోసం రూ.25 లక్షల వసూలు
- డబ్బులు ఇవ్వని వారికి చుక్కలు చూపిన గిరిజన సంక్షేమ శాఖ ఈఎన్‌సీ శ్రీనివాస్

విజయవాడ, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): సబ్బవరపు శ్రీనివాస్.. రాష్ట్రంలో ఇటీవల కాలంలో బాగా వినిపిస్తున్న పేరిది. ఏసీబీ చరిత్రలో ఈ పేరుకు ఒక 'రికార్డు' ఉంది. కాంట్రాక్టర్ నుంచి రూ.25 లక్షలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన గిరిజన సంక్షేమ శాఖ ఈఎన్‌సీ సబ్బవరపు శ్రీనివాస్ గతాన్ని తవ్వుతున్న ఏసీబీ అధికారులకు విస్తుపోయే నిజాలు తెలుస్తున్నాయి. కమీషన్ల కోసం, లంచాల కోసం సబ్బవరపు తొక్కని అడ్డదారులు లేవని గుర్తించారు. బిల్లులను ఆమోదించడానికి పర్సంటేజీలు తీసుకున్నారని అధికారులు తెలుసుకున్నారు. సబ్బవరపు బాధితులు కేవలం కాంట్రాక్టర్లే కాదని, గిరిజన సంక్షేమ శాఖలోని ఉద్యోగులు కూడా బాధితులేనని గుర్తించింది. తన కింద జిల్లాల్లో పని చేసే ఇంజనీరింగ్ అధికారులకు పదోన్నతులు ఇప్పిస్తానని, ఆ ఫైళ్లకు వెంటనే ఆమోదముద్ర వేయిస్తానని నమ్మించి రూ.లక్షలు వసూలు చేసినట్టు అధికారులు తెలుసుకున్నారు. శ్రీనివాస్ కింద జిల్లాస్థాయిలో వర్క్ ఇన్‌స్పెక్టర్లు, అసిస్టెంట్ ఇంజనీర్లు, డివిజనల్ ఇంజనీర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌లు ఉంటారు. వారికి ఉద్యోగంలో చేరినప్పటి నుంచి సీనియారిటీ జాబితా ప్రకారం పదోన్నతులు వస్తుంటాయి. ఈ జాబితాతో సంబంధం లేకుండా పదోన్నతులు ఇప్పిస్తానని జిల్లాస్థాయిలో పనిచేసే ఉద్యోగులను నమ్మించి వారి నుంచి రూ.లక్షలు వసూలు చేసినట్టు ఏసీబీ అధికారులు గుర్తించారు. పెండింగ్ బిల్లులను మంజూరు చేసే సమయంలో తాను అడిగినంత ఇవ్వకుండా జాప్యం చేసిన కాంట్రాక్టర్లకు సంబంధించిన 'ఎంబుక్స్'లో రికార్డులను శ్రీనివాస్ తారుమారు చేయించారు. వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న వారిని విజయవాడకు పిలిపించి తన కార్యాలయంలో ఈ తప్పులు చేయించారు. ఈ విషయం గ్రహించిన ఏసీబీ అధికారులు వారందరినీ విజయవాడకు రప్పించి కొద్ది రోజుల క్రితం విచారించారు. ఈ సమయంలోనే పదోన్నతుల ముసుగులో సబ్బవరపు శ్రీనివాస్ వసూళ్ల వ్యవహారాలు బయటకు వచ్చాయి. విశాఖపట్నానికి చెందిన ఒక అసిస్టెంట్ ఇంజనీర్‌కు పదోన్నతి ఇప్పిస్తానని చెప్పి రూ.25 లక్షలు తీసుకున్నారు. సరిగ్గా ఏసీబీ అధికారులకు చిక్కడానికి ముందు ఈ డబ్బులు వసూలు చేసినట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. పదోన్నతుల జాబితాలో మధ్యలో ఎక్కడో ఉన్న ఆయన పేరును పైకి తీసుకొస్తానని చెప్పి ఈ డబ్బులు వసూలు చేశారని తెలిసింది. గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న పలువురు ఉద్యోగులు సబ్బవరపు చేసిన అక్రమాలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్టు సమాచారం.



వేధిస్తున్నారని చెప్పినా..

ఈఎన్‌సీ శ్రీనివాస్ వేధింపులు భరించలేక కొంతమంది కాంట్రాక్టర్లు సచివాలయంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. వారు మాత్రం ఈ కాంట్రాక్టర్లను తిరిగి ఈఎన్‌సీ వద్దకే పంపేవారు. బిల్లులకు ఆమోదం తెలిపే విషయంలో శ్రీనివాసరావు ఎలా వేధిస్తున్నారో కాంట్రాక్టర్లు ఆధారాలతో సహా ఫిర్యాదు చేసేవారు. ఉన్నతాధికారులు దీనిపై ఎలాంటి విచారణ చేయకపోగా... శ్రీనివాస్‌తోనే మాట్లాడి సెటిల్ చేసుకోవాలని పంపించినట్టు తెలిసింది. ఆయా విషయాలపై సమాచారం అందుకున్న ఏసీబీ అధికారులు సబ్బవరపు శ్రీనివాస్‌తో సన్నిహిత సంబంధాలు నడిపిన ఉన్నతాధికారులపై దృష్టిపెట్టారు. ఇదిలావుంటే, సబ్బవరపు అక్రమాలపై సీబీఐతో దర్యాప్తు చేయించాలని కాంట్రాక్టర్లు కొద్ది రోజుల కిందట ప్రభుత్వానికి విన్నవించారు.

అప్రమత్తంగా ఉండండి



- కులమతాల మధ్య చిచ్చు పెడుతున్నారు
- సామాజిక మాధ్యమాల ముసుగులో చిచ్చు
- రెచ్చగొట్టేవారిపై ఫిర్యాదు చేయండి
- శ్రేణులకు డిప్యూటీ సీఎం పవన్ సూచన

అమరావతి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సంక్షేమ ఫలాలు అందిస్తూ అభివృద్ధి దిశగా సుపరిపాలన సాగిస్తున్న తరుణంలో ప్రజల మధ్య వైషమ్యాలు సృష్టించే విధంగా కుట్రలు మొదలయ్యాయని జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ఇలాంటి కుట్రలకు పాల్పడేవారి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జనసేన పార్టీ నాయకులు, శ్రేణులు, కార్యకర్తలకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. "సామాజిక మాధ్యమాల ముసుగులో, యూట్యూబ్ చానళ్ల పేరుతో, మరోమార్గంలోనో కులాల మధ్య, మతాల మధ్య చిచ్చు పెడుతున్నారు. ఇలా కుయుక్తులతో సమాజంలో అశాంతి, అభద్రత కలిగించే వ్యక్తుల నైజాన్ని పదేళ్లుగా చూస్తున్నాం. వారి ఉచ్చులో పడి ఆవేశాలకులోనై ఘర్షణ వాతావరణానికి తావీయవద్దు. ఆవేశాలు ప్రదర్శిస్తే కుట్రదారులు ఆశించిన ప్రయోజనాలు నెరవేరుతాయి. ఇటీవల మచిలీపట్నంలో చోటు చేసుకున్న ఘటనలు దీనికి ఉదాహరణ. యూట్యూబ్ చానల్‌లో ఒక వ్యక్తి అభ్యంతరకర భాష మాట్లాడాడు. అతను ఆ విధంగా మాట్లాడేలా సిద్ధం చేసి, ప్రచారం చేయడం వెనుక ఉన్న కుత్సిత ఆలోచనను పసిగట్టాలి. దీనిపై చట్ట ప్రకారం కేసులు పెట్టాలి. తొందరపడి ఘర్షణ పడితే సమస్య జటిలం అవుతుంది. ప్రజల మధ్య సామరస్య వాతావరణం చెడగొట్టేలా రెచ్చగొట్టడానికి నాయకులు బయటకు వస్తారు. కులమతాల మధ్య విభేదాలు తీసుకువచ్చేలా వ్యవహరించే వారిపై ఫిర్యాదు చేయాలి. ఈ దిశగా ముందుకు వెళ్లాలని జనసేన శ్రేణులతో పాటు కూటమి నాయకులకు సూచిస్తున్నాం. సోషల్ మీడియా, యూట్యూబ్ చానళ్ల రూపంలో, విశ్లేషకుల ముసుగులో రెచ్చగొట్టే వారిని, అభ్యంతరకర రీతిలో మాట్లాడేవారిని చట్టం ముందు నిలపాలి. వీరి వెనుక ఉండి వ్యవస్థీకృతంగా రెచ్చగొట్టి కుట్రలు చేసేవారిపైనా ఫిర్యాదు చేయాలి. మచిలీపట్నంలో జరిగిన వివాదంపై పార్టీలో అంతర్గత విచారణ చేయాలని నాయకులను ఆదేశించాను. ఈ ఘటనలో సంబంధమున్న వారికి నోటీసులిచ్చి వివరణ తీసుకోవాలని స్పష్టం చేశాను." అని పవన్ కల్యాణ్ అన్నారు.

నాడు మూడు రాజధానులంటూ

ప్రాంతాల మధ్య జగన్ చిచ్చు

- నేడు మళ్లీ అమరావతేనంటూ మాయ మాటలు
- 'ఉక్కు'పై వామపక్షాలు ప్రచారం నమ్మొద్దు
- నేడు విశాఖలో 'సారథ్యం' ముగింపు సభ
- ముఖ్య అతిథిగా జేపీ నడ్డా: మాధవ్



జేపీ నడ్డాకు స్వాగతం పలుకుతున్న రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు మాధవ్, మంత్రి సత్యకుమార్

విశాఖపట్నం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ 3 రాజధానుల పేరుతో ప్రాంతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ ఆరోపించారు. విశాఖపట్నంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడారు. 'ఇప్పుడు అదే జగన్ అమరావతే రాజధాని అని, విశాఖపట్నం నుంచి పరిపాలన ఉండదని మళ్లీ మాయమాటలు చెబుతున్నారు. విశాఖపట్నం స్టీల్‌ప్లాంటుకు ఎన్డీఏ ప్రభుత్వం ఆర్థిక సాయం చేస్తే దాని గురించి మాట్లాడకుండా, ప్రైవేటీకరణ చేస్తున్నారని దుష్ప్రచారం చేస్తున్నారు. ప్రత్యేక ప్యాకేజీతో స్టీల్‌ప్లాంటు తప్పకుండా పురోభివృద్ధి సాధిస్తుంది. స్టీల్ ప్లాంటు పై వామపక్షాలు చేస్తున్న ప్రచారం నమ్మవద్దు. 'ప్రైవేటీకరణ' అనే పదాన్ని భూతద్దంలో చూపించి భయపెడుతున్నారు. ఎన్డీఏ సారథ్యంలో రాష్ట్రంలో పోలవరం ప్రాజెక్టు, అమరావతి రాజధాని నిర్మాణం పనులు శరవేగంతో సాగుతున్నాయి' అని మాధవ్ తెలిపారు. 'ప్రధాని మోదీ స్ఫూర్తితో బీజేపీలో ప్రతి కార్యకర్త పనిచేయాలని 'సారథ్యం' పేరుతో కడప నుంచి యాత్ర ప్రారంభించాం. ముగింపు సభను విశాఖపట్నం రైల్వే మైదానంలో ఆదివారం నిర్వహిస్తున్నాం.' అని మాధవ్ తెలిపారు. కాగా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా సభలో పాల్గొనడానికి శనివారం రాత్రి విశాఖపట్నం చేరుకున్నారు.

మోసానికి ప్రతిరూపం జగన్, సజ్జల

- ప్రజలను తప్పుదోవ పట్టించడానికే రాజధాని గురించి మాట్లాడుతున్నారు
- తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్

అమరావతి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): జగన్మోహన్‌రెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి మోసానికి ప్రతిరూపమని తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ విమర్శించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం మాట్లాడారు. 'ప్రజలను తప్పుదోవ పట్టించడానికి సజ్జల రాజధానిపై మాట్లాడుతున్నారు. విధానపరమైన వ్యాఖ్యలు చేయడానికి సజ్జలకు ఏం అధికారం ఉంది? జగన్ జనం ముందుకు వచ్చి అమరావతిపై తమ పార్టీ విధానం చెప్పాలి. 2014లో అమరావతికి పూర్తి మద్దతు ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన 3 నెలల్లోనే మాట మార్చారు. అమరావతిపై అంత ప్రేమ ఉంటే 2019-24 మధ్య ఒక్క పని కూడా ఎందుకు కొనసాగించలేదు? రిషికొండకు గుండుకొట్టి రూ.వందల కోట్లు ప్యాలెస్‌కు తగలబెట్టిన జగన్... రాజధానిలో ఒక్క రూపాయి ఖర్చు చేయలేదు. ఇప్పటికీ, భవనాలు కట్టడానికి అమరావతి పనికి రాదని, నీటిలో మునిగిపోతోందని విషప్రచారం ఎందుకు చేస్తున్నారో చెప్పాలి. అమరావతి వేశ్యల రాజధాని అని జగన్ తన సొంత చానల్‌లో డిబేట్లు పెట్టి చెప్పించి, ఇప్పుడు అధికారం కోసం అదే అమరావతిని అడ్డం పెట్టుకుంటున్నారు. గతంలో మూడు రాజధానులు అంటూ ఆయా ప్రాంతాల ప్రజల్ని మభ్యపెట్టినందుకు వారికి క్షమాపణ చెప్పాలి' అని ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ డిమాండ్ చేశారు.

సజ్జల.. అమరావతిలో సంచరిస్తున్న తెల్లత్రాచు

- మూడు రాజధానులపై జగన్ వైఖరి మారదు: డొక్కా

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): 'అమరావతి ప్రాంతంలో సంచరిస్తున్న తెల్ల త్రాచు పాములు సజ్జల రామకృష్ణారెడ్డి, సజ్జల బార్గవ్‌రెడ్డి. వారితో జాగ్రత్తగా ఉండాలి' అని మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ రాష్ట్ర ప్రజలను హెచ్చరించారు. శనివారం గుంటూరులోని తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. 'గాడ్‌ఫాదర్ సినిమాలో టామ్ హాగెన్ పాత్ర సజ్జల పోషిస్తున్నారు. రాజధాని విషయంలో వైఎస్ జగన్ వైఖరి మారినట్లు సజ్జల చెప్పినా ప్రజలు నమ్మరు. వైసీపీ నాయకులకు దమ్ము, ధైర్యం ఉంటే అసెంబ్లీలో జగన్మోహన్‌రెడ్డి చేత రాజధాని అమరావతే అని చెప్పించాలి. వైసీపీ విషయంలో రాష్ట్ర ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. జగన్మోహన్‌రెడ్డి మారే వ్యక్తి కాదు. మీ మోసం ప్రజలందరికీ అర్థమైంది. అందుకే 2024 ఎన్నికల్లో ప్రజలు మిమ్మల్ని దారుణంగా తిరస్కరించారు' అని డొక్కా అన్నారు.

ఆటోడ్రైవర్ల భృతిపైనా దుష్ప్రచారం: కలికిరి

అమరావతి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఆటో కార్మికులు, యజమానుల అవసరాలను తీరుస్తూ వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ప్రయత్నిస్తుంటే వైసీపీ దానిపైనా దుష్ప్రచారం చేస్తోందని చిత్తూరు జిల్లా పూతలపట్టు టీడీపీ ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ విమర్శించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడారు. ఉచిత బస్సుతో నష్టం వాటిల్లకుండా ఆటో డ్రైవర్ల జీవన ప్రమాణాలను పెంచడానికి ఈ దసరా నుంచే ప్రభుత్వం వారికి రూ.15 వేలు గౌరవభృతి ఇస్తుందని తెలిపారు. నేపాల్‌లో చిక్కుకుపోయిన తెలుగు వారిలో కడప జిల్లాకు చెందిన 22 మంది ఉన్నా జగన్ కనీసం వారి క్షేమసమాచారాలు తెలుసుకోలేదని, లోకేశ్ చొరవతో నేపాల్‌లో చిక్కుకున్న తెలుగువారంతా క్షేమంగా స్వస్థలాలకు చేరుకున్నారని అన్నారు.

సూపర్ సిక్స్ హిట్‌తో వైసీపీలో వణుకు: వేమూరి

అమరావతి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్ సూపర్ హిట్ కావడంతో వైసీపీలో వణుకుపుడుతోందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేమూరి ఆనంద్ సూర్య అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడారు. కూటమి పాలనలో అమలు చేస్తున్న పథకాలతో అన్ని వర్గాల ప్రజలు సంతోషంలో ఉన్నారని, వైసీపీ హయాంలో పథకాల పేరుతో దోపిడీ చేసి, నిధులను తాడేపల్లి ప్యాలెస్‌కు తరలించుకుపోయారని విమర్శించారు. వైసీపీ హయాంలో నిరుద్యోగం 24 శాతానికి చేరి దేశంలోనే ఏపీ ప్రథమ స్థానంలో నిలిస్తే, కూటమి పాలనలో అభివృద్ధి, సంక్షేమంలో ఏపీ దేశంలోనే నంబర్ వన్ స్థానంలో ఉందన్నారు.

ప్రైవేటీకరణపై ఉద్యమించాలి: రామకృష్ణ

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): విద్యా, వైద్య రంగాలను ప్రైవేటు సంస్థలకు అప్పజెప్పే ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ పిలుపునిచ్చారు. గుంటూరు ఏసీ కళాశాలలో శనివారం జరిగిన ఏఐఎస్ఎఫ్ రాష్ట్రస్థాయి సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. 'పీపీపీ విధానంలో రాష్ట్రంలో మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేయాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నాం. ఈ విధానంతో పేద విద్యార్థులకు ఉన్నత విద్య దూరమవుతుంది' అని రామకృష్ణ అన్నారు. ఏపీ విద్యా పరిరక్షణ కమిటీ నాయకుడు రమేశ్ పట్నాయక్ మాట్లాడుతూ... దేశవ్యాప్తంగా బీజేపీ, ఆర్ఎస్ఎస్ పాఠశాల నుంచి విశ్వవిద్యాలయాల వరకు విద్యను కాషాయీకరణ చేసే విధంగా అడుగులు వేస్తుందని అన్నారు. ప్రముఖ వైద్యుడు ఆలా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... ప్రభుత్వ మెడికల్ కళాశాలు ఏర్పడితే ప్రభుత్వ ఆస్పత్రులు కూడా వస్తాయని, పేదలకు ఉచిత వైద్యం అందుతుందని అన్నారు. ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి శివారెడ్డి మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబరు 77 రద్దు చేసి ప్రైవేట్ పీజీ, ఎయిడెడ్ పీజీ కళాశాలల్లో సీట్లు పొందిన విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తింపచేయాలన్నారు. సమస్యలపై 19న రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలరాజు అధ్యక్షత వహించారు.

ఆదివాసీలకు అక్షర జ్ఞానం అందించలేని కూటమి ప్రభుత్వం సిగ్గుపడాలి

- ఏజెన్సీల్లోని 70 పాఠశాలల్లో ఒక్కటీచరూ లేరు : వైఎస్ షర్మిల

అమరావతి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఆదివాసీలకు అక్షర జ్ఞానం అందించలేని కూటమి ప్రభుత్వం సిగ్గుపడాలి అని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల వ్యాఖ్యానించారు. శనివారం ఈమేరకు ఆమె ఎక్స్ వేదికగా స్పందించారు. 'గిరిజన విద్యకు మహర్దశ, పెద్దపీట లాంటి ఆర్భాటపు మాటలకే ప్రభుత్వం పరిమితమైంది. గిరిజన సంక్షేమంపై మీరు వేసింది కత్తిపీట. మంత్రులుగా మహర్దశ మీకు కానీ... గిరిజన బిడ్డలకు కాదు. పాఠశాలలు తెరచుకుని మూడు నెలలు దాటినా... ఏజెన్సీ ప్రాంతాల్లోని బడులలో కనీసం ఒక్క ఉపాధ్యాయుడు లేడంటే రాష్ట్రంలో ప్రభుత్వం ఉన్నట్లా? లేనట్లా? విద్యాశాఖ పనిచేస్తున్నట్లా? నిద్రపోతున్నట్లా? గిరిపుత్రుల విద్యోన్నతికి కూటమి ప్రభుత్వం తిలోదకాలు ఇచ్చింది. వెలుగుల పేరుతో గిరిజన విద్యార్థుల జీవితాల్లో చీకట్లు నింపుతోంది. ఉపాధ్యాయులు లేక, చదువులు సాగక రాష్ట్రంలో గిరిజన విద్య కుంటుపడింది. డీఎస్సీ నియామకాలు జరిగేంతవరకూ ఆదివాసీ బిడ్డలకు చదువులు దూరం చేయడం తగదు. పాడేరు, అరకు ఏజెన్సీ ప్రాంతాల్లో దాదాపు 70 పాఠశాలల్లో ఇదే పరిస్థితి నెలకొంది. ఖాళీలను భర్తీ చేసేంతదాకా విద్యా వలంటీర్లను నియమించి గిరిపుత్రుల చదువులు సాగేలా చర్యలు తీసుకోవాలని మంత్రి లోకేశ్‌ను కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తుంది' అని షర్మిల పేర్కొన్నారు.

రాజకీయ ముసుగులో నేరాలు చేస్తే తొక్కిపడేయండి

శాంతి భద్రతలపై రాజీ పడొద్దు

- సైకోలపై ఉక్కుపాదం మోపండి
- టెక్నాలజీతో నేరాలకు అడ్డుకట్ట
- సీసీ కెమెరా లేకపోతే పాస్టర్ ప్రవీణ్ మరణాన్ని ప్రభుత్వంపైకి నెట్టేవారు
- ఎస్పీలతో భేటీలో చంద్రబాబు వెల్లడి

అమరావతి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల విషయంలో రాజీ పడొద్దని, రాజకీయ ముసుగులో నేరాలు చేస్తే తొక్కేయండి అంటూ జిల్లాల ఎస్పీలకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలు ఇచ్చారు. రాష్ట్రంలో 14 జిల్లాలకు ఎస్పీలుగా ఎంపిక చేసిన వారితో ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో ప్రత్యక్షంగా మాట్లాడిన ముఖ్యమంత్రి... ఇతర జిల్లాల ఎస్పీలు, విజయవాడ, విశాఖపట్నం పోలీసు కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. "నేరాల తీరుతెన్నులు మారుతున్నాయి. రోజు రోజుకూ కొత్త సవాళ్లు ఎదురవుతున్నాయి. వాటిని అదుపు చేయాలంటే టెక్నాలజీకి ప్రాధాన్యం ఇవ్వాలి. సీసీటీవీ ఫుటేజీ లేకపోతే పాస్టర్ ప్రవీణ్ మృతిపై ప్రభుత్వాన్ని నిందించేవారు. నిరసనల పేరుతో కుట్రలు చేస్తే సహించొద్దు. సోషల్ మీడియాలో మహిళలపై అనుచిత పోస్టులు పెట్టే సైకోలపై ఉక్కుపాదం మోపండి" అంటూ ఎస్పీలకు ఆయన దిశా నిర్దేశం చేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు బాగుంటేనే పెట్టుబడులు వచ్చి రాష్ట్రం అభివృద్ధి చెంది, ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. మారుతున్న నేరాలకు అనుగుణంగా పోలీసులు నైపుణ్యాన్ని పెంచుకోవాలని, అధునాతన టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని సూచించారు.

రియాక్ట్... రీచ్..రెస్పాండ్... రిజల్ట్...

దుర్ఘటనలు జరిగిన వెంటనే స్పందించి క్రైమ్ స్పాట్‌కు చేరుకుని సాక్ష్యాలు సేకరించాలని ఎస్పీలకు సీఎం నిర్దేశించారు. రియాక్ట్... రీచ్..రెస్పాండ్... రిజల్ట్... పద్ధతిలో పనిచేయాలంటూ ఉత్సాహపరిచారు. "సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలపై తక్షణమై స్పందించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి. వ్యక్తిగత సమస్యలతో వచ్చే ప్రజలను మానవీయ కోణంలో చూసి వీలైనంత త్వరగా వారి సమస్యలు పరిష్కరించాలి. ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు పెద్దపీట వేయాలి.. అయితే అసాంఘిక శక్తుల విషయంలో మరింత కఠినంగా వ్యవహరించాలి. మాజీ మంత్రి వివేకానంద రెడ్డి హత్య, సింగయ్య మృతి లాంటి కీలకమైన కేసులు పోలీసులందరూ అధ్యయనం చేయాలి. తప్పుడు ప్రచారాలు, సాక్ష్యాల తారుమారు వంటి అంశాలు ఎలా ఉత్పన్నం అవుతాయనేది గ్రహించాలి.

నిరసనల పేరుతో కుట్రలను సహించొద్దు

రాష్ట్రంలో ఎక్కడైనా ప్రతిపక్షాలకు చెందిన నేతలకు నిరసనలు చేసుకునే హక్కు ఉంటుందని, అయితే చట్టాన్ని అతిక్రమిస్తే చూస్తూ ఊరుకోవద్దు.. అని సీఎం చంద్రబాబు జిల్లాల ఎస్పీలను అప్రమత్తం చేశారు. దేశంలో, రాష్ట్రంలో 2029లో తిరిగి ఎన్డీఏ అధికారంలోకి వస్తుందని, నరేంద్ర మోదీ నాలుగోసారి ప్రధాని అవుతారని వ్యాఖ్యానించారు. విజన్ 2047 లక్ష్యంతో దేశాన్ని ప్రపంచంలో.. రాష్ట్రాన్ని దేశంలో నంబర్ వన్ చేసేందుకు ఎన్డీఏ కూటమి ప్రభుత్వాలు ప్రణాళికా బద్ధంగా పనిచేస్తున్నాయన్నారు. ఇటువంటి లక్ష్యాలను చేరుకోవడానికి శాంతిభద్రతల పరిరక్షణ అత్యంత కీలకమని తెలిపారు. "ఇవన్నీ కసరత్తు చేసే మీకు జిల్లా ఎస్పీలుగా అవకాశం ఇచ్చాం.. మంచి ప్రతిభను ప్రదర్శించండి. శాంతి భద్రతలకు తూట్లు పొడిచేలా ఎవరు వ్యవహరించినా కఠినంగా వ్యవహరించండి" అని నిర్దేశించారు. ముఖ్యమంత్రిగా సుదీర్ఘకాలం పనిచేసిన తాను ఫ్యాక్షనిజం, నక్సలిజం, రౌడీయిజంపై ఎంత కఠినంగా వ్యవహరించిందీ ఆయన వివరించారు. ఈ సమావేశంలో డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా, ఇతర పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

తెలుగు వైభవంగా ఎన్టీఆర్ స్మృతివనం

- అమరావతిలో ఎన్టీఆర్ విగ్రహం, ఐకానిక్ వంతెనపై సీఎం సమీక్ష

అమరావతి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): తెలుగు వారి ఆత్మగౌరవం, ఆత్మవిశ్వాసం కలగలిపి తెలుగు వైభవంగా అమరావతిలో నిర్మించే ఎన్టీఆర్ స్మృతివనం ప్రాజెక్టును చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు, ఐకానిక్ వంతెన నిర్మాణంపై సీఎం క్యాంపు కార్యాలయంలో అధికారులతో శనివారం సమీక్ష నిర్వహించారు. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు, భాష, సాహిత్యం, కళలు, ప్రాచీన చరిత్ర తదితర అంశాలకు పెద్దపీట వేస్తూ స్మృతివనం ప్రాజెక్టును చేపట్టాలని సూచించారు. అమరావతిలోని నీరుకొండ వద్ద చేపట్టనున్న ఈ ప్రాజెక్టులోని అంశాలను అధికారులు సీఎంకు వివరించారు. ప్రాచీన తెలుగు చరిత్రతో పాటు ప్రజల మనసుల్లో నిలిచిపోయిన అల్లూరి, పొట్టి శ్రీరాములు లాంటి విశిష్ట వ్యక్తుల విగ్రహాలు, మన భాష, లిపికి చెందిన వివరాలను కూడా తెలియజెప్పేలా ఆ ప్రాజెక్టులో ఏర్పాట్లు చేయాలని సూచించారు. తెలుగు ప్రజల ప్రతీకగా ఉండే ప్రజారాజధాని అమరావతిని కూడా ప్రతిబింబించేలా ఉండాలన్నారు. 182 మీటర్ల ఎత్తయిన ఎన్టీఆర్ విగ్రహ స్మృతివనం ప్రాజెక్టుకు అనుబంధంగా నీరుకొండ రిజర్వాయర్‌ను తీర్చిదిద్దాలన్నారు. గుజరాత్‌లో నిర్మించిన స్టాచ్యూ ఆఫ్ యూనిటీ ప్రాజెక్టును కూడా పరిశీలించాలని సీఎం పేర్కొన్నారు. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో కన్వెన్షన్ సెంటర్‌ను నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందించాలని చెప్పారు. ఎన్టీఆర్ స్మృతివనంలో ఏర్పాటు చేయనున్న ఎన్టీఆర్ విగ్రహ నమూనాలను సీఎం పరిశీలించారు.



స్మృతివనంలో ఏర్పాటు చేయనున్న ఎన్టీఆర్ విగ్రహ నమూనాలను పరిశీలిస్తున్న సీఎం, నారాయణ

వైద్య కళాశాలలపై దుష్ప్రచారం మానుకోండి!

మీలా అయితే.. 17 కాలేజీల పూర్తికి 23 ఏళ్లు

- జగన్‌కు మంత్రి సత్యకుమార్ లేఖ



అమరావతి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పీపీపీ విధానంలో పలు వైద్య కళాశాలల నిర్మాణం చేపట్టాలని కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై దుష్ప్రచారాలు మానుకోవాలని వైసీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం జగన్‌కు ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ హితవు పలికారు. నిరంతరం అబద్ధాలు వల్లెవేయడం వీడి సహేతుకంగా నడుచుకోవాలని సూచించారు. అధికారంలో ఉన్నప్పుడు 17 మెడికల్ కాలేజీల నిర్మాణం పట్ల జగన్ వైఖరి కొనసాగితే.. వాటిని పూర్తి చేసి, ప్రతిపాదించిన మేరకు ప్రతి కాలేజీలో 150 ఎంబీబీఎస్ సీట్లు చొప్పున ప్రవేశాలు కల్పించడానికి 23 ఏళ్ల పడుతుందని పేర్కొన్నారు. ఈ మేరకు పీపీపీ పద్ధతిలో చేపట్టనున్న కళాశాలల నిర్మాణంపై చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొడుతూ మంత్రి సత్యకుమార్ జగన్‌కు మంత్రి ఆరు పేజీల లేఖ సంధించారు. 17 కొత్త మెడికల్ కాలేజీలకు రూ.8,480 కోట్ల నిర్మాణ వ్యయాన్ని ఆమోదించగా.. జగన్ నాలుగేళ్లలో రూ.1,450 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని, ఈ విధంగా అన్ని కాలేజీల నిర్మాణాలు పూర్తి చేసి, ప్రవేశాలు కల్పించేందుకు 23 ఏళ్ల పడుతుందని ఎద్దేవా చేశారు. ప్రకటించిన దానికి భిన్నంగా ఏడాదికి రూ.363 కోట్లు మాత్రమే ఖర్చు చేశారన్నారు.

మర్కాపురం, మదనపల్లి, ఆదోని కాలేజీలపై వివక్ష

2022వరకూ అమల్లో ఉన్న నిబంధనల మేరకు మౌలిక సదుపాయాలు పాక్షికంగా ఉన్నప్పటికీ ఎన్ఎంసీ మొదటిదశలోని 5 కళాశాలలకు 150 ఎంబీబీఎస్ సీట్ల చొప్పున ప్రవేశాలకు అనుమతించిందని మంత్రి వివరించారు. అయితే 2023లో సవరించిన రూల్స్ మేరకు 2024-25 విద్యా సంవత్సరంలో పాడేరు కళాశాలలో 150 సీట్లు ప్రతిపాదించగా, మౌలిక సదుపాయాల లభ్యత ఆధారంగా కేవలం 50సీట్లకు మాత్రమే ఎన్ఎంసీ అనుమతించిందని పేర్కొన్నారు. రూ.500 కోట్ల వ్యయ అంచనాతో పులివెందుల కాలేజీ నిర్మాణంచేపట్టి, రూ.412 కోట్ల పనులు పూర్తి చేసిన మాజీ సీఎం..మర్కాపురం, మదనపల్లి, ఆదోని కాలేజీల పట్ల వివక్ష చూపారని, రూ.126 కోట్ల పనులతో సరిపెట్టారన్నారు. ఇప్పుడు మళ్లీ అధికారంలోకి వస్తే పీపీపీ కళాశాలలను రద్దు చేస్తానని జగన్ హెచ్చరికలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

జగన్.. ప్రతిసారీ ప్రజలను మోసం చేయలేవు

- వైసీపీ హయాంలో ఎయిమ్స్‌కు మంచినీళ్లు, విద్యుత్ కూడా ఇవ్వలేదు
- చంద్రబాబు మూడు నెలల్లో సమకూర్చారు
- వైద్య కళాశాలలు అంటే గోడలు కాదు: పెమ్మసాని



గుంటూరు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): 'జగన్... ప్రజలను ఎప్పుడో ఒకసారి మోసం చేయొచ్చు. ప్రతిసారీ మోసం చేయలేరు' అని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. వైద్యుడు కూడా అయిన ఆయన శనివారం గుంటూరులో మీడియాతో మాట్లాడుతూ... వైద్య కళాశాలలపై వైసీపీ చేస్తున్న విష ప్రచారంపై మండిపడ్డారు. 'గుంటూరు జిల్లా ప్రజలు బాగా తెలివిగల వారు. ఎవరికి అధికారం ఇవ్వాలో వాళ్లకు బాగా తెలుసు. మంగళగిరిలో ఎయిమ్స్‌ని టీడీపీ ప్రభుత్వం అత్యంత సుందరంగా, అద్భుతంగా తీసుకొచ్చి పూర్తి చేసింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మంగళగిరి ఎయిమ్స్‌కు కనీసం నీళ్లు, విద్యుత్ కూడా ఇవ్వలేదు. అప్రోచ్ రోడ్లు కూడా నిర్మించలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సీఎం చంద్రబాబు మొదటి మూడు నెలల్లో నీళ్లు ఇచ్చారు. కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి విద్యుత్ ఇచ్చారు. రోడ్లు కూడా నిర్మించారు. కూటమి అధికారంలోకి వచ్చేసరికి జీజీహెచ్‌లో లిఫ్టులు, సీటీ స్కాన్‌లు పని చేయడం లేదు. టెస్టులు బయటకు రాస్తున్నారు. ఇలా ఉన్న కళాశాలలు, ఆస్పత్రులను పట్టించుకోని మాజీ సీఎం జగన్... 17 మెడికల్ కళాశాలలు కట్టించాడంటే నమ్మే స్థితిలో ప్రజలు లేరు. ఎన్నికలకు ముందు శంకుస్థాపనలు చేయడం, మభ్య పెట్టడం జగన్‌కు పరిపాటే. మెడికల్ కళాశాలలు అంటే నాలుగు గోడలు కట్టి వదిలేయడం కాదు. ఒక్కో కాలేజీ నిర్మించాలంటే కనీసం రూ.500 కోట్లు కావాలి. వాటికి జగన్ ప్రభుత్వంలో ఎంత నిధులు కేటాయించారో చెప్పాలి. జగన్‌కు చేతనైతే మెడికల్ కళాశాలల టెండర్లు పాడుకొని అభివృద్ధి చేయాలి. దీర్ఘకాలంగా మెడికల్ కళాశాలల నిర్వహణ జరగాలన్న ఉద్దేశంతోనే సీఎం చంద్రబాబు పీపీపీ విధానంలో అభివృద్ధి చేయబోతున్నారు. త్వరలో అన్ని వివరాలతో నేను మాట్లాడతా' అని పెమ్మసాని అన్నారు.



డబ్బు పట్టు.. జై కొట్టు!

ఆహ్వానపత్రిక ఇచ్చినవారికి వైసీపీ నేతల వింత షరతులు

- జగన్‌కు జేజేలు కొట్టించాలని కండీషన్
- 'ఖర్చు' తామే ఇస్తామని హామీ.. వైసీపీ అధినేత కొత్త ట్రెండ్!

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాజకీయ సభలకు డబ్బులిచ్చి జనాన్ని పోగేసే వాళ్లను చూశాం. 'పెయిడ్' సన్మానాలు చేయించుకుని... 'పెయిడ్' ప్రేక్షకులను పిలిపించుకునే వాళ్ల గురించీ తెలుసు! ఇది... మరింత వెరైటీ! "జగన్ వస్తారు. ఆయన రాగానే... సీఎం సీఎం.. జై జగన్... అని జేజేలు కొట్టించాలి. ఫ్రీగా అక్కర్లేదు... ఈ డబ్బులు తీసుకుని జనాన్ని అరేంజ్ చేయండి" అంటూ వైసీపీ నేతలు కొత్త ట్రెండు మొదలుపెట్టారు. ఇటీవల జగన్ పెళ్లి రిసెప్షన్లు, పరామర్శలకు బాగానే వెళ్తున్నారు. పెళ్లి ఆహ్వానం అందగానే... 'రిసెప్షన్ మాత్రం జగన్ వచ్చేందుకు అనుకూలమైన ప్రదేశంలో పెట్టండి' అని వైసీపీ నేతలు సూచిస్తున్నారు. ఇందులోనూ 'రాజకీయం' దాగుంది. జగన్ రాజకీయ గ్రాఫ్ అంతకంతకు పడిపోతోంది. జనం వద్దకు వెళ్లడానికి సమస్యలు, అక్కడ వినిపించడానికి గట్టి నినాదాలు వైసీపీకి లేని పరిస్థితి. దీంతో... పెళ్లిళ్లు, పేరంటాలకు వెళ్లి అక్కడైనా హడావుడి చేయాలన్నదే వైసీపీ నేతల ఉద్దేశం. ఓ మోస్తరు నేతలు, వ్యక్తులు ఎవరు వెళ్లి ఆహ్వాన పత్రిక ఇచ్చినా 'వస్తాను..' అంటూ ముందే జగన్ చెప్పేస్తున్నారు. పీఏను పిలిచి డైరీలో వివరాలు రాసుకోవాలని చెబుతున్నారు. ఆ తర్వాత జగన్ మనుషులు రంగంలోకి దిగి ఆహ్వానితుల ముందు తమ 'ఎజెండా' పెడతారు. జగన్ వచ్చే సమయానికి ఎంతమంది ప్రాంగణంలో ఉండాలి.. శుభకార్యం జరిగే హాలు, వేదిక వద్ద ఎందరు ఉండాలి.. అందులో మహిళలు .. యువకుల సంఖ్య ఏ స్థాయిలో ఉండాలో వివరిస్తారు. బయట రాష్ట్రంలో కార్యక్రమం పెట్టుకోకూడదు. ఎందుకంటే.. అక్కడకు వెళ్లి జేజేలు కొట్టించుకుంటే రాజకీయంగా ఉపయోగం ఉండదు కదా! అందుకని పెళ్లి ఎక్కడ చేసుకున్నా రిసెప్షన్ మాత్రం రాష్ట్రంలోనే నిర్వహించాలి. రిసెప్షన్ తీరుతెన్నులపైనా జగన్ మనుషులే డైరెక్షన్ ఇస్తారట! ఇదంతా ఓకే అయితే.. అసలు విషయంలోకి వస్తారు. 'సీఎం.. సీఎం.. జగన్.. జగన్..' అంటూ జేజేలు కొట్టేందుకు మనుషులను ఏర్పాటు చేయడం తప్పనిసరి. అందుకు అయ్యే ఖర్చు కూడా చెల్లిస్తున్నారు. అంతే... ఫంక్షన్ హాలులో ఇలా జగన్ అడుగు పెట్టడం... జై జగన్, సీఎం సీఎం అనే నినాదాలు హోరెత్తడం! ఈ 'అరేంజ్డ్ హడావుడి'ని రోత మీడియా 'ఓ రేంజ్'లో కవర్ చేస్తుంది. ఇతర అనుకూల చానళ్లు, నచ్చిన సోషల్ మీడియా ఆ రోజంతా ఊదరగొడతాయి! ఇదీ ప్లాన్!

జనాన్ని అయోమయంలోకి నెట్టేద్దాం!

- మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ అంటూ ప్రభుత్వంపై విషం చిమ్ముదాం
- కట్టని కళాశాలలను ప్రైవేటుకు ఇస్తున్నారని ప్రచారం చేద్దాం
- ఆందోళనలకు సిద్ధమవుదాం
- వైసీపీ నేతలకు సజ్జల పిలుపు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో 17 వైద్య కళాశాలలు నిర్మించామంటూ వైసీపీ చెప్పుకొన్నవన్నీ ఉత్త గొప్పలేనని తేలిపోయింది. జగన్ హయాంలో ప్రకటించిన ఈ కాలేజీల్లో 5 మాత్రమే అరకొరగా పూర్తవడంతో, మిగతా వాటిని పూర్తిచేసే బాధ్యతను కూటమి ప్రభుత్వం తీసుకుంది. ఈ విషయంలో పూర్తిగా అభాసుపాలైన వైసీపీ పెద్దలు... ప్రభుత్వంపై విషం చిమ్మేందుకు దారులు వెతుకుతున్నారు. వైద్యరంగాన్ని కూటమి ప్రభుత్వం ప్రైవేటుపరం చేస్తోందంటూ గత బుధవారం మాజీ సీఎం జగన్ బురద చల్లారు. ఈ వ్యాఖ్యలపై భగ్గుమన్న కూటమి నేతలు.. పునాదులకే పరిమితమైన వైద్య కళాశాలల దగ్గరకు వెళ్లి జగన్ మాటల్లోని డొల్లతనాన్ని బయటపెట్టారు. దీంతో వైసీపీ ఒక్కసారిగా ఆత్మరక్షణలో పడిపోయింది. దీంతో ఇప్పుడు విష ప్రచారం కొనసాగించడం ద్వారా ప్రజలను అయోమయంలోకి నెట్టేసే పనిని వైసీపీ రాష్ట్ర సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డి భుజాలపై వేసుకున్నారు. మెడికల్ కాలేజీల నిర్మాణం అనే మాటెత్తకుండానే నిర్వహణను ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తున్నారంటూ దుష్ప్రచారం ప్రారంభించారు. అసలు నిర్మాణాలే చేయని కాలేజీలను ప్రైవేటుపరం చేస్తున్నారని కొత్త రాగం అందుకున్నారు. ఈ ప్రచారాన్ని జనంలోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని శనివారం నిర్వహించిన జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా వైసీపీ నేతలకు సజ్జల నూరిపోశారు. మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయడాన్ని వ్యతిరేకిస్తూ ఆందోళనలు చేద్దామంటూ పార్టీ నేతలకు ఆయన పిలుపునిచ్చారు. ఇప్పటికే కట్టిన మెడికల్ కాలేజీల్లోనూ ప్రైవేటీకరణ అమలు చేస్తారని జనానికి చెప్పాలని సూచించారు. పనులు జరగక, పిచ్చిమొక్కలతో నిండి ఉన్న మెడికల్ కాలేజీల వద్ద కూటమి నేతలు ఆందోళనలు చేసి, ప్రజలకు వాస్తవాలను చెబుతుండటంతో ఇరకాటంలో పడ్డ వైసీపీ... ఇప్పుడు ప్రజలను మరోసారి తప్పుదోవ పట్టించేందుకు సిద్ధం కావడంపై రాజకీయ వర్గాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

జమ్మూ కశ్మీర్‌లో పలుచోట్ల కుంగుతున్న భూమి

జమ్మూ, సెప్టెంబరు 13: భారీ వర్షాల కారణంగా జమ్మూ కశ్మీర్‌లోని పలుచోట్ల భూమి కుంగుతోంది. జమ్మూ ప్రాంతంలోని రాంబన్, కిష్త్వార్, పూంచ్, రెసాయ్, కథువా జిల్లాల్లోని 19 ప్రాంతాల్లో ఈ పరిస్థితి నెలకొంది. పూంచ్ జిల్లాలోని కాలాబన్ గ్రామంలో సుమారు 100 నిర్మాణాలు బీటలువారాయి. మూడు స్కూలు భవనాలు, ఓ మసీదు, గ్రామానికి వచ్చే రోడ్డు కూడా దెబ్బతిన్నాయి. ఈ పరిణామంతో గ్రామంలో భయానక వాతావరణం నెలకొంది. 700లకు పైగా గ్రామస్థులను పునరావాస శిబిరాలకు తరలించారు. జమ్మూ కశ్మీర్ మంత్రి జావెద్ రాణా గ్రామాన్ని సందర్శించి పునరావాస పనులను పర్యవేక్షించారు.

త్వరలో బీజేపీ అధ్యక్షుడి నియామకం?

న్యూఢిల్లీ, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఉపరాష్ట్రపతి ఎన్నికల ప్రక్రియ ముగిసిపోవడంతో బీజేపీ జాతీయ అధ్యక్షుడి ఎంపిక త్వరలో జరిగే అవకాశాలు ఉన్నాయి. బిహార్ అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ ముగిసేలోపు బీజేపీ జాతీయ అధ్యక్షుడి నియామకం జరుగుతుందని పార్టీ వర్గాలు తెలిపాయి. సోమవారం నుంచి జాతీయ అధ్యక్షుడి ఎన్నికపై సంప్రదింపుల క్రమం ప్రారంభమవుతుందని, ఆ తర్వాత కొత్త అధ్యక్షుడి ఎంపిక షెడ్యూల్ ప్రకటిస్తారని తెలిపాయి.

కాంగ్రెస్ ఐటీ సెల్‌పై బీజేపీ కేసు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 13: ప్రధాని మోదీ తల్లిని అవమానించారంటూ బీజేపీ చేసిన ఫిర్యాదు మేరకు కాంగ్రెస్ ఐటీ సెల్‌పై ఢిల్లీలోని నార్త్ అవెన్యూ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదయింది. కృత్రిమ మేధ సాయంతో కాంగ్రెస్ బిహార్ శాఖ రూపొందించి, సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసిన వీడియోపై అభ్యంతరం తెలుపుతూ ఫిర్యాదు చేసింది. ప్రధాని మోదీ, ఆయన తల్లి హీరాబెన్ పోలికలు ఉన్న పాత్రలతో కాంగ్రెస్ ఆ వీడియోను సృష్టించింది. 'సాహెబ్ కలలోకి వచ్చిన అమ్మ' పేరుతో హిందీలో రూపొందించిన ఆ వీడియోలో మోదీని తల్లి తిడుతున్నట్టు ఉంటుంది. 'ఈ రోజు ఓట్ చోరీ పూర్తయింది. ఇక నిద్రపోదాం' అని మోదీ పాత్రధారి అనడం అందులో కనిపిస్తుంది. దానిపై తల్లి పాత్రధారి స్పందిస్తూ రాజకీయ ప్రయోజనాల కోసం తన పేరును దుర్వినియోగం చేస్తున్నావంటూ మందలిస్తుంది. 'నోట్ల రద్దు వేళ నన్ను లైనులో నిలబెట్టావు. అనంతరం నా కాళ్లు కడుగుతూ రీల్స్ చేశావు. రాజకీయాల కోసం ఎన్నిసార్లు దిగజారుతావు?' అంటూ ప్రశ్నించడం ఆ వీడియోలో ఉంది.

యూకేలో సిక్కు యువతిపై గ్యాంగ్ రేప్

లండన్, సెప్టెంబరు 13: బ్రిటన్‌లో భారత సంతతి సిక్కు యువతిపై ఇద్దరు వ్యక్తులు దాడి చేసి సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. 'నీ దేశానికి తిరిగి వెళ్లిపో' అంటూ జాత్యహంకార వ్యాఖ్యలు చేస్తూ ఆమెను బెదిరించారు. ఇంగ్లండ్‌లోని ఓల్డ్‌బరీలో ఈనెల 9వ తేదీన చోటు చేసుకున్న ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అక్కడే పుట్టి పెరిగిన 20ఏళ్ల యువతి ఉదయం ఓ పార్క్ సమీపంలో వెళ్తుండగా.. ఇద్దరు శ్వేత జాతీయులు దాడి చేసి అత్యాచారానికి పాల్పడ్డారు. 'నీది ఈ దేశం కాదు.. నీ దేశానికి నువ్వు తిరిగి వెళ్లిపో' అంటూ బెదిరించారు. దీనిపై బాధితురాలు కుటుంబీకులతో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

విరిగిన ఎముకను 3నిమిషాల్లో అతికించే 'గ్లూ'

బీజింగ్, సెప్టెంబరు 13: చిరిగిన కాగితాన్ని బంక/జిగురు(గ్లూ)తో అతికించినట్టుగా విరిగిన ఎముకను అతికించేందుకు చైనా శాస్త్రవేత్తలు ఓ గ్లూ కనిపెట్టారు. ఇది కేవలం మూడు అంటే మూడు నిమిషాల్లోనే విరిగిన ఎముకను అతికిస్తుందని చెప్పారు. నీటి అడుగున వివిధ పరిసరాల్లో బలంగా అతుక్కునే ఆలుచిప్పల స్ఫూర్తితో ఈ గ్లూను అభివృద్ధి చేశారు. తూర్పు చైనాలోని షెజాంగ్ ప్రావిన్స్‌లోని సర్ రన్ రన్ షా ఆస్పత్రిలో అసోసియేట్ చీఫ్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ లిన్‌షాన్ ఫింగ్ నేతృత్వంలోని బృందం 'బోన్ 02' పేరిట ఈ గ్లూను అభివృద్ధి చేసిందని చైనా మీడియా పేర్కొంది. శస్త్రచికిత్స అవసరం లేకుండా ఎముక విరిగిన చోట ఓ సూది ద్వారా బోన్02 గ్లూను పెట్టవచ్చని, తర్వాత రెండు నుంచి మూడు నిమిషాల్లోనే విరిగిన ఎముక అతుక్కుంటుందని లిన్ చెబుతున్నారు. 150 మందికి పైగా రోగులకు ఈ గ్లూతో చికిత్స చేశామని, ఈ గ్లూతో అతికిన ఎముకలు చాలా ధృడంగా ఉన్నట్టు గుర్తించామని లిన్ పేర్కొన్నారు.

నమో భారత్ @ 160 కి.మీ.

» దేశంలో అత్యంత వేగవంతమైన రైలుగా రికార్డు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 13: దేశంలో అత్యంత వేగవంతమైన రైలు అంటే ఇప్పటి వరకు మనకు వినిపించే పేరు 'వందే భారత్'! అయితే ఇప్పుడు 55 కిలోమీటర్ల ఢిల్లీ-మీరట్ ఆర్ఆర్‌టీఎస్ సెక్షన్ మధ్య నడిచే 'నమో భారత్' రైలు గంటకు 160 కిలోమీటర్ల వేగాన్ని అందుకొని.. అత్యంత వేగవంతమైన ట్రైన్‌గా రికార్డు సృష్టించింది. అంతకుముందు 2016లో ప్రారంభించిన గతిమాన్ ఎక్స్‌ప్రెస్ వేగమైన రైలుగా ఉండేది. ఇది దేశంలో తొలి సెమీ-హైస్పీడ్ ట్రైన్ కూడా కావడం గమనార్హం. హజరత్ నిజాముద్దీన్, ఆగ్రా మధ్య ప్రత్యేకంగా వేసిన ట్రాక్‌లపై గంటకు 160 కిలోమీటర్ల వేగంతో నడిచేది. తర్వాత సెమీ హైస్పీడ్ రైలు వందేభారత్‌ను ప్రవేశపెట్టినప్పుడు.. ఆ ట్రైన్ కూడా అదే గరిష్ఠ వేగంతో నడిచేది. అయితే 2024 జూన్ 24న రైల్వే మంత్రిత్వ శాఖ వాటి వేగాన్ని గంటకు 160 నుంచి 130 కిలోమీటర్లకు తగ్గించాలని నిర్ణయించింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా అన్ని రైళ్లు గరిష్ఠంగా 130 కిలోమీటర్ల వేగంతో మాత్రమే నడుస్తున్నాయి. నమో భారత్ తూర్పు ఢిల్లీలోని న్యూఅశోక్ నగర్, ఉత్తరప్రదేశ్‌లోని మీరట్ సౌత్ మధ్య సేవలు అందిస్తోంది. ఆ మార్గంలోని 11 స్టేషన్లలో కొన్నింటి మధ్య కొన్ని సెకన్ల పాటు గంటకు 160 కిలోమీటర్ల వేగాన్ని అందుకుంది. ఢిల్లీలోని సరై కాలే ఖాన్, యూపీలోని మోదీపురం మధ్య మొత్తం 16 స్టేషన్లతో కూడిన 82.15 కిలోమీటర్ల కారిడార్ త్వరలో అందుబాటులోకి రానుందని నేషనల్ క్యాపిటల్ రీజినల్ ట్రాన్స్‌పోర్టు కార్పొరేషన్ లిమిటెడ్ (ఎన్‌సీఆర్‌టీసీఎల్) అధికారులు పేర్కొన్నారు.

సబ్బులు, షాంపూ ధరలు తగ్గిస్తున్నాం

» పేస్టు, జామ్, హార్లిక్స్, బూస్ట్, బ్రూ కాఫీ కూడా...

» 22 నుంచి కొత్త తగ్గింపు ధరలు: హెచ్‌యూఎల్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 13: జీఎస్టీ తగ్గింపు ఫలితాలను ప్రజలకు అందించే దిశగా కంపెనీలు చర్యలు తీసుకుంటున్నాయి. జీఎస్టీ తగ్గింపుతో గరిష్ఠ అమ్మకపు ధర(ఎంఆర్‌పీ)లో వచ్చిన మార్పులను వినియోగదారులకు తెలిసేటట్లు ప్రతి కంపెనీ కనీసం రెండు పత్రికలలో ప్రకటనలు ఇవ్వాల్సి ఉంటుంది. అలాగే మార్కెట్‌లో మిగిలిన స్టాక్‌పై తగ్గిన కొత్త ఎంఆర్‌పీ ధరలతో స్టిక్కర్ వేయడానికి అనుమతి ఇచ్చింది. అయితే పాత ఎంఆర్‌పీ ధర కనిపించాలన్న నిబంధన మేరకు కంపెనీలు చర్యలు తీసుకుంటున్నాయి. సెప్టెంబరు 22 నుంచి తగ్గించిన ధరలు అందుబాటులోకి వస్తాయని హిందుస్థాన్ యూనిలీవర్ లిమిటెడ్ (హెచ్‌యూఎల్) ప్రకటించింది. ఆ ప్రకటన మేరకు నిత్యం వాడే సబ్బులు, షాంపూలు, పేస్టులు, హార్లిక్స్, బూస్ట్ తదితరాల ధరలు గణనీయంగానే తగ్గనున్నాయి. డోవ్ హెయిర్ ఫాల్ రెస్క్యూ షాంపూ 340 ఎంఎల్ ధర రూ.490 నుంచి రూ.435కి తగ్గింది. సన్‌సిల్క్ బ్లాక్ షైన్ షాంపూ 350 ఎంఎల్ ధర రూ.430 నుంచి రూ.370కి తగ్గింది. 75 గ్రాముల డోవ్ సబ్బు రూ.5, లైఫ్ బాయ్ 75 గ్రాముల సబ్బులు నాలుగింటిపైన కలిపి ఎనిమిది రూపాయలు తగ్గగా అదే ప్యాక్ లక్స్ రేడియంట్ గ్లో సబ్బులపై రూ.11 తగ్గింది. 150 గ్రాముల క్లోజ్‌అప్ టూత్‌పేస్టుపై రూ.16 తగ్గింది. 200 గ్రాముల కిసాన్ జామ్‌పై రూ.10 తగ్గగా... 200 గ్రాముల చాకొలెట్ హార్లిక్స్‌పై రూ.20, 400 గ్రాముల ఉమెన్స్ ప్లస్ హార్లిక్స్‌పై రూ.36, 200 గ్రాముల బూస్ట్‌పై రూ.14, 75 గ్రాముల బ్రూ కాఫీపై రూ.30 తగ్గింది.

విశ్వాసమనే వారధి వేయాలి

భరతమాత కిరీటంలో మణిపూర్ ఒక రత్నం.. అక్కడ హింసకు తావు ఉండొద్దు: మోదీ



మణిపూర్ ఘర్షణల్లో చనిపోయిన వారి కుటుంబసభ్యులతో ప్రధాని మోదీ

ఇంఫాల్/చురాచంద్‌పూర్/ఐజ్వాల్, సెప్టెంబరు 13: తెగల మధ్య ఘర్షణలతో అతలాకుతలమైన మణిపూర్‌లో శాంతి నెలకొనాలని, వేగంగా అభివృద్ధి సాధించాలని ప్రధాని మోదీ ఆకాంక్షించారు. ఆ రాష్ట్రంలోని కొండ ప్రాంతాల్లో ఉండే కుకీ తెగ, లోయ ప్రాంతాల్లో ఉండే మైతేయి తెగ ప్రజల మధ్య పరస్పర నమ్మకం పెరగాలంటూ.. 'కొండలు, లోయ ప్రజల మధ్య పరస్పర విశ్వాసమనే బలమైన వంతెన వేయాలి' అని పిలుపునిచ్చారు. భారత మాత కిరీటంలో మణిపూర్ ఒక రత్నమని అభివర్ణించారు. అక్కడ ఎలాంటి హింసకు తావు ఉండొద్దని పేర్కొన్నారు. శనివారం ఈశాన్య రాష్ట్రాలు మణిపూర్, మిజోరం, అసోంలలో పర్యటించిన ప్రధాని మోదీ పలు అభివృద్ధి పథకాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా మణిపూర్‌లోని చురాచంద్‌పూర్, ఇంఫాల్‌లోని కాంగ్లా కోటలో నిర్వహించిన సభల్లో మోదీ ప్రసంగించారు. అసోం రాజధాని గౌహతిలో రోడ్ షో నిర్వహించారు. ప్రఖ్యాత సంగీతకారుడు భూపేన్ హజారికా జయంతి వేడుకల్లో పాల్గొన్నారు.

ఘర్షణలు జరిగిన రెండేళ్ల తర్వాత..

2023 మేలో మణిపూర్‌లో మైతేయిలకు రిజర్వేషన్లు ఇవ్వాలన్న ప్రతిపాదనలకు, పలు కొండ ప్రాంతాలను రిజర్వు ఫారెస్టులు ప్రకటించడానికి వ్యతిరేకంగా కుకీలు ఆందోళనకు దిగారు. ప్రతిగా మైతేయిలు నిరసన చేపట్టారు. ఈ క్రమంలో చురాచంద్‌పూర్ కేంద్రంగా కుకీలు, మైతేయిల మధ్య హింసాత్మక ఘర్షణలు చెలరేగిన విషయం తెలిసిందే. ఇరుతెగలకు చెందిన 260 మందికిపైగా మృతిచెందారు. ఈ ఘర్షణల తర్వాత తొలిసారిగా శనివారం మోదీ మణిపూర్‌లో పర్యటించారు. చురాచంద్‌పూర్‌లోని పునరావాస శిబిరంలో, ఇంఫాల్‌లోని కాంగ్లా కోటలో పలు బాధిత కుటుంబాలను పరామర్శించారు. మణిపూర్‌లో శాంతిని పునరుద్ధరించేందుకు కేంద్రం కట్టుబడి ఉందని భరోసా ఇచ్చారు. ఈశాన్య రాష్ట్రాల్లో ఎన్నో ఘర్షణలు, వివాదాలను తాము గత పదకొండేళ్లలో పరిష్కరించామని పేర్కొన్నారు. అభివృద్ధి చెందాలంటే శాంతి ముఖ్యమని.. మణిపూర్‌లో శాంతి నెలకొనేందుకు అన్ని గ్రూపులు ముందుకు రావాలని మోదీ విజ్ఞప్తి చేశారు. మణిపూర్ ఘర్షణల్లో నిర్వాసితులైన వారి కోసం 7 వేల ఇళ్లను మంజూరు చేస్తున్నామని, రాష్ట్రానికి రూ.3 వేల కోట్ల ప్యాకేజీ ఇస్తున్నామని ప్రకటించారు.

ఓటు బ్యాంకు రాజకీయాలతో దెబ్బ

ఇన్నాళ్లూ ఓటు బ్యాంకు రాజకీయాలు, నిర్లక్ష్యం కారణంగా ఈశాన్య రాష్ట్రాలు వెనుకబడ్డాయని.. కేంద్రంలో బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వం ఏర్పాటయ్యాక అభివృద్ధి వేగం పుంజుకుందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. శనివారం ఆయన మిజోరం రాష్ట్ర రాజధాని ఐజ్వాల్‌లో రూ.9 వేల కోట్ల విలువైన పథకాలను, ఐజ్వాల్-ఢిల్లీ తొలి రాజధాని ఎక్స్‌ప్రెస్ రైలును ప్రారంభించారు. తర్వాత జరిగిన సభలో మాట్లాడారు. గత పదకొండేళ్లుగా తాము మిజోరం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిపెట్టామని, రాష్ట్రం ఇప్పుడు దేశ అభివృద్ధిలో చోదక శక్తిగా మారిందని మోదీ పేర్కొన్నారు. ప్రపంచంలో క్రీడలకు భారత్ ముఖ్యమైన హబ్‌గా మారుతోందని, అందులో మిజోరం పాత్ర ఎంతో ఉందని తెలిపారు. ప్రధాని మోదీ ఎనిమిదేళ్ల తర్వాత మిజోరంలో పర్యటించడం గమనార్హం. జీఎస్టీలో చేసిన మార్పులతో దేశ ప్రజలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని మోదీ చెప్పారు. "2014కు ముందు టూత్‌పేస్టులు, సబ్బులు, నూనెల వంటివాటిపై 27శాతం పన్ను ఉండేది. ఇప్పుడు జీఎస్టీలో వాటిపై 5శాతమే పన్ను ఉంది. కేన్సర్ వంటి ఔషధాల ధరలు తగ్గుతాయి. వాహనాల ధరలు ఇప్పటికే తగ్గిస్తున్నారు" అని పేర్కొన్నారు.

మణిపూర్ ఇన్నాళ్లకు గుర్తొచ్చిందా?: కాంగ్రెస్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మణిపూర్‌లో మోదీ పర్యటనపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. "ఇన్నాళ్లకు మణిపూర్ ప్రజలు గుర్తొచ్చారా" అని ప్రశ్నించింది. "ప్రధాని మోదీ పర్యటన నాటకం. మణిపూర్‌లో 864 రోజులుగా జరుగుతున్న హింసలో 300 మంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. 67 వేల మంది నిరాశ్రయులయ్యారు. అప్పటి నుంచి మోదీ 46 విదేశీ పర్యటనలు చేశారు. కానీ సొంత ప్రజలతో సానుభూతితో రెండు మాటలు పంచుకోవడానికి ఇన్నాళ్లూ ఒక్కసారి కూడా రాలేదు" అని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే ఎక్స్ వేదికగా విమర్శించారు. ఇక ఘర్షణలు జరిగిన రెండేళ్లకుగానీ మోదీ మణిపూర్ వెళ్లడం దురదృష్టకరమని కాంగ్రెస్ అగ్ర అగ్రనేత ప్రియాంకగాంధీ పేర్కొన్నారు.

నారీ శక్తికి నీరాజనం

» నేపాల్ తాత్కాలిక ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన సుశీలకు మోదీ అభినందనలు

ఇంఫాల్, కాఠ్‌మాండూ, సెప్టెంబరు 13: నేపాల్‌కు తాత్కాలిక ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన సుశీల కర్కికి ప్రధాని మోదీ అభినందనలు తెలిపారు. మహిళా సాధికారతకు ఇది నీరాజనమని పేర్కొన్నారు. చరిత్ర, విశ్వాసాలు, సంస్కృతి పరంగా భారత్, నేపాల్ అత్యంత సన్నిహిత మిత్ర దేశాలు అని పేర్కొన్నారు. ఈ సంధి కాలంలో న్యూఢిల్లీ పూర్తిగా నేపాల్ ప్రజల వెనుకే ఉందని స్పష్టం చేశారు. 140 కోట్ల భారతీయుల తరఫున సుశీల కర్కికి అభినందనలు తెలియజేస్తున్నానన్నారు. ఆమె నేపాల్‌ను శాంతి, స్థిరత్వం, అభివృద్ధివైపు నడిపిస్తారని విశ్వసిస్తున్నానని పేర్కొన్నారు. కాగా నేపాల్ పార్లమెంటు ఎన్నికలు వచ్చే ఏడాది మార్చి 5న నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు రామచంద్ర పౌడెల్ కార్యాలయం ప్రకటించింది. తాత్కాలిక ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన సుశీల కర్కి సిఫారసు మేరకు నేపాల్ ప్రతినిధుల సభను రద్దు చేస్తున్నట్లు శుక్రవారం ప్రకటించిన అధ్యక్షుడు రామచంద్ర పౌడెల్ ఈమేరకు పార్లమెంటు ఎన్నికలు నిర్వహించే తేదీని ప్రకటించారు.

తాలిబన్ల దాడిలో 19 మంది పాక్ సైనికుల మృతి

ఇస్లామాబాద్, సెప్టెంబరు 13: పాకిస్థాన్ తాలిబన్లు జరిపిన కాల్పుల్లో 19 మంది పాక్ సైనికులు మరణించారు. మరో నలుగురు గాయపడ్డారు. సైనికులు వెళ్తున్న వాహనశ్రేణిపై శనివారం వేకువజాము నాలుగు గంటల సమయంలో తహెరీక్ ఎ తాలిబన్ పాకిస్థాన్ (టీపీపీ-పాకిస్థాన్ తాలిబన్) కాల్పులు జరిపింది. అఫ్ఘానిస్థాన్‌కు సరిహద్దులో ఉన్న పశ్చిమ వజీరిస్థాన్ జిల్లాలో ఈ సంఘటన చోటుచేసుకుంది. పర్వత ప్రాంతంలో రెండు వైపుల నుంచి కాల్పులు జరపడంతో సైనికులు అక్కడికక్కడే మరణించారు. అనంతరం తాలిబన్లు సైనికుల వద్ద ఉన్న ఆయుధాలు, డ్రోన్లను స్వాధీనం చేసుకున్నారు. మరోవైపు గత మూడు రోజుల్లో 45 మంది తాలిబన్లను హతమార్చినట్టు సైన్యం ప్రకటించింది.

పాఠశాలలపై వైమానిక దాడి.. 19 మంది విద్యార్థుల మృతి

» మయన్మార్‌లో సైన్యం దురాగతం

నైపిడా, సెప్టెంబరు 13: మయన్మార్‌లో సైనిక ప్రభుత్వం (జుంటా) దారుణాలకు అడ్డు అదుపు లేకుండా పోతోంది. పశ్చిమ రాఖైన్ రాష్ట్రంలో శనివారం తెల్లవారుజామున రెండు ప్రైవేటు పాఠశాలల భవనాలపై సైన్యం జరిపిన వైమానిక దాడిలో సుమారు 19 మంది విద్యార్థులు మరణించారు. మరో 22 మంది తీవ్రంగా గాయపడ్డారు. క్యాక్‌టా ప్రాంతంలో ఈ దారుణం చోటు చేసుకుంది. దాడి జరిగినప్పుడు విద్యార్థులంతా నిద్రిస్తున్నారని తెలిసింది. అరకాన్ ఆర్మీ (ఏఏ) అనే సాయుధ గ్రూపు ఈ దారుణాన్ని ఖండించింది. బాంబు దాడిలో చనిపోయిన విద్యార్థుల వయసు 15 నుంచి 21 ఏళ్ల మధ్య ఉంటుందని తెలిపింది. 2021లో తిరుగుబాటు చేసి అధికారాన్ని చేపట్టిన సైనిక జుంటా, అరకాన్ ఆర్మీ మధ్య పోరాటం ఇటీవల తీవ్రంగా పెరిగింది. ఈ నేపథ్యంలో సైనిక జుంటా పౌర ప్రాంతాలపై దాడులు చేస్తోందని మానవ హక్కుల సంస్థలు ఆరోపిస్తున్నాయి.

ఇక దేశంలోనే 'రఫేల్'ల తయారీ

» రూ.2లక్షల కోట్లతో114 విమానాలు

» హైదరాబాద్‌లో ఇంజన్ల మరమ్మతు కేంద్రం..పరిశీలిస్తున్న రక్షణ శాఖ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 13: ఆపరేషన్ సింధూర్‌లో సమర్థంగా సేవలు అందించిన రఫేల్ యుద్ధ విమానాలు ఇకపై దేశంలోనే తయారుకానున్నాయి. ఫ్రాన్స్‌కు చెందిన మాతృ సంస్థ డసో ఏవియేషన్ దేశంలోని ఏరోస్పేస్ సంస్థలతో కలిసి వీటిని తయారు చేయనుంది. ఈ యుద్ధ విమానాల్లో 60% పరికరాలను దేశంలోనే రూపొందించనున్నారు. 'మేడ్ ఇన్ ఇండియా' కింద రూ.2 లక్షల కోట్ల వ్యయంతో 114 రఫేల్ యుద్ధ విమానాలను తయారు చేయాలంటూ భారత వాయుసేన చేసిన ప్రతిపాదనను రక్షణ శాఖ పరిశీలిస్తోంది. ఈ మెగా డీల్‌పై రానున్న రోజుల్లో రక్షణ శాఖ ఆధ్వర్యంలోని డిఫెన్స్ ప్రొక్యూర్‌మెంట్ బోర్డు చర్చలు జరపనుంది. అక్కడ అంగీకారం లభిస్తే డిఫెన్స్ అక్విజిషన్ కౌన్సిల్ తుది ఆమోదం తెలపనుంది. వీటి సేకరణ పూర్తయితే వాయుసేనలో మొత్తం 176 రఫేల్ యుద్ధ విమానాలు ఉన్నట్టవుతుంది. ఇప్పటికే వాయుసేన కోసం 36 రఫేల్ యుద్ధ విమానాలను కొనుగోలు చేశారు. నౌకాదళం కోసం మరో 36 కొనుగోలు చేసేందుకు ఆర్డర్లు ఇచ్చారు. ఆకాశ యుద్ధంలో రఫేల్‌లు సమర్థంగా వ్యవహరించాయి. ఆపరేషన్ సింధూర్‌లో చైనాకు చెందిన పీఎల్-15 యుద్ధ విమానాలపై ఆధిక్యతను ప్రదర్శించాయి. కాగా, ఆకాశం నుంచి నేలపై ప్రయోగించే దీర్ఘశ్రేణి క్షిపణులను కూడా ఈ యుద్ధ విమానాల్లో అమర్చే ప్రతిపాదనలు ఉన్నాయి. రఫేల్ యుద్ధ విమానాల్లోని ఎం-88 ఇంజన్ల మరమ్మతుకు డసో కంపెనీ హైదరాబాద్‌లో మెయింటనెన్స్, రిపేర్, ఓవర్‌హాల్ (ఎంఆర్‌ఓ) కేంద్రం ఏర్పాటు చేయనుంది. ఇందుకు స్థానికంగా ఉండే కంపెనీల సాయాన్ని తీసుకోనుంది. రఫేల్‌ల తయారీలో టాటా కంపెనీ భాగస్వామిగా చేరే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే దేశంలో సు-30 ఎంకేఐ యుద్ధ విమానాలు, తేలికపాటి యుద్ధ విమానాలైన ఎల్‌సీఏ మార్క్ 1ఏలను తయారు చేస్తున్నారు. 180 విమానాల కోసం ఆర్డర్లు పెట్టారు. 2035 తరువాత అయిదో తరం యుద్ధ విమానాలను కూడా దేశంలో తయారు చేయడానికి ప్రతిపాదనలు ఉన్నాయి.

'రక్తం-క్రికెట్' కలిసి ఆడతాయా?

రక్తం-నీరు కలిసి ప్రవహించవన్నారే!.. పహల్గాం రక్త ధారలు మరిచారా?

» మహిళల సిందూరం చెరిపిన దేశంతో క్రికెట్టా... ఇది దేశభక్తా.. వ్యాపారమా?

» ప్రధాని మోదీపై నిప్పులు చెరిగిన కాంగ్రెస్, శివసేన(యూబీటీ), ఆప్



పాకిస్థాన్‌లో భారత్ క్రికెట్ ఆడటంపై ఆప్ నేత సౌరభ్ నిరసన

న్యూఢిల్లీ, సెప్టెంబరు 13: దుబాయ్‌లో జరుగుతున్న 'ఆసియా కప్'లో భాగంగా ఆదివారం భారత్-పాకిస్థాన్ దేశాల మధ్య క్రికెట్ మ్యాచ్ జరగనుంది. అయితే.. ఈ మ్యాచ్‌పై కాంగ్రెస్ సహా పలు విపక్ష పార్టీలు నిప్పులు చెరుగుతున్నాయి. ఉగ్రవాదులకు ఆశ్రయమిస్తూ... భారత్‌పై ఎగదోస్తున్న పాక్‌తో క్రికెట్ ఆడడమేంటని నాయకులు నిలదీస్తున్నారు. జమ్మూకశ్మీర్‌లోని పర్యాటక ప్రాంతం పహల్గాంలో ఈ ఏడాది ఏప్రిల్ 22న జరిగిన ఉగ్రవాద దాడిని ప్రస్తావిస్తున్నారు. "నాటి దాడిలో ఎంతో మంది మహిళల సిందూరాన్ని చెరిపేసిన పాక్‌తో ఇప్పుడు క్రికెట్ అవసరమా" అని అనేక మంది నాయకులు ప్రశ్నిస్తున్నారు. ఈ మ్యాచ్‌ను బహిష్కరించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు కాంగ్రెస్, శివసేన(యూబీటీ), ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్)ల నాయకులు తీవ్ర విమర్శలు గుప్పించారు. ఢిల్లీలోని ఆప్ కార్యాలయం వద్ద మాజీ మంత్రి సౌరభ్ భరద్వాజ్ పాకిస్థాన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. "నీరు-రక్తం కలిసి ప్రవహించవని.. సింధూ జలాల విషయంపై మీరే ఉద్ఘాటించారు. కానీ, ఇప్పుడు రక్తం-క్రికెట్ కలిసి ఆడుతాయా?. ఇదెలా?." అని శివసేన(యూబీటీ) అధినేత, మాజీ సీఎం ఉద్ధవ్ ఠాక్రే ప్రధాని మోదీని నిలదీశారు. "యుద్ధం-క్రికెట్.. ఒకే సమయంలో ఎలా జరుగుతాయి?. దేశ భక్తికి తోసిరాజని మీరు వ్యాపారం చేస్తున్నారు." అని నిప్పులు చెరిగారు. పహల్గాం ఉగ్రదాడి బాధిత కుటుంబాలు కూడా భారత్-పాక్ క్రికెట్ మ్యాచ్‌ను తప్పుబట్టాయి. ఉగ్రదాడిలో తన భర్త శుభం ద్వివేదీని కోల్పోయిన ఐషన్య ద్వివేదీ స్పందిస్తూ.. "ఇది చాలా తప్పు. బీసీసీఐ మనసులేకుండా, కనీస మానవత్వం చూపకుండా వ్యవహరిస్తోంది" అని వ్యాఖ్యానించారు.

ఉద్ధవ్‌కు నైతిక హక్కు లేదు: శివసేన

శివసేన(యూబీటీ) చీఫ్ ఉద్ధవ్ ఠాక్రేపై.. శివసేన(శిండే) నేతలు విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు కూడా భారత్-పాక్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగాయని, ఆ సమయంలో కూడా ఇరు జట్ల మధ్య క్రికెట్ సమరం జరిగిందని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో ఉద్ధవ్‌కు తాజా మ్యాచ్‌పై విమర్శలు చేసే నైతిక హక్కులేదని విమర్శించారు. అధికారం కోసం హిందూత్వను వదిలేసిన ఉద్ధవ్.. ఒకానొక దశలో పాక్‌పై ప్రశంసలు గుప్పించారని గుర్తు చేశారు.

మనం వచ్చేస్తే.. పాక్‌కు లబ్ధి: కేంద్రం

భారత్-పాక్ క్రికెట్ మ్యాచ్ వివాదంపై కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ స్పందించారు. "అందరూ అర్థం చేసుకోవాలి. ఆసియా కప్‌లో మనం ఆడితీరాలి. ఒక వేళ మనం తప్పుకొంటే.. పాకిస్థాన్ మ్యాచ్ పాయింట్లను సొంతం చేసుకుంటుంది. ఏసీసీ, ఐసీసీలు అంతర్జాతీయ మ్యాచ్‌లు నిర్వహించినప్పుడు మనం పాల్గొనక తప్పదు. దేశాల పరంగా చూసినా ఇది అవసరం. పైగా.. మనం పాక్‌తో ద్వైపాక్షిక మ్యాచ్ ఆడడం లేదు." అని అన్నారు. అంతేకాదు, ఉగ్రవాదానికి పాక్ మద్దతు ఉపసంహరించే వరకు వారితో ద్వైపాక్షిక మ్యాచ్ ఆడకూడదన్నది భారత విధానమని తెలిపారు. మరోవైపు, జమ్ము కశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా కూడా.. ఈ మ్యాచ్‌ను సమర్థించారు.

ఎస్‌ఐఆర్ నిర్వహణ మా పరిధిలోనిదే!

» దాంట్లో న్యాయస్థానాల జోక్యం వద్దు

» సుప్రీంకోర్టుకు స్పష్టం చేసిన ఈసీ

» 2026 జనవరి 1 ప్రాతిపదికగా దేశవ్యాప్తంగా ఎస్‌ఐఆర్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 13: ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియ (ఎస్‌ఐఆర్) మీద పూర్తి అధికారాలు తమవేనని, దీనిపై సుప్రీంకోర్టు ఎటువంటి ఆదేశాలు జారీ చేసినా అది తమ పరిధిలో జోక్యం చేసుకోవటమే అవుతుందని ఎన్నికల సంఘం (ఈసీ) తెలిపింది. దేశవ్యాప్తంగా ప్రతీ ఎన్నికకు ముందు ఎస్‌ఐఆర్ నిర్వహించేలా ఈసీని ఆదేశించాలని కోరుతూ అశ్వినీ కుమార్ ఉపాధ్యాయ్ అనే న్యాయవాది సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై ఈసీ ఈ మేరకు కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 324 ప్రకారం పార్లమెంటుకు, దేశంలోని అన్ని శాసనసభలకు ఎన్నికలు నిర్వహించటం, ఓటర్ల జాబితాను సిద్ధం చేయటం పూర్తిగా తమకు సంబంధించిన విషయమేనని ఈసీ పేర్కొంది. క్షేత్రస్థాయిలో నెలకొన్న పరిస్థితులను బట్టి ఓటర్ల జాబితాను సమూలంగా ప్రక్షాళన చేయాలా? లేక, కొన్ని మార్పులు సరిపోతాయా? అన్నది ఈసీ నిర్ణయాధికారమని తెలిపింది. దీంట్లో భాగంగానే బిహార్ మినహా దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలితప్రాంతాల్లో 2026 జనవరి 1వ తేదీ ప్రాతిపదికగా ఎస్‌ఐఆర్ చేపట్టాలని గత నెల 5వ తేదీన ఎన్నికల ప్రధానాధికారులకు (సీఈఓలకు) ఆదేశాలు జారీ చేశామని ఈసీ సుప్రీంకోర్టుకు తెలిపింది.

భారీ సుంకాలతో బాదేయండి!

» భారత్, చైనాను లక్ష్యంగా చేసుకోండి

» జీ-7 సభ్య దేశాలపై అమెరికా ఒత్తిడి

న్యూయార్క్, సెప్టెంబరు 13: రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న భారత్, చైనాపై భారీ సుంకాలు విధించాలని జీ7 దేశాలను అమెరికా ఒత్తిడి చేస్తోంది. ఉక్రెయిన్‌తో యుద్ధం మూడో ఏడాదిలోకి అడుగుపెడుతున్న నేపథ్యంలో మాస్కో ఆదాయ మార్గాలను మూసివేసే ప్రయత్నాల్లో భాగంగా ట్రంప్ యంత్రాంగం తాజా ప్రతిపాదనలను తెరపైకి తీసుకొచ్చింది. కెనడా ఆర్థిక మంత్రి నేతృత్వంలో శుక్రవారం జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో జీ7 సభ్య దేశాల ఆర్థిక మంత్రులు సమావేశమయ్యారు. ఉక్రెయిన్‌కు నిధులు సమకూర్చడానికి స్తంభింపజేసిన రష్యన్ ఆస్తులను ఉపయోగించుకోవడం సహా పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా సుంకాల విషయంలో తాను అనుసరిస్తున్న మార్గాన్ని పాటించాలని అమెరికా వాణిజ్య మంత్రి స్కాట్ బెస్సెంట్ వారిని కోరారు. కాగా, ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించే దిశగా నాటో దేశాలు చైనాపై 50 నుంచి 100 శాతం సుంకాలు విధించాలని, రష్యా నుంచి చమురు కొనుగోలు చేయడం మానుకోవాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పేర్కొన్నారు. దీనికి నాటో దేశాలన్నీ అంగీకరిస్తే రష్యాపై భారీ ఆంక్షలు విధించడానికి తాను కూడా సిద్ధంగా ఉన్నానని తెలిపారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా ట్రూత్ సోషల్‌లో శనివారం పోస్టు చేశారు. నాటో దేశాలు రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తుండటంపై ఆయన దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇటువంటి చర్యలు రష్యాతో చర్చలు, బేరసారాలను బలహీనపరుస్తున్నాయన్నారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : N.Rahul Kumar,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.